www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 22-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 353 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి తె.5.24 తదుపరి నవమి; నక్షత్రం: మూల తె.3.23 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ.10.18-12.00, రా.1.40-3.23; అమృతఘడియలు: రా.8.33-10.15; దుర్ముహూర్తం: ఉ.6.21-7.57; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 6.22 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హరీశ్ పద్ధతిగా మాట్లాడాలి!

సీఎంకు అజ్ఞానం.. మంత్రులకు బుద్ధిమాంద్యం అంటారా?
మీలా ఆదాయం లేకున్నా.. బడ్జెట్ పెంచుకుంటూ పోలేదు
పదేళ్లలో వారు రూ.16.70 లక్షల కోట్ల వ్యయం చేశారు
సాగర్ కట్టారా? బీడీఎల్, ఈసీఐఎల్‌ను నిర్మించారా?
రాష్ట్రాన్ని గాలికొదిలేసినవారే క్షమాపణ చెప్పాలి
స్వేచ్ఛ గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడటమా?.. బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం భట్టి సమాధానం



13

ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో.. నోట్ల కట్టలు!

అగ్ని ప్రమాదంతో బయటపడ్డ గుట్టు

హోలీ నాడు జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అగ్ని ప్రమాదం.. ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది
అక్కడ వారికి ఓ గదిలో కనిపించిన డబ్బు కట్టలు
ఈ నెల 14న ఘటన జరిగితే.. 21న వెలుగులోకి
రూ.15-50 కోట్ల దాకా ఉంటుందంటూ కథనాలు
ప్రభుత్వ వర్గాల ద్వారా సీజేఐకి ఈ సమాచారం
ఆయన నేతృత్వంలో సమావేశమైన కొలీజియం
జస్టిస్ వర్మ బదిలీకి ఆ భేటీలో ఏకగ్రీవ ప్రతిపాదన!
అలహాబాద్ హైకోర్టు న్యాయవాదుల అభ్యంతరం
తమ హైకోర్టు ఏమైనా చెత్తబుట్టా? అని ఆగ్రహం
డబ్బు కట్టలపై ఢిల్లీ హైకోర్టు సీజే ఇప్పటికే అంతర్గత విచారణ చేపట్టినట్టు ఓ ప్రకటనలో సుప్రీం వెల్లడి
విచారణకు, బదిలీకి సంబంధం లేదన్న సుప్రీం
జడ్జి ఇంట్లో డబ్బే దొరకలే: ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ డీజీ

న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి ఆ ఇంట్లో కట్టల కొద్దీ నగదు కనిపించినట్టు వచ్చిన వార్త దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నెల 14 (హోలీ రోజు) రాత్రి 11.35 గంటల సమయంలో ఈ ప్రమాదం జరగ్గా.. డబ్బు కట్టలు బయటపడ్డ విషయం 21వ తేదీ దాకా బయటకు రాకపోవడం మిస్టరీగా మారింది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో న్యాయమూర్తి ఊళ్లో లేరని సమాచారం. ఆయన కుటుంబసభ్యులు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా.. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి లోపలకు వెళ్లగా ఒక గదిలో కట్టల కట్టల నగదు కనిపించిందని.. ఆ డబ్బు రూ.15 కోట్ల దాకా ఉంటుందని కొన్ని వర్గాలు తెలపగా.. దొరికిన డబ్బు రూ.50 కోట్ల దాకా ఉంటుందని మరికొన్ని వర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా ఆ రోజు ఎంత డబ్బు బయటపడిందన్న విషయంపై అధికారిక సమాచారమేదీ లేదు. కాగా.. జడ్జి ఇంట్లో భారీ ఎత్తున నగదు బయటపడిన విషయాన్ని స్థానిక పోలీసులు ఉన్నతాధికారులకు చేరవేశారని.. వారి ద్వారా ఈ విషయం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాకు తెలిసిందని సమాచారం. ఆయన దీన్ని తీవ్రంగా పరిగణించి కొలీజియం సమావేశం నిర్వహించగా.. జస్టిస్ వర్మను అలహాబాద్



జస్టిస్ యశ్వంత్ వర్మ

హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం ఏకగ్రీవంగా ప్రతిపాదించినట్టు సమాచారం. అయితే.. జరిగిన ఘటన తీవ్రత నేపథ్యంలో కేవలం జడ్జి బదిలీతో సరిపెడితే అది న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను, ప్రజలకు న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది కాబట్టి జస్టిస్ వర్మ రాజీనామా కోరాలని కొలీజియంలోని కొందరు సభ్యులు

మిగతా 2వ పేజీలో...

అలహాబాద్ హైకోర్టు తీర్పు ఆందోళనకరం

2

బాలిక పైజామా తాడు లాగినా రేప్ కిందికి రాదనడం సరికాదు
సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి
కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి

తెలంగాణ.. తిరోగమనం!

అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్‌లా రేవంత్ పాలన
బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప ఏమీ లేదు
జాబ్ క్యాలెండర్ కాదు.. జాబ్‌లెస్ క్యాలెండర్
ఏ గ్రామంలోనైనా రుణమాఫీ 100% అయిందా?
మొహబ్బత్ కీ దుకాన్ కాదు.. నఫ్రత్ కా మకాన్
సీఎం ప్రతీకార రాజకీయాలతో క్షీణించిన రాబడి
ఎక్కడాలేని మాంద్యం తెలంగాణలోనే ఎందుకు?
మా హయాంలో అప్పు రూ.4.22 లక్షల కోట్లే
గ్రామాల నుంచి మండలాలకు మేం రోడ్లు వేశాం
బడ్జెట్‌పై చర్చలో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పరుగులు తీసిన రాష్ట్ర ప్రగతి రథానికి రేవంత్‌రెడ్డి మార్క్ పాలన స్పీడ్ బ్రేకర్‌లా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. టాప్‌గేర్ నుంచి రాష్ట్రం క్రమక్రమంగా రివర్స్ గేర్‌లో పడే ప్రమాదం కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ మాయమాటలు ఎక్కువకాలం నిలవవని, వారి కుటిల నీతి ప్రజలకు అర్థమైందన్నారు. 'కాంగ్రెస్ నేత రాహుల్ దేశమంతా తిరుగుతూ మొహబ్బత్ కీ దుకాన్ (ప్రేమలు పంచే వేదికలు) అంటుంటే.. రేవంత్ తన పాలనతో నఫ్రత్ కా మకాన్ (విద్వేషపు ఇల్లు)గా మార్చారు. ఇందిరమ్మ రాజ్యం వస్తదంటే జనం ఏమో అనుకున్నరు. చివరికి ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. 6 గ్యారంటీల అమలేమోగానీ.. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారు' అని హరీశ్ ధ్వజమెత్తారు. రేవంత్‌ను ఎన్నుకున్న ఒకే ఒక

మిగతా 13వ పేజీలో...

రోడ్లు లేవని పిల్లనిస్తలేరు!



వికారాబాద్ గ్రామాల్లో అధ్వానంగా రోడ్లు

13

స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు
వాళ్ల హయాంలో మామ, అల్లుడు, బామ్మర్ది రోడ్లు వేసుకున్నరు
కమీషన్లు రావనే అన్నిచోట్ల వేయలేదు
మంత్రి కోమటిరెడ్డి విమర్శ

రేవంత్‌తో హరీశ్‌రావు భేటీ

12

పద్మారావుగౌడ్‌తో కలిసి సీఎం చాంబర్‌కు
సికింద్రాబాద్ సమస్యలపైనేనన్న నేతలు

రాష్ట్రంలో కొత్తగా 70 బార్లు!

కసరత్తు చేస్తున్న ఆబ్కారీ శాఖ
త్వరలోనే నోటిఫికేషన్!.. రాబడి ఎక్కువ ఉన్న ప్రాంతాలపై దృష్టి
ఎలైట్ బార్లకూ అవకాశం!
మైక్రోబ్రూవరీలను పెంచే యోచన

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆదాయాన్ని రాబట్టుకోవడమే లక్ష్యంగా కొత్త బార్లకు అనుమతి ఇచ్చేందుకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. జనాభాతోపాటు రాబడి ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ప్రాతిపదికగా తీసుకుని అనుమతులు ఇవ్వనున్నారు. ఈ మేరకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 70కిపైగా కొత్త బార్లు వచ్చే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే, ఎలైట్ బార్లకు

మిగతా 12వ పేజీలో...



నిజామాబాద్ మార్కెట్లో తడిసిన పసుపు కొమ్ములు

గాలి వాన దుమారం

14

పలు జిల్లాల్లో వర్షం, వడగళ్లు
కాగజ్‌నగర్లో గోడకూలి వృద్ధుడి మృతి
నేడు, రేపు పలు జిల్లాలకు వర్షసూచన
అప్రమత్తంగా ఉండండి
అధికారులకు సీఎం, సీఎస్ ఆదేశాలు

జీహెచ్ఎంసీలో 'బిల్డ్ నౌ' షురూ

12

అధికారులకు లాగిన్, పాస్‌వర్డ్ అందజేత
హెచ్ఎండీఏలో ఏప్రిల్ మొదటి వారంలో..
అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అమలు

తక్కువ వడ్డీకి రుణాలివ్వండి!



నాబార్డు చైర్మన్ కేవీ షాజీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆర్ఐడీఎఫ్ కింద మంజూరు చేయండి
సూక్ష్మ నీటిపారుదలకు నిధులు ఇవ్వండి
కొత్తగా పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయండి
నాబార్డు చైర్మన్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి

చెన్నై అఖిలపక్ష సమావేశానికి సీఎం

పునర్విభజనపై స్టాలిన్ అధ్యక్షతన నేడు పలు పార్టీల భేటీ.. పాల్గొననున్న సీఎం, పీసీసీ చీఫ్
జేఏసీలో కాంగ్రెస్‌తో కలిసి బీఆర్ఎస్

12

చెన్నై చేరిన కేటీఆర్ బృందం



సస్పెన్షన్ వేటుపడిన ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి బయటకు తీసుకొస్తున్న మార్షల్స్

వలపువలలో కన్నడ నేతలు

కర్ణాటకను కుదిపేస్తున్న హనీట్రాప్
ఇద్దరు మంత్రులు సహా 48 మంది ఎమ్మెల్యేలపై అశ్లీల వీడియోలు
కొందరు జాతీయ పార్టీ నేతలు, న్యాయమూర్తులవి కూడా..
అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి రాజన్న
వెనుక డీకే శివకుమార్ ఉన్నారని బీజేపీ, కాంగ్రెస్ నేతల అనుమానాలు
అసెంబ్లీలో గందరగోళం.. 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలపై ఆర్నెల్ల సస్పెన్షన్
ఎవ్వరినీ వదలం: కర్ణాటక సీఎం

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హనీట్రాప్ వ్యవహారం కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తోంది. ఆ పార్టీ, ఈ పార్టీ అని కాకుండా పలువురు నేతలు ఇందులో చిక్కుకున్నారు. ఇద్దరు మంత్రులు సహా 48 మంది కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు, కేంద్ర కాంగ్రెస్ నాయకులు, న్యాయమూర్తులపై అశ్లీల వీడియోలు తీసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఓ సీనియర్ మంత్రే అసెంబ్లీలో బయటపెట్టడం కలకలం రేపింది. తాను కూడా హనీట్రాప్ బాధితుడినేనని, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసలీ అంశం వెనుక.. సీఎం కావాలని అభిలషిస్తున్న సీనియర్ నాయకుడి హస్తం ఉందని కాంగ్రెస్‌లో చర్చ నడుస్తోంది. కొందరు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై

మిగతా 2వ పేజీలో...

'బెట్టింగ్ యాప్' నిందితులకు 24 గంటల్లో నోటీసులు!

సినీ, టీవీ ప్రముఖులకు ఇచ్చేందుకు రంగం సిద్ధం
కేసును కొట్టేయాలంటూ హైకోర్టుకు యాంకర్ శ్యామల
24న విచారణకు హాజరై సహకరించాలన్న ధర్మాసనం
మంథనిలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

11

108 బెట్టింగ్ యాప్‌ల బ్లాక్.. 133 కంపెనీలకు నోటీసులు

'వలపు వల'లో కన్నడ నేతలు

(మొదటి పేజీ తరువాయి)



కర్ణాటక సహకార మంత్రి రాజన్న

అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. దీనికి సీఎం సిద్ధరామయ్య సమాధానం చెప్పాలని బీజేపీ సభ్యులు అసెంబ్లీలో పట్టుబట్టారు. జ్యుడీషియల్ విచారణ గానీ, సీబీఐ దర్యాప్తు గానీ చేపట్టాలని డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి గందరగోళం సృష్టించారు. కాగితాలు చించి స్పీకర్‌పై విసిరివేశారు. దీంతో 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను ఆరు నెలలపాటు సస్పెండ్ చేస్తూ పాలక పక్షం సభలో తీర్మానించింది. మార్షల్స్ సాయంతో వారిని సభ బయటకు పంపింది.

మూడ్రోజుల కిందట..

హనీట్రాప్ అంశాన్ని తొలుత బుధవారం బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీల్‌కుమార్ ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హనీట్రాప్ ఫ్యాక్టరీ నడుపుతోందని, ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. హనీట్రాప్ వెనుక కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు ఉన్నారని.. నాయకత్వ సంక్షోభంలో రాజకీయ ప్రత్యర్థుల ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఇలా చేశారని బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ కూడా ఆరోపించారు. సీఎం పదవిపై కన్నేసిన కాంగ్రెస్ నేతలు ఇలాంటి కుయత్నాలకు దిగినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. దీనిపై గురువారం సహకార మంత్రి కేఎన్ రాజన్న సభలో ప్రస్తావించారు. తాను కూడా హనీట్రాప్ బాధితుడినని చెప్పడంతో సభలో కలకలం రేగింది. 'నేనొక్కడినే కాదు. 48 మంది ఎమ్మెల్యేలతో పాటు కేంద్ర నాయకులు, న్యాయమూర్తులు కూడా బాధితులే. వారి అశ్లీల వీడియోలు తీశారు. కొందరి వద్ద సంబంధిత పెన్‌డ్రైవ్‌లు, సీడీలు ఉన్నట్లు నాకు సమాచారం ఉంది. ఇది కర్ణాటకకే పరిమితం కాలేదు. చాలా మంది జాతీయ స్థాయి పార్టీ నేతల పెన్‌డ్రైవ్‌లు కూడా ఉన్నాయి. దీనిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తా. లోతైన దర్యాప్తు జరగాలి. ఈ పెన్‌డ్రైవ్‌లు, సీడీల సృష్టికర్తలు ఎవరు? వీటి దర్శకులెవరు.. నటులెవరు.. అంతా బయటకు రావాలి' అని స్పష్టం చేశారు. ఇది చాలా తీవ్రమైన అంశమని.. రాజన్న లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సమగ్ర దర్యాప్తు జరిపిస్తానని హోం మంత్రి జి.పరమేశ్వర హామీ ఇచ్చారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న మాట్లాడుతూ.. తాను కూడా రాజకీయ వేధింపులకు బలయ్యానని అన్నారు.

అసెంబ్లీలో దుమారం..

బడ్జెట్ సమావేశాల చివరిరోజైన శుక్రవారం ఈ అంశంపై కర్ణాటక అసెంబ్లీలో తీవ్ర గందరగోళం చెలరేగింది. సభ ఉదయం ప్రారంభం కాగానే బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు వెల్‌లోకి దూసుకెళ్లారు. హనీట్రాప్ రుజువులంటూ సీడీలను ప్రదర్శించారు. బడ్జెట్‌పై చర్చకు సీఎం సిద్ధరామయ్య సిద్ధం కాగా.. మొదట హనీట్రాప్ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. దీనిపై హోం మంత్రి ఇప్పటికే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారని, ఇలాంటి కార్యకలాపాల్లో పాత్ర ఉన్న ఏ పార్టీ నేతనూ వదిలేది లేదని సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఓవైపు ఆయన వివరణ ఇస్తుండగానే బీజేపీ సభ్యులు పోడియంవైపు దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాయంత్రం 4.30 గంటలకు తిరిగి సభ ప్రారంభం కాగానే.. స్పీకర్ స్థానాన్ని అగౌరవపరచినందుకు 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను 6నెలలపాటు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ఖాదర్ ప్రకటించారు. వారు బయటకు వెళ్లకపోవడంతో మార్షల్స్ వచ్చి బలవంతంగా తీసుకెళ్లారు.

ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో.. నోట్ల కట్టలు!



జస్టిస్ యశ్వంత్ వర్మ

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడినట్టు తెలిసింది. ఒకవేళ ఆయన అందుకు నిరాకరిస్తే సీజేఐ ఆయనపై అంతర్గత విచారణ చేపట్టాలని కూడా సూచించినట్టు సమాచారం. కాగా.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనపై అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా స్పందించింది. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ఏదో కొరవడుతోందని, అది అవినీతికి దారితీసి.. అంతిమంగా ప్రజలకు న్యాయవ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వెలిబుచ్చింది. "అలహాబాద్ హైకోర్టు ఏమీ చెత్తబుట్టా?" అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

తప్పుడు సమాచారం..

అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్‌తోపాటు.. దేశవ్యాప్తంగా న్యాయవర్గాలు, ప్రజల నుంచి దీనిపై విమర్శలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఒక ప్రకటన విడుదల చేసింది. "జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటివద్ద జరిగిన ఘటనకు సంబంధించి తప్పుడు సమాచారం, వదంతులు వ్యాపిస్తున్నాయి" అని అందులో పేర్కొంది. ఈ వ్యవహారంపై మార్చి 20న సుప్రీం కోలీజియం సమావేశం కావడానికి ముందే.. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణ ప్రారంభించి, వివరాలు సేకరిస్తున్నారని వెల్లడించింది. ఆయన్నుంచి నివేదిక అందగానే దాన్ని పరిశీలించి తదుపరి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. "ఢిల్లీ హైకోర్టులో రెండో సీనియర్ మోస్ట్ జడ్జి, కొలీజియం సభ్యుడు అయిన జస్టిస్ యశ్వంత్‌వర్మను.. ఆయన పేరెంట్ కోర్టు అయిన 'హైకోర్ట్ ఆఫ్ జ్యుడికేచర్ ఎట్ అలహాబాద్'కు బదిలీ చేయాలన్న ప్రతిపాదన, ఢిల్లీ హైకోర్టులో ఆయనపై జరుగుతున్న అంతర్గత విచారణ.. ఈ రెండూ వేర్వేరు అంశాలు. ఆయన్ను బదిలీ చేయాలన్న ప్రతిపాదనను సుప్రీం సీజే, నలుగురు సీనియర్ మోస్ట్ సుప్రీం జడ్జీలతో కూడిన కొలీజియం మార్చి 20న పరిశీలించింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులోని కన్సల్టీ జడ్జీలకు, సంబంధిత హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖలు రాసింది. వారి నుంచి వచ్చిన ప్రతిస్పందనలను పరిశీలించి, కొలీజియం దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటుంది" అని ఆ ప్రకటనలో సుప్రీంకోర్టు పేర్కొంది.

తీవ్రమైన విషయం..

జస్టిస్ వర్మ ఇంట్లో డబ్బు కట్టల వ్యవహారంపై పలువురు ప్రముఖ న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలా తీవ్రమైన విషయమని.. ఆయన్ను వెంటనే రాజీనామా చేయాల్సిందిగా కోరాలని సీనియర్ అడ్వొకేట్ వికాస్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యవహారాల్లో బదిలీ పరిష్కారం కాదని ఆయన తేల్చిచెప్పారు. ఇక.. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు అంతర్గత విచారణ జరిపి, నిజాలను రాబట్టాలని మరో సీనియర్ అడ్వొకేట్ రాకేశ్ ద్వివేది అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించిన వాస్తవాలను పూర్తిగా, స్వేచ్ఛగా, సూటిగా బయటపెట్టాల్సిన బాధ్యత సుప్రీంకోర్టు కోలీజియంపై ఉందని సీనియర్ అడ్వొకేట్ ఇందిరా జైసింగ్ అన్నారు. ఎప్పుడో మార్చి 14న ఘటన జరిగితే.. మార్చి 21 దాకా ఆ విషయం బయటపడకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

రాజ్యసభలో ప్రస్తావన..

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో.. శుక్రవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం గురించి రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ స్పందన కోరారు. అలాగే.. అలహాబాద్ హైకోర్టు జడ్జికే సంబంధించి పెండింగ్‌లో ఉన్న అభిశంసన నోటీసు గురించి కూడా గుర్తుచేశారు. దీనిపై స్పందించిన జగ్‌దీప్ ధన్‌ఖడ్.. ఈ ఘటన జరిగిన వెంటనే బయటకు రాకపోవడం తనను ఎక్కువగా బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు.. జడ్జి బదిలీతో ఈ వ్యవహారాన్ని ముగించలేరని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. "జస్టిస్ వర్మ.. ఉన్నావ్ రేప్ కేసు సహా పలు తీవ్రమైన కేసులను వింటున్నారు. న్యాయవ్యవస్థపై దేశప్రజలకు ఉన్న నమ్మకాన్ని పోకుండా చూడాలంటే.. ఆయన ఇంట్లో దొరికిన డబ్బు ఎవరిదో, ఆయనకు ఎందుకు ఇచ్చారో కనిపెట్టాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

ఎవరీ జస్టిస్ వర్మ?

కోట్ల కొద్దీ డబ్బు కట్టల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ.. 1969, జనవరి 5న అలహాబాద్‌లో జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీ హన్స్‌రాజ్ కాలేజీలో బీకామ్ ఆనర్స్ పట్టా పుచ్చుకున్న ఆయన.. మధ్యప్రదేశ్‌లోని రేవా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1992 ఆగస్టు 8న అలహాబాద్ హైకోర్టులో అడ్వొకేట్‌గా పేరు నమోదు చేసుకున్నారు. 2006 నుంచి 2014 అక్టోబరు దాకా అలహాబాద్ హైకోర్టు స్పెషల్ కౌన్సెల్‌గా సేవలందించారు. 2014 అక్టోబరులో.. అలహాబాద్ హైకోర్టులో అదనపు జడ్జిగా నియమితులయ్యారు. 2021 అక్టోబరులో ఆయన్ను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేశారు.

డబ్బు కట్టలేం దొరకలేదు

» ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్

జస్టిస్ వర్మ ఇంట్లో కట్టల కొద్దీ డబ్బు దొరికిన వ్యవహారంపై దేశవ్యాప్తంగా దుమారం రేగుతుండగా.. ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ మాత్రం ఆయన ఇంట్లో తమ సిబ్బందికి అసలు డబ్బే దొరకలేదని చెప్పారు. శుక్రవారం ఈ అంశంపై ఆయన వివరణ ఇచ్చారు. "మార్చి 14న రాత్రి 11.35 గంటలకు.. జస్టిస్ వర్మ నివాసంలో మంటలు చెలరేగాయని పేర్కొంటూ మా కంట్రోల్ రూమ్‌కు కాల్ వచ్చింది. 11.43 గంటలకల్లా రెండు అగ్నిమాపక శకటాలను ఆయన ఇంటికి పంపించాం. కాగితాలు, ఇతర వస్తువులు ఉన్న స్టోర్ రూమ్‌లో చెలరేగిన మంటలను మా సిబ్బంది 15 నిమిషాల్లో ఆర్పేశారు. వెంటనే దీనిపై పోలీసులకు సమాచారం అందించి.. మా సిబ్బంది అక్కణ్నుంచీ వచ్చేశారు. మా ఫైర్‌ఫైటర్లు అక్కడ ఎలాంటి నగదునూ కనుగొనలేదు" అని ఆయన స్పష్టం చేశారు.



లోకం తీరు

అలహాబాద్ హైకోర్టు తీర్పు ఆందోళనకరం

» బాలిక పైజామా తాడు లాగినా రేప్ కిందికి రాదనడం సరికాదు

» కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి వ్యాఖ్య



న్యూఢిల్లీ, మార్చి 21: మైనర్ బాలిక ఛాతీపై చేయి వేసినా, ఆమె ధరించిన పైజామా తాడు లాగినా దానిని రేప్, అత్యాచార యత్నంగా పరిగణించబోరంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. తీవ్రమైన ప్రభావం చూపే ఈ తీర్పులో జోక్యం చేసుకోవాలని సుప్రీంకోర్టును కోరింది. శుక్రవారం కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పును తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. నాగరిక సమాజంలో ఇలాంటి తీర్పులకు చోటు లేదని అన్నారు. 2011లో 11 ఏళ్ల బాలికను ఇద్దరు యువకులు (21 ఏళ్లు) వంతెన కిందికి తీసుకెళ్లి ఆమె ఛాతీపై చేయి వేయడంతో పాటు, ఆమె ధరించిన పైజామా తాడును లాగారు. అదే సమయంలో ఎవరో వస్తుండడాన్ని చూసి పారిపోయారు. పోలీసులు వారిద్దరిపై ఐపీసీలోని సెక్షన్ 376 (రేప్), పోక్సో చట్టంలోని సెక్షన్ 18 (నేరం చేసేందుకు ప్రయత్నించడం) కింద కేసులు పెట్టారు. కానీ, అలహాబాద్ హైకోర్టు.. వారు అత్యాచారం చేయడానికి ప్రయత్నించినట్టు కనిపించడం లేదని భావించి.. తక్కువ శిక్షలు పడే ఐపీసీ సెక్షన్ 354బీ(దుస్తులు లాగేందుకు బలవంతంగా ప్రయత్నించడం), పోక్సో చట్టంలోని సెక్షన్ 9/10 (లైంగికదాడికి పాల్పడడం) కింద మళ్లీ కేసు పెట్టాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది.

మీద కూర్చొని.. గుండెల్లో మూడు సార్లు పొడిచేసింది..

» భయపెడుతున్న మర్చంట్ నేవీ అధికారి హత్య తీరు

మేరఠ్, మార్చి 21 : ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో జరిగిన మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య విషయంలో ఒళ్లు గగుర్పొడిచే విషయాలు బయటికొస్తున్నాయి. భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్.. మార్చి 4న సౌరభ్‌ను చంపి 15 ముక్కలు చేసి వాటిని ఓ సిమెంట్ డ్రమ్ములో వేసి విహారయాత్రకు వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే, పథకం ప్రకారం సౌరభ్‌ను మత్తులోకి పంపిన ముస్కాన్.. భర్త ఛాతీ మీద కూర్చొని.. అతని గుండెల్లో మూడు సార్లు కత్తితో పొడిచేసింది. కత్తితో పొడిచేందుకు ముస్కాన్ తొలుత సంశయించగా.. "మనం కొత్త జీవితం మొదలుపెట్టాలంటే నువ్వు సౌరభ్‌ను చంపాల్సిందే" అంటూ సాహిల్ చెప్పిన మాటలకు ప్రభావితమై ఘాతుకానికి పాల్పడింది. కత్తిని ఎలా పట్టుకోవాలి, ఎలా పొడవాలి అంటూ సాహిల్ చేసిన సూచనలను పాటిస్తూ కిరాతకానికి తెగబడింది. ఈమేరకు సౌరభ్‌ను హత్య చేసిన తీరును ముస్కాన్ పోలీసులకు వెల్లడించింది. సౌరభ్ మొండాన్ని బెడ్‌బాక్స్‌లో పెట్టి ముస్కాన్ ఆ రాత్రి అదే మంచంపై నిద్రించిందని, కాళ్లూచేతులను సాహిల్ తన ఇంటికి తీసుకెళ్లాడని, కానీ పథకం మార్చుకుని తర్వాతి రోజు వాటిని ఓ డ్రమ్ములో వేసి సిమెంట్ పోశారని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇక, ఈ కేసులో మరో నిందితుడైన ముస్కాన్ ప్రియుడు సాహిల్ విచిత్రమైన స్వభావం కలిగిన వ్యక్తి అని, డ్రగ్స్ బానిసని పోలీసు విచారణలో తేలింది.

ఇది గర్వించదగ్గ క్షణం: మోదీ

» బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిపై ప్రధాని హర్షం

న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దేశంలో ఒక బిలియన్(100 కోట్ల) టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది గర్వించదగ్గ క్షణం అని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ విజయం దేశ ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధి, ఆత్మ నిర్భరత విషయంలో మన నిబద్ధతకు అద్దం పడుతుందన్నారు. బొగ్గు రంగంలో పని చేస్తున్న వారి అందరి అంకిత భావానికి ఇది నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ఇదే విషయమై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా ఆనందం వ్యక్తం చేశారు. 100 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశం చరిత్రాత్మక మైలు రాయిని దాటిందన్నారు. దేశంలోని విద్యుత్ అవసరాలను తీర్చడమే కాకుండా, దేశ ఆర్థిక వృద్ధికి, యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఈ గొప్ప విజయం ఊతమిస్తుందని ఆయన అన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులకు కిషన్ రెడ్డి శుభాకాంక్షలను తెలిపారు.

'ప్రతిభ' అనే భావనే అనుచితం: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మార్చి 21: ప్రతిభ అనే భావనే అనుచితమని.. అగ్ర కులాల కథనమని.. పూర్తిగా లోపభూయిష్టమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. భారతీయ విద్యావ్యవస్థ బడుగు వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్‌తో తాను జరిపిన సంభాషణను రాహుల్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. పరిపాలన, విద్యా రంగాల్లో సమానావకాశాల కోసం దళితులు, గిరిజనులు ఇప్పటికీ పోరాడుతున్నారని ఆయన తెలిపారు. భారత్‌లో అసమానతల వెనుక నిజాన్ని వెలికితీసేందుకు కులగణన ముఖ్యమన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. ప్రతిభ వ్యతిరేక మనస్తత్వం ప్రమాదకరమని, కుటుంబవాదులు, వంశపారంపర్య మనస్తత్వం కలిగినవారు ఎన్నటికీ ప్రతిభను గౌరవించరని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ విమర్శించారు. ఇదిలా ఉండగా, 'మనం బీజేపీ, ఆరెస్సెస్‌తోనే కాదు..భారత రాజ్యంపైనే పోరాటం చేస్తున్నాం' అన్న వ్యాఖ్యల కేసులో సంభాల్ కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. ఏప్రిల్4న హాజరు కావాలని, లేదంటే సమాధానమైనా పంపించాలని జిల్లా కోర్టు ఆదేశించింది. ఆయన వ్యాఖ్యలపై అభ్యంతరం తెలుపుతూ సిమ్రన్ గుప్త అనే వ్యక్తి కేసు వేశారు.

ఎంపీలకు రాష్ట్రపతి అల్పాహార విందు

న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పలువురు పార్లమెంట్ సభ్యులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం అల్పాహార విందు ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా, గోవా, ఢిల్లీ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నాగర్ హవేలీ, డామన్ డయ్యూలకు చెందిన ఎంపీలతో కలిసి ఆమె అల్పాహారం చేశారు. వారితో కొంతసేపు ముచ్చటించారు. ఈ అల్పాహార విందులో తెలంగాణ నుంచి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురామ్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, బలరాం నాయక్, రఘువీర్ రెడ్డి, వంశీకృష్ణ, కడియం కావ్య, బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, నగేష్ , బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, సురేష్ రెడ్డి, దామోదర్ రావులు పాల్గొన్నారు.

లండన్‌లో ఎయిర్‌పోర్టు రోజంతా మూసివేత

లండన్, మార్చి 21: లండన్‌లోని హీత్రూ విమానాశ్రయానికి విద్యుత్తు సరఫరా చేసే ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో, ఎయిర్‌పోర్టుకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా శుక్రవారం రోజంతా ఎయిర్‌పోర్టును మూసేశారు. ఈ ప్రభావం దాదాపు 1,350 విమాన సర్వీసులపై పడింది. లక్ష మందికి పైగా ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గురువారం అర్ధరాత్రి ప్రమాదం జరగ్గా.. శుక్రవారం అర్ధరాత్రి వరకు ఎయిర్‌పోర్టును మూసివేశారు. ఈ ప్రకటన సమయంలో దాదాపు 120 విమానాలు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవ్వాల్సి ఉండగా వెంటనే వాటిని దారి మళ్లించారు. ఎయిర్ ఇండియా కూడా రెండు విమానాలను దారిమళ్లించింది. మరోవైపు, లండన్ నుంచి శంషాబాద్ రావాల్సిన బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ విమానం రద్దైంది.

2009 నుంచి 2024 వరకు 15,564 మందిని పంపేశారు

» భారతీయ అక్రమ వలసదారుల లెక్క ఇది

» ట్రంప్‌కు ముందునుంచే 'డిపోర్టేషన్'

» త్వరలో మరో 295మంది భారత్‌కు

» రాజ్యసభలో విదేశాంగ శాఖ ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 21 : అమెరికా ప్రభుత్వం మరో 295 మంది భారతీయ అక్రమ వలసదారులను వెనక్కి పంపించనుంది. వీరంతా ప్రస్తుతం తమ నిర్బంధంలో ఉన్నారని, త్వరలో వారిని తిరిగి పంపించివేస్తామని అమెరికా అధికారులు తెలిపినట్టు కేంద్ర విదేశాంగ శాఖ శుక్రవారం రాజ్యసభకు తెలిపింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 388మంది భారత జాతీయులను వెనక్కి పంపారని వివరించింది. సీపీఐ సభ్యుడు జాన్ బ్రిటస్ దీనిపై అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ ఇలా లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. అక్రమ వలసదారులను వెనక్కి పంపించివేయడం అనే ప్రక్రియ ట్రంప్‌కు ముందే మొదలైందని, 2009-2024 మధ్యకాలంలో 15,564మందిని వెనక్కి పంపారని తెలిపింది. "ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో 6వేలమంది భారతీయులను అక్రమ వలసదారులుగా గుర్తించి పంపివేశారు. బైడెన్ ప్రభుత్వం అదే తరహాలో 3,652 మంది భారతీయ అక్రమ వలసదారులను తిరిగి పంపించారు" అని విదేశాంగ శాఖ వివరించింది.

సంకెళ్లపై సభ్యుల నిరసనలు..

భారతీయ అక్రమ వలసదారులను సంకెళ్లు వేసి తరలించిన అంశంపై విపక్షాలు నిరసన తెలిపాయి. దీనిపై కేంద్ర విదేశాంగ శాఖ స్పందిస్తూ.... ఈ అంశంపై అమెరికాకు నిరసన తెలిపామని వెల్లడించింది. "ఫిబ్రవరి ఐదున భారత్‌కు తిరిగి పంపినవారి చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసిన విషయం అమెరికా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ముఖ్యంగా, మహిళలకు సంకెళ్లు వేయడంపై మన అభ్యంతరాన్ని గట్టిగా తెలియజేశాం. ఆ తర్వాత అమెరికా వైఖరి మారింది. అదే నెల 15,16వ తేదీల్లో పంపిన మరో విడత అక్రమ వలసదారుల్లో పిల్లలు, స్త్రీలకు సంకెళ్లు వేయలేదు" అని విదేశాంగశాఖ తెలిపింది. కాగా, ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన మొదటి నెల రోజుల్లో మొత్తంగా 37,600 మంది అక్రమ వలసదారులను వెనక్కి పంపించారు.

గ్రీన్‌కార్డు కోసం పెళ్లి చేసుకుంటే బహిష్కరణే!

ఐదేళ్ల జైలు, రూ.2కోట్ల ఫైన్ కూడా

అమెరికా పౌరులను వివాహం చేసుకోవడం ద్వారా వేగంగా గ్రీన్‌కార్డు పొందాలని భావించేవారికి అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) గట్టి షాక్ ఇచ్చింది. వలస ప్రయోజనాలు పొందడానికి ఉద్దేశించిన మోసపూరిత వివాహాలు వ్యవస్థను బలహీనపరుస్తాయని, ఇటువంటి చర్యలను ఫెడరల్ నేరంగా పరిగణిస్తామని పేర్కొంది. దీనికి ఐదేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.2కోట్లకు పైగా జరిమానాతో పాటు బహిష్కరణకు కూడా దారితీసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు యూఎస్‌సీఐఎస్ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేసింది. వివాహం, వర్క్ వీసాల మోసాలు, ఇమిగ్రేషన్ బెనిఫిట్ ప్రోగ్రాంల దుర్వినియోగం వంటి అనుమానాస్పద కేసుల సమాచారాన్ని తమకు నివేదించాలని పౌరులను కోరింది. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన ఫాం ద్వారా పౌరులు తమకు సులభంగా సమాచారం ఇవ్వవచ్చని సూచించింది.



బాదర్ ఖాన్

భారత విద్యార్థి సూరిని బహిష్కరించవద్దు


అమెరికా ప్రభుత్వానికి ఫెడరల్ కోర్టు ఆదేశం

హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నాడన్న ఆరోపణలపై అరెస్టయిన భారతీయ విద్యార్థి బాదర్ ఖాన్ సూరికి అమెరికా కోర్టులో ఊరట లభించింది. అమెరికా నుంచి అతని బహిష్కరించాలన్న ప్రభుత్వ ఆదేశాలను ఫెడరల్ కోర్టు జడ్జి నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అతడిని అమెరికా నుంచి పంపేయడానికి వీల్లేదని జడ్జి పాట్రీసియా టోలీవర్ గైల్స్ తన తీర్పులో ప్రభుత్వానికి స్పష్టం చేశారు. అంతకుముందు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతినిధి సూరి విషయంలో ఓ ప్రకటన విడుదల చేశారు. జార్జిటౌన్ వర్సిటీ విద్యార్థి అయిన బాదర్ ఖాన్ సూరి హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేయడంతో పాటు సోషల్ మీడియాలో యూదు వ్యతిరేక ప్రచారం చేశారని ఆ ప్రకటనలో తెలిపారు. ఆయన్ను అమెరికా నుంచి బహిష్కరిస్తామని 15న ప్రకటించారు.

ఇజ్రాయెల్ నిఘా చీఫ్‌పై వేటు!

» 1949 తర్వాత చరిత్రలో తొలిసారి 'షిన్ బెట్' అధిపతి తొలగింపు

» తాత్కాలిక స్టే విధించిన సుప్రీంకోర్టు



టెల్ అవివ్/జెరూసలేం, మార్చి 21: హమా‌స్‌తో ఏడాదిన్నరగా యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన శక్తివంతమైన అంతర్గత నిఘా విభాగం 'షిన్ బెట్' చీఫ్ రోనెన్ బార్‌పై ప్రధాని నెతన్యాహు వేటు వేశారు. బార్‌ను సర్వీసు నుంచి తొలగించాలని గురువారం రాత్రి జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. బార్‌పై నెతన్యాహు విశ్వాసం కోల్పోయారని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధ లక్ష్యాలను సాధించేందుకు బార్ తొలగింపు అవసరమని, 'తదుపరి విపత్తు'ను నివారించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఆయన వారసుడిని నియమించే వరకు కాని, ఏప్రిల్ 10 వరకు గానీ ఏది ముందు అయితే అప్పటి వరకు బార్ పదవిలో కొనసాగుతారని పేర్కొంది. ఇజ్రాయెల్ చరిత్రలో షిన్ బెట్‌ను ఏర్పాటు చేసిన 1949 నుంచి ఈ తరహా అసాధారణ నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి. బార్ పదవీ కాలం వాస్తవానికి మరో ఏడాదిన్నర ఉంది. తనను తొలగించడాన్ని సవాల్ చేస్తూ బార్ వేసిన పిటిషన్‌పై ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు తక్షణం స్పందించింది. ఆ పిటిషన్‌పై విచారణ జరిపే వరకు నెతన్యాహు నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. అప్పీల్‌ను ఏప్రిల్ 8లోగా విచారిస్తామని పేర్కొంది. 2023, అక్టోబర్ 7న హమాస్ దాడిని గుర్తించడంలో షిన్ బెట్ విఫలమైందని, దానివల్లే నెతన్యాహు రోనెన్ బార్‌ను తొలగించారని తెలుస్తోంది. మరోవైపు, బార్ తొలగింపు వెనుక 'ఖతార్-గేట్' దర్యాప్తుల అంశం ఉండొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు నెతన్యాహు సన్నిహితులు ఖతార్ తరఫున లాబీయింగ్ చేశారన్న ఆరోపణపై షిన్ బెట్ పరిశీలన చేస్తోంది. ఖతార్ ప్రభుత్వంతో ఆర్థిక సంబంధాలు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఇద్దరు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో శాంతి: అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి21: జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఉగ్రవాదం విషయంలో యువత ప్రమేయం దాదాపు కనుమరుగైందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో చెప్పారు. యూపీఏ హయాంలో ఉగ్రవాదులను కీర్తించడంతో పాటు ఉగ్రవాదుల శవాలతో అంత్యక్రియలు జరిగేవని, ప్రస్తుతం ఉగ్రవాదులను హతమార్చిన చోటే పూడ్చిపెడుతున్నామన్నారు. 2004 నుంచి 2014 మధ్య 7,2,17 ఉగ్రవాద ఘటనలు జరిగితే 2014 నుంచి 2024 మధ్య 2,242 ఘటనలు జరిగాయన్నారు. ఉగ్రవాదం కారణంగా జరిగే మరణాల సంఖ్య 70 శాతం తగ్గిందన్నారు. ఉగ్రవాదాన్ని ఏ మాత్రం ఉపేక్షించడం లేదని యూరీ, పుల్వామా ఘటనల తర్వాత పది రోజుల వ్యవధిలోనే సర్జికల్, ఎయిర్ స్ట్రైక్స్ జరిపి గట్టిగా బదులిచ్చామన్నారు. 2024లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

పని చేయని ఫోన్ నంబర్లకు పేమెంట్ యాప్స్ సేవల రద్దు

న్యూఢిల్లీ, మార్చి 21: ఫోన్ నెంబర్లు చాలా కాలం పాటు పనిచేయకుండా ఇన్‌యాక్టివ్‌గా ఉంటే వాటికి అనుసంధానంగా ఉన్న గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్స్ సేవలు కూడా రద్దు కానున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇది అమల్లోకి వస్తుందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ తెలిపింది. ఇలాంటి ఫోన్ నెంబర్లను వినియోగించి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతుండడంతో ఈ నిర్ణయం తీసుకొంది. యూపీఐ నెట్‌వర్క్ పరిధి నుంచి అలాంటి ఫోన్ నెంబర్లను తొలగించాలని బ్యాంకులను ఆదేశించింది.

గంగలూరు ఎన్‌కౌంటర్ పక్కా సమాచారంతోనే: బస్తర్ ఐజీ

చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పక్కా సమాచారంతోనే గంగలూరు ఎన్‌కౌంటర్ జరిగిందని బస్తర్ ఐజీ సుందర్ రాజ్ చెప్పారు. ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 26 మంది మావోయిస్టుల్లో 14 మంది మహిళలు ఉన్నారన్నారు. వారిలో ఇప్పటి వరకూ 18 మందిని గుర్తించినట్లు చెప్పారు. డీవీసీఎం సభ్యుడు ముక్తిపై రూ.8 లక్షలతోపాటు వీరందరిపై రూ.1.03 కోట్ల రివార్డు ఉందన్నారు. మరోవైపు, అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన నలుగురు నక్సల్స్‌లో ఒక మహిళ ఉన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన రాజు ఓయాం(27) అనే డీఆర్‌జీ జవాన్, యువకుడికి ఐజీ, ఎస్పీ నివాళులర్పించారు. గంగలూరు ఎన్‌కౌంటర్ బూటకం అని పౌరహక్కుల సంఘం ఆరోపించింది. ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ రావు డిమాండ్ చేశారు.

కర్ణాటకలో ప్రజాప్రతినిధుల వేతనాలు రెట్టింపు

బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం, మంత్రులు, శాసనసభ్యుల వేతనాలు 100% పెంపు ప్రతిపాదనకు శాసనసభ ఆమోదం తెలిపింది. వేతనాల పెంపును హోంమంత్రి జి.పరమేశ్వర సమర్థించుకున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరల భారంతో సామాన్య ప్రజల్లాగే ప్రజా ప్రతినిధులూ ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీఎం వేతనం నెలకు రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షలకు, మంత్రుల వేతనాలు రూ.60 వేల నుంచి రూ.1.25 లక్షలకు పెరిగాయి. మరోవైపు.. ప్రజాప్రతినిధుల వేతనాల పెంపుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోనప్పుడు భారీగా వేతనాల పెంపు ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు.

వృద్ధుల సంక్షేమ కమిషన్!

» బిల్లు ఆమోదించిన కేరళ అసెంబ్లీ

తిరువనంతపురం, మార్చి 21 : వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కేరళ సీఎం పినరయి విజయన్ తెలిపారు. ఈ కమిషన్ వృద్ధుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, పునరావాసంపై దృష్టి సారించడంతోపాటు సమాజ హితానికి వారి నైపుణ్యాలను ఉపయోగించుకోవడానికి చర్యలు తీసుకుంటుంది. తద్వారా వృద్ధుల సంక్షేమానికి కమిషన్ ఏర్పాటు చేయనున్న తొలి రాష్ట్రంగా కేరళ నిలిచింది. సీనియర్ సిటిజన్ల భద్రతకు తమ ప్రభుత్వం మరింత సమర్థవంతంగా హామీ ఇస్తుందని విజయన్ పేర్కొన్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

తలమడుగు/వెంకటాపురం,మార్చి 21(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడికి చెందిన కుమారి లింగన్న(48) ఐదెకరాల్లో సాగు చేస్తున్నాడు. రెండేళ్లుగా పంట దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.3 లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో శుక్రవారం పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం చిరుతపల్లికి చెందిన లఖం మధుకృష్ణ(29) రెండెకరాలు కౌలుకు తీసుకుని హైటెక్ కంపెనీ మొక్కజొన్న విత్తనాలు వేశాడు. పంట దిగుబడి రాకపోవడం, పంట కొంటామన్న కంపెనీ వారు అడ్రస్ లేకపోవడంతో మధుకృష్ణ పురుగుల మందు తాగి చనిపోయాడు.

విద్యుత్ చార్జీలు పెంచడం లేదు

టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ.. టీజీఈఆర్సీ బహిరంగ విచారణలో వెల్లడి

- పలు ఫిర్యాదులు స్వీకరించిన టీజీఈఆర్సీ చైర్మన్

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరం, 2025 ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచడం లేదని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ప్రకటించారు. సంస్థ ఆదాయానికి, అవసరానికి మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు ప్రభుత్వం టారిఫ్ సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. పవర్ స్వాపింగ్ ఒప్పందాల(డిమాండ్ లేని సమయంలో మన విద్యుత్ ఆ రాష్ట్రాలకు, డిమాండ్ ఉన్న సమయంలో ఆ రాష్ట్రాల నుంచి విద్యుత్ మనకు అందించేలా) వల్ల టీజీఎస్పీడీసీఎల్‌కు రూ.1614 కోట్లు ఆదా అయ్యిందన్నారు. ఈ ఒప్పందాల వల్ల పీక్ సీజన్‌లో యూనిట్ రూ.10 వెచ్చించి కొనుగోలు చేయాల్సిన అదనపు భారం తగ్గిందన్నారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ) చైర్మన్ డి.నాగార్జున్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని విద్యుత్ నియంత్రణ భవన్‌లో శుక్రవారం జరిగిన బహిరంగ విచారణలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ సి. శ్రీనివాసరావు, విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్, రైల్వే, హెచ్ఎంఆర్ఎల్, వాటర్‌బోర్డుతో పాటు పలు విభాగాల ప్రతినిధులు ఈ బహిరంగ విచారణలో పాల్గొన్నారు. కాగా, డబ్బులిస్తేనే పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేస్తామని లైన్‌మెన్ తమని బెదిరిస్తున్నారంటూ ఈ బహిరంగ విచారణకు హాజరైన వనపర్తి గోపాల్‌పేట మండలం బుద్ధారం గ్రామానికి చెందిన పలువురు రైతులు టీజీఈఆర్సీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. డిస్కమ్‌లకు డీడీలు చెల్లించినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయడం లేదని, వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు చేతికి అందె ఎత్తులో ఉన్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని మరికొందరు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఈఆర్సీ చైర్మన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక, నిబంధనల ప్రకారం విద్యుత్ సంస్థలకు అవసరమైన ఆర్థిక మద్దతును సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధనశాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రియదర్శిని పేర్కొన్నారు.



చిన్నయ్య సరితకు రూ. 5 లక్షల పరిహారానికి సంబంధించిన పత్రాలు ఇస్తున్న ఈఆర్సీ చైర్మన్ నాగార్జున్, ముషారఫ్ అలీ

2019 నాటి ఘటనకు తక్షణ పరిష్కారం..

బహిరంగ విచారణకు హాజరైన నారాయణ్‌పేట కోస్గి మండలానికి చెందిన చిన్నయ్య సరిత.. తన భర్త సంజీవరెడ్డి విద్యుత్ ప్రమాదంలో 2019లో మరణిస్తే ఇప్పటిదాకా పరిహారం ఇవ్వలేదని ఈఆర్సీ చైర్మన్‌కు వివరించింది. స్పందించిన చైర్మన్.. తక్షణమే పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో డిస్కం అధికారులు వెంటనే ఆ ఫైల్‌ను పంపించి రూ.5 లక్షల పరిహారానికి సంబంధించిన పత్రాలను చైర్మన్ చేతులమీదుగా సరితకు అందజేశారు.

ఆ హోటళ్లకు అనుమతులు రద్దు

- తిరుమలలో గత ప్రభుత్వం ఇచ్చిన 35 ఎకరాలను రద్దు చేస్తున్నాం: చంద్రబాబు
- మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డింపు
- అన్నదానానికి రూ.44 లక్షల విరాళం

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఏడుకొండల్లో వ్యాపారీకరణను (కమర్షియలైజేషన్) అనుమతించబోమని, వాటి పరిధిలో గత ప్రభుత్వం హోటళ్ల నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణితో కలిసి సంప్రదాయ వస్త్రధారణతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయం వద్దకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. దేవాన్ష్ పేరిట ఒకరోజు అన్నప్రసాద కార్యక్రమానికి రూ.44 లక్షలు విరాళంగా అందించారు. మనవడితో కలిసి చంద్రబాబు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి చంద్రబాబు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. "నా ప్రథమ ప్రాధాన్యం శ్రీవేంకటేశ్వరస్వామి. ఏడుకొండలు శ్రీవారి సొంతం. వీటిని అపవిత్రం చేయకూడదు, అందువల్లే గత ప్రభుత్వంలో ముంతాజ్, ఏఆర్‌కే, దేవ్‌లోక్‌కు ఏడుకొండలకు అనుకుని ఉన్న ప్రాంతంలో ఇచ్చిన 35.32 ఎకరాల స్థలాన్ని రద్దు చేస్తున్నాం." అని వెల్లడించారు. వివిధ ప్రాంతాల్లో హోటళ్లు కడుతున్న ఒబెరాయ్ సంస్థ, అలిపిరిలో తమ హోటల్ పేరు మారుస్తామని, శాకాహారం మాత్రమే పెడతామని చెప్పినప్పటికీ ఏడుకొండలు ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు ఉండకూడదని తేల్చిచెప్పామన్నారు. అవసరమైతే రోడ్డుకు అవతలి వైపు నిర్మించుకోవాలని సూచించానని చెప్పారు. ఏపీ టూరిజం పరిధిలోని స్థలాన్ని కూడా టీటీడీకే అప్పజెప్పేలా చర్యలు తీసుకునే ఆలోచన చేస్తున్నామన్నారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్



సొరంగంలోని నీటిని కృష్ణా నదిలోకి మళ్లిస్తున్న దృశ్యం

సొరంగంలో ఉధృతంగా ఊట నీరు

- డీ వాటరింగ్ కోసం కొత్త మోటార్లు
- ఐదు షిఫ్టుల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు

నాగర్‌కర్నూల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఊట నీటి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీని వల్ల సహాయక చర్యల్లో అవాంతరాలు ఉత్పన్నమవుతాయి. దీంతో సొరంగంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కనుగొనడం మరింత కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌లకు చెందిన ముఖ్యులు శుక్రవారం సమావేశమై సొరంగం లోపల జరుగుతున్న సహాయక చర్యల గురించి, ఇంకా తీసుకోవాల్సిన ముఖ్యమైన నిర్ణయాల గురించి చర్చించారు. రెస్క్యూ ఆపరేషన్ ఇంకా పూర్తి కాకపోవడానికి ప్రధానమైన కారణాలను విశ్లేషించారు. ప్లాస్మా కట్టర్లు, ర్యాట్ హోల్ మైనర్స్‌తో పాటు సింగరేణి కార్మికులు నిరంతరం శ్రమించి టీబీఎం శకలాలను, మట్టిని బయటకు పంపించే ప్రయత్నాలను ముమ్మరం చేసిన క్రమంలో ఊట నీరు అధికంగా రావడం ప్రధానమైన సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే సొరంగంలో డీవాటరింగ్ కోసం నాలుగు స్టేషన్లు పని చేస్తుండగా అదనంగా కొత్త మోటార్లను బిగించే ప్రక్రియ ప్రారంభమైంది. సహాయక చర్యల్లో పాల్గొనే వారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సహాయక చర్యల్ని వేగవంతం చేయడానికి మూడు నుంచి ఐదు షిఫ్టులకు పెంచారు. సొరంగంలో 8 మంది చిక్కుకుపోగా.. ఇప్పటివరకు ఒకరి మృతదేహం లభ్యమైంది. ఇంకా ఏడుగురి ఆచూకీ కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. 24 గంటల పాటు నిర్విరామంగా శ్రమిస్తున్నప్పటికీ సొరంగం లోపల వాతావరణం అనుకూలించకపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది.

మూసీ ప్రక్షాళనకు నిధులివ్వండి

- లోక్‌సభలో కేంద్రాన్ని కోరిన బీజేపీ ఎంపీ ఈటల

న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళనకు నిధులు కేటాయించాలని కేంద్రాన్ని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. మురుగునీటి శుద్ధికి, శుభ్రమైన తాగునీటి కోసం కూడా నిధులివ్వాలని విన్నవించారు. శుక్రవారం లోక్‌సభలో జలశక్తి శాఖ గ్రాంట్ల డిమాండ్లపై జరిగిన చర్చలో ఈటల మాట్లాడారు. హైదరాబాద్ ప్రజల శ్రేయస్సు కోసం మూసీ నది పునరుజ్జీవం చేయాల్సిన అవసరమని చెప్పారు. 'సరస్సుల నగరంగా పేరున్న హైదరాబాద్.. ఇప్పుడు హుస్సేన్‌సాగర్‌తో సహా దాని నీటి వనరులన్నీ మురుగు నీటి ప్రవాహాల కారణంగా కలుషితమయ్యాయి. ఈ సరస్సులను పునరుద్ధరించడానికి, మురుగు నీటిని మళ్లించడానికి, ప్రత్యామ్నాయ మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాల అభివృద్ధికి, శుద్ధి చేసిన నీరు మాత్రమే సరస్సుల్లోకి వచ్చేలా మురుగునీటి శుద్ధి కర్మాగారాలను బలోపేతం చేయడం వంటి కొన్ని తక్షణ ప్రత్యామ్నాయాలకు తగిన నిధులు కేటాయించాలి' అని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అధిక జనాభా వల్ల మౌలిక సదుపాయాల కొరత ఏర్పడుతోందని.. పారిశుద్ధ్య ప్రాజెక్టులకు, తాగునీటి సౌకర్యాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

డీహెచ్ పరిధిలోని ఆస్పత్రుల్లో 'అబాస్'

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంచాలకుల(డీహెచ్) పరిధిలోని అన్ని ఆస్పత్రుల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్(అబాస్)ను తక్షణమే అమలు చేయాలని సర్కారు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం డీహెచ్ రవీందర్‌నాయక్ 33 జిల్లాల వైద్యాధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, యూపీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ల(బస్తీ, పల్లె దవాఖానాల)లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్(అబాస్)ను అమలు చేయాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది ఆస్పత్రులకు వెళ్లినప్పుడే హాజరు నమోదవుతుందని, ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో నోడల్ అధికారిని ఏర్పాటు చేసుకోవాలని డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. కాగా, గత నెల 16న "పీహెచ్‌సీలకు చుట్టాలుగా వైద్యులు" శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు పీహెచ్‌సీలకు రావడం లేదని అందులో పేర్కొంది. దీనిపై స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ మరుసటి రోజే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి.. అన్ని ఆస్పత్రుల్లో 'అబాస్' అమలు చేయాలని ఆదేశించారు. కాగా, ఉద్యోగులతో చర్చించకుండా అబాస్ అమలు చేయడం సరికాదని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియుద్దీన్, ప్రధాన కార్యదర్శి యాదనాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సమాధి' రాజకీయం

మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ పరివార్ సంస్థలు నిర్వహించిన నిరసన ప్రదర్శనకు, పలు అసత్యప్రచారాలు కూడా తోడై నాగపూర్ తీవ్ర మతహింసను చవి చూసింది. దీనిని ఖండిస్తూ, ఔరంగజేబు సమాధి వర్తమానంలో ఒక అనవసరపు అంశంగా ఆరెస్సెస్ వ్యాఖ్యానించడం అత్యధికులకు ఆశ్చర్యం కలిగించింది. నాగపూర్ ఆరెస్సెస్ కేంద్రస్థానం కావడమే కాక, ఔరంగజేబు సహా మొగల్ చక్రవర్తులంతా పరివార్ ప్రధాన లక్ష్యంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. నాగపూర్ కార్యాలయం పెద్దలకు తెలియకుండానే ఈ వివాదం రేగి, ఇంత హింసాకాండ జరిగిందని అధికులకు ఎందుకో నమ్మకం కలగడం లేదు. చిన్ననిప్పురవ్వలు, కాస్తంత గాలి తోడైతే ఎన్ని కొంపలనైనా తగలబెట్టవచ్చును. నాగపూర్ హింస కార్యకారణసంబంధాలకంటే, మొత్తంగా మొగల్స్ చుట్టూ ఎంతోకాలంగా సాగుతున్న మత రాజకీయం, వారి సమాధులు, నిర్మాణాలు నిరంతర లక్ష్యాలుగా మారుతూండటం ప్రధానంగా గమనించాలి. ఎవరో అంటిస్తే తప్ప, మత హింస తనకుతానుగా రాజుకోదు.

ఈ హింస వెనుక లోతైన, ముందస్తు కుట్ర ఉన్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వ్యాఖ్యానించారు. ఆయన ఎవరిని లక్ష్యంగా చేసుకొని, ఏ కోణంలో ఆ మాట న్నారో తెలియదు కానీ, పెద్దగా ప్రాచుర్యం లేకుండా పడివున్న ఓ మూడువందల ఏళ్ళకు పైబడిన సమాధిని తొలగించాలని పరివార్ కార్యకర్తలు డిమాండ్ చేయడం వెనుక మాత్రం స్పష్టమైన ఆదేశాలు, నిర్దేశిత లక్ష్యాలూ ఉన్నాయి. ఇటీవలే పేరుమార్చిన ఔరంగాబాద్‌కు సమీపంలోని ఖుల్దాబాద్‌లో పెద్దగా పోల్చుకోవడానికి కూడా గొప్ప ఆనవాళ్ళు లేని ఆ కట్టడం వారిని ఆగ్రహంతో ఊపేస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రే ఆ కట్టడంమీద అంత ద్వేషం ప్రకటించినప్పుడు కర్తవ్యనిర్వాహకులను, కరసేవకులను తప్పుబట్టి ప్రయోజనం లేదు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఉన్నందున, ఖర్మకాలి దానిని కాపాడవలసివస్తున్నదన్న రీతిలో ఫడ్నవీస్ నిండు సభలో వ్యాఖ్యానించారు. ఆ కట్టడం ఊసెత్తడమే మహాపాపం అన్నట్టుగా ఎంతో తేలికగా మాట్లాడారు. ఇక, ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ జీవిత ఘట్టాలతో కూడిన ఒక నవల ఆధారంగా తయారైన ఛావా సినిమా మీద ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను లోతుగా గమనించినప్పుడు, నాగపూర్ హింసకు కారణమని ఆయన ఈ సినిమాను తప్పుబట్టినట్టు కనబడదు. పైగా, ఆయన ఈ చిత్రాన్ని అమితంగా ప్రశంసించారు, అందులో చెప్పినవన్నీ నిజాలేనని, చూపినవన్నీ చారిత్రక సత్యాలేనని నిర్ధారించారు. ఆ సినిమా చూసి, అసలు చరిత్రను తెలుసుకొని గుండెలు రగిలినందునే ఈ హింస జరిగిందన్న రీతిలో మాట్లాడారు. నాగపూర్ హింసకు ఎంతో ముందునుంచే సదరు చిత్రం చుట్టూ రాజకీయం నడవడం, ప్రధాని సహా బీజేపీ పెద్దలంతా చిత్రాన్ని మెచ్చుకోవడం, దాని విజయోత్సవ వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రోత్సహించడం చూశాం. అందులో ఉన్నది చరిత్ర కాదని, కల్పన అని, ఔరంగజేబు క్రూరుడు కాదని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబూ ఆజ్మీ వ్యాఖ్యానిస్తే, మరాఠా వారసత్వాన్ని అవమానించిన ద్రోహి అంటూ మహాయుతి నాయకులంతా ఆయనను సభనుంచి గెంటివేయడమూ తెలిసిందే. మొన్నటివరకూ ముఖ్యమంత్రిగా ఉన్న శిందేకు ఏకంగా ఈ సందర్భంలో ఒసామా బిన్ లాడెన్ కూడా గుర్తుకొచ్చాడు.

ఔరంగజేబు సమాధిని కూల్చాలన్న డిమాండ్ పైస్థాయి బీజేపీ నేతలతోనే పుట్టింది. రాణేలు, శిందేలు, భోసాలేలు పద్ధతిప్రకారం వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటే, మా అందరిదీ ఒకేమాట, కానీ, కాంగ్రెస్ ఏలుబడిలో ఏఎస్ఐ రక్షణ దక్కడంతో దానిని విధిలేక కాపాడవలసి వస్తున్నదని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పిన తరువాత, అది ఒక సందేశంగా, నెరవేర్చాల్సిన లక్ష్యంగా దిగువస్థాయికి చేరడం సహజం. తీవ్ర హింస, విధ్వంసం, వందలాది అరెస్టులతో ప్రస్తుతానికి పరిస్థితులు సద్దుమణిగినట్టు కనిపిస్తున్నప్పటికీ, త్వరలోనే ఔరంగజేబు సమాధికి బాబరీమసీదు గతే పడుతుందన్న హెచ్చరికలు భవిష్యత్ పరిణామాలకు సంకేతాలు. దేశ ఆర్థిక రాజధానినీ, పారిశ్రామికంగా అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాన్నీ ఇటువంటి వివాదాలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత దేవేంద్ర ఫడ్నవీస్ మీద ఉంది.

సుంకాలపై సమష్టి పోరాటం



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ షేక్ స్పియర్‌ను చదివారో లేదో గాని ఆ మహాకవి మాటలలోని సత్యాన్ని బాగానే గ్రహించారు: 'స్నేహంలో చిత్తశుద్ధిలేని ముఖస్తుతి ఉన్నది'. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడు అయిన తన స్నేహితుడు డోనాల్డ్ ట్రంప్‌ను పొగడ్తలతో ముంచెత్తిన మోదీ వలసలు, వీసాలు, వాణిజ్య సమతుల్యత, సుంకాలు, అణు ఇంధనం, దక్షిణ చైనా సముద్రం, బ్రిక్స్, క్వాడ్, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మొదలైన అంశాలపై స్వదేశానికి అనుకూలంగా ట్రంప్‌తో సంప్రతింపులు జరపగలననే ఆశాభావంతో ఉన్నారు.

అధ్యక్షుడు ట్రంప్ నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉంటారు. అంతకు మించి ఉండరు. ప్రధానమంత్రి నరేంద్రీ మోదీ మూడో పదవీ కాలం ఇంకా నాలుగు సంవత్సరాలు ఉన్నది. మరోసారి కూడా ప్రధానమంత్రి కావాలని ఆయన ఆశిస్తున్నారని చెప్పవచ్చు. అయితే నాలుగు సంవత్సరాల ఉమ్మడి వ్యవధిలో సమస్యలు అన్నిటినీ పరిష్కరించడం సాధ్యం కాదన్నది స్పష్టం. రాబోయే అమెరికా ప్రభుత్వం రిపబ్లికన్ పార్టీది అయినా, డెమొక్రాటిక్ పార్టీది అయినా ట్రంప్ విధానాలను కొనసాగించక పోవచ్చు. ఈ సంభావ్య పరిణామమే భారత్‌కు మొదటి పాఠం కావాలి. ప్రభుత్వాధినేతల మధ్య వ్యక్తిగత స్నేహ సంబంధాలకు అతీతంగా పరిస్థితులను సమగ్రంగా చూడాలి. ట్రంప్ గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? ఆయనకు ఒక స్నేహితుడు ఎప్పుడు శత్రువు అవుతాడో, ఒక శత్రువు ఎప్పుడు మిత్రుడు అవుతాడో ఎవరూ చెప్పలేరు.

పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రధాని మోదీ ఘనంగా ప్రశంసించారు. ఆయన వినమ్రతను, కష్టాల నుంచి బయటపడగల శక్తిని బాగా మెచ్చుకున్నారు. ద్వితీయ పర్యాయం అధ్యక్ష పదవీ కాలంలో సాధించాల్సిన లక్ష్యాల విషయమై ట్రంప్ మొదటిసారి కంటే బాగా సన్నద్ధమయ్యారని మోదీ అన్నారు. ఆయనకొక మార్గదర్శక ప్రణాళిక ఉన్నదని, వేసే ప్రతి అడుగు లక్ష్య పరిపూర్తికి తోడ్పడేదిగా ఉంటుందని మోదీ అన్నారు. మోదీ ఇంకా ఇలా అన్నారు: 'తాను నిర్దేశించిన లక్ష్యాలను సాధించగల శక్తిమంతమైన పాలనాదక్షుల బృందానికి బాధ్యతలు అప్పగించారు. సమర్థులైన ఆ అధికారులు అధ్యక్షుడు ట్రంప్ దార్శనికతను అమలుపరచగలరని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను'.

అమెరికా ప్రజలు అందరూ ఈ ప్రశంసతో ఏకీభవించకపోవచ్చు. సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు అందరూ ఆయా ప్రభుత్వ విభాగాలకు ట్రంప్ ఎంపిక చేసుకున్న అధికారులు అందరూ శక్తి మంతులని, పాలనా దక్షులని భావించడం లేదు. ట్రంప్ దార్శనికత అమెరికాకు గానీ, ప్రపంచానికిగానీ శ్రేయస్సును సమకూర్చేదని అమెరికా ప్రజలు అందరూ భావించడం లేదు.



> సూత్ర బద్ధ చర్చలు, సంప్రదింపులే దౌత్యానికి హృదయం వంటివి. ముఖస్తుతి మాటలు ఎంతమాత్రం దౌత్య వ్యవహారం కాబోవు. అంతర్జాతీయ చట్టాలు, ఒడంబడికలను విచక్షణారహితంగా ఉల్లంఘించకుండా ట్రంప్‌ను అడ్డుకోవడంలో న్యాయనియమాల ప్రాతిపదికన పోరాడే వారి పక్షాన భారత్ నిలబడి తీరాలి.

డోనాల్డ్ ట్రంప్ తన దార్శనికతను అమలుపరచడమనేది భారత్‌కు శుభ వార్త కాబోదు. తన లక్ష్యాల పరిపూర్తిలో ట్రంప్ సఫలమయితే దాని పర్యవసానాలు భారత్‌కు ఎలా ఉంటాయో చూద్దాం: సరైన పత్రాలు లేకుండా అమెరికాకు వలస వెళ్లిన భారతీయులు (దాదాపు 7 లక్షల మంది అని అంచనా) దాదాపుగా అందరినీ తిరిగి భారత్‌కు పంపించి వేస్తారు; అమెరికాలో గ్రీన్‌కార్డ్ ఉన్న భారతీయులకు అమెరికా శాశ్వత పౌరసత్వాన్ని నిరాకరించే అవకాశమున్నది; విద్యాధికులు, వృత్తి నిపుణులకు జారీ చేసే హెచ్ 1బి వీసాల జారీని గణనీయంగా తగ్గించివేస్తారు; హార్లే డేవిడ్‌సన్ బైక్‌లు, భౌర్బన్ విస్కీ, జీన్స్, ఇతర అమెరికన్ సరుకులపై దిగుమతి సుంకాలను తగ్గించడం భారత్‌కు అనివార్యమవుతుంది; భారత్ నుంచి అల్యూమినియం, ఉక్కు ఎగుమతులు, బహుశా ఇంకా ఇతర భారతీయ సరుకులపై అమెరికా భారీ స్థాయిలో సుంకాలు విధించే అవకాశమున్నది; భారత్‌లో ఉద్యోగాలను సృష్టించే పరిశ్రమలను నెలకొల్పకుండా అమెరికన్ ప్రైవేట్ పెట్టుబడులను నిరుత్సాహపరుస్తారు.

అంతర్జాతీయ సంబంధాలలో ట్రంప్ పోకడల విషయాన్ని చూద్దాం. పనామా కాలువను అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటే నరేంద్ర మోదీ ఏ విధంగా ప్రతిస్పందిస్తారు? ఆ సముద్ర మార్గంలో భారత్, ఇతర దేశాల ఓడల రాకపోకలకు అనుమతించినంతవరకు ఎవరూ నిరసన తెలుపకపోవచ్చు. అయితే పనామా కాలువను అమెరికా తన నియంత్రణలోకి తీసుకోవడమనేది నిస్సందేహంగా ఒక దురాక్రమణే. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడమే. గ్రీన్‌ల్యాండ్‌ను ఏదో ఒక విధంగా అమెరికా స్వాయత్తం చేసుకుంటే మోదీ ఏ విధంగా ప్రతిస్పందిస్తారు? గ్రీన్‌ల్యాండ్ మనకు సుదూరంలో ఉన్న దీవి కనుక, అమెరికా చర్యకు మనం ఆందోళన పడవలసిన అవసరం లేదని భారత్ భావిస్తుందా? కొన్ని 'దురాక్రమణలను' క్షమించవచ్చుగానీ రష్యా మరిన్ని ఉక్రెయిన్ ప్రాంతాలను, తైవాన్‌ను చైనా స్వాధీనం చేసుకుంటే భారత్ ఏ విధంగా ప్రతిస్పందిస్తుంది? ఆక్సాయిచిన్, అరుణాచల్‌ప్రదేశ్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు చైనా ప్రయత్నిస్తేనో?! భారత్, చైనాల మధ్య యుద్ధం తప్పక సంభవిస్తుంది. ఆ యుద్ధంలో మనకు మద్దతుగా ఏ దేశం నిలబడుతుంది?

ఆధునిక దౌత్యం వ్యక్తిగత స్నేహాలను మించిన వ్యవహారం. డెమొక్రాటిక్ పార్టీతో నెలకొల్పుకున్న స్నేహ సంబంధాలను వదులుకుని ట్రంప్ పార్టీకి మోదీ మళ్లీ ప్రాధాన్యమిస్తారా? ఏది ఏమైనా జనవరి 20, 2029 తరువాత ట్రంప్ అధికారంలో ఉండరు. తదుపరి అధ్యక్షుడు డెమొక్రాటిక్ పార్టీకి చెందిన నాయకుడు కావచ్చు.

గత పది సంవత్సరాలుగా దేశీయ పరిశ్రమల సంరక్షణ విధానానికి నరేంద్ర మోదీ ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. ఆయన దాన్ని ఘనంగా ఆత్మనిర్భరత అని చాటుతున్నారు. తన స్నేహితుడు డాక్టర్ అర్వింద్ పనగరియాతో సహా పలువురు ఆర్థికవేత్తల విజ్ఞతాపూర్వక సలహాలు, సూచనలను పెడచెవిని పెట్టి మోదీ ప్రభుత్వం 500కు పైగా సరుకుల దిగుమతులపై సుంకాలు, సుంకాలేతర చర్యలు చేపట్టింది. భారతీయ సరుకులపై అమెరికా వసూలు చేస్తున్న అధిక సుంకాలపై మోదీ నిరసన తెలిపినప్పుడు ఆయన ఆక్షేపణలను ట్రంప్ మహాశయుడు పూర్తిగా కొట్టివేశాడు. ఏప్రిల్ 2, 2025 నుంచి పూర్తి స్థాయిలో సుంకాల సమరాన్ని ప్రారంభించేందుకు ట్రంప్ ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ట్రంప్‌తో మోదీ దోస్తీ, ముఖ ప్రీతి మాటలు బాగానే ఉన్నాయి గానీ, ట్రంప్ సుంకాల సమరం నుంచి ఇండియాను మినహాయించడానికి అవి తోడ్పడుతాయా? ట్రంప్ విధించే ప్రతీకార సుంకాలను భారత్ ప్రతిఘటిస్తుందా?

సూత్రబద్ధ చర్చలు, సంప్రదింపులే దౌత్యానికి హృదయం వంటివి. ముఖస్తుతి మాటలు ఎంతమాత్రం దౌత్య వ్యవహారం కాబోవు. ఆచరణాత్మక వైఖరి నిండుగా ఉన్న ఫ్రెడ్రిచ్ మెర్జ్ (కాబోయే జర్మన్ ఛాన్సలర్), ట్రంప్ విసురుతున్న సవాళ్లకు దీటుగా ప్రతిస్పందిస్తున్న కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, 27 యూరోపియన్ యూనియన్ దేశాలను సంఘటితం చేసిన యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్‌లు అంతర్జాతీయ చట్టాలు, ఒడంబడికలను విచక్షణారహితంగా ఉల్లంఘించకుండా ట్రంప్‌ను అడ్డుకోవడంలో విజయం సాధించే అవకాశమున్నది. న్యాయ నియమాల ప్రాతిపదికన పోరాడేవారి పక్షాన భారత్ నిలబడి తీరాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

భారత్ భవిష్యత్తుపై రెండు దృక్కోణాలు



■ రామచంద్ర గుహ

గతానుగతం

తమిళనాడు పాలక పార్టీ నాయకులు, బీజేపీ రాజకీయవేత్తల మధ్య మాటల యుద్ధాన్ని రెండు భాషల (తమిళం, హిందీ) మధ్య పోరాటంగా పత్రికలలో చిత్రిస్తున్నారు. ఈ వర్ణన సరైనదే కానీ, సంపూర్ణమైనది కాదు. విశదంగా చూస్తే అధికార భాషా చర్చ రెండు భిన్న భారత్ భావనలకు ప్రాతినిధ్యం వహిస్తోంది: మొదటి భావన రాజకీయాలలోను, సంస్కృతిలోను వైవిధ్యం, వ్యత్యాసాన్ని స్వాగతించేది కాగా రెండో భావన అవ్యక్త ఆదర్శం 'ప్రమాణీకరణ, సజాతీయత, కేంద్రీకరణ'.

తమిళనాడులో హిందీ పట్ల వ్యతిరేకతకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1937లో మద్రాస్ ప్రెసిడెన్సీలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దశల వారీగానే అయినప్పటికీ పాఠశాలల్లో హిందీ బోధనను తప్పనిసరి చేసింది. ఇందుకు కారకుడు అయిన నాటి మద్రాస్ ప్రధానమంత్రి (ముఖ్యమంత్రికి అప్పటి వాడుక అది) సి.రాజగోపాలాచారి ఆ తరువాత హిందీకి వ్యతిరేకమయ్యారు. 1950వ ఆరంభం నాటికే ఆయన, ఇప్పటి తమిళ రాజకీయవేత్తలవలే, మాతృభాషకు అదనంగా ద్వితీయ భాషనేదైనా బోధించవలసివస్తే అది ఇంగ్లీషే అవ్వాలి కాని, హిందీ కాకూడదని వాదించారు. 1965లో ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి హిందీని దేశవ్యాప్తంగా అధికార భాషగా అమలుపరిచేందుకు ప్రయత్నించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఆంగ్లంలో కాకుండా హిందీలో జరగాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మద్రాసు రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఆనాడు ఆ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న డీఎంకే హిందీ వ్యతిరేక ఆందోళనను తనకు అనుకూలంగా ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి పొందింది. తమిళుల మనోభావాలను గాయపరిచిన హిందీ ఉత్తర్వును శాస్త్రి ఉపసంహరించుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రతిష్ఠకు తీరని విఘాతమేర్పడింది. తమిళనాట దశాబ్దాలుగా ప్రాబల్య పార్టీగా ఉన్న కాంగ్రెస్ 1967లో అధికారాన్ని కోల్పోయింది. తదాది తమిళనాడులో ఏదో ఒక ద్రావిడ పార్టీ మాత్రమే అధికారంలో ఉంటూ వస్తోంది.

ఈ చరిత్ర అంతా ఎమ్‌కె స్టాలిన్, ఆయన సలహాదారులకు బాగా తెలుసు. హిందీ పట్ల తీవ్ర వ్యతిరేకత 1960ల్లో ఒక ఆధిపత్య రాజకీయ పార్టీని అధికారం నుంచి కూల్చి వేసినట్టుగానే ఇప్పుడు కూడా ఆ వ్యతిరేకత వర్తమాన ఆధిపత్య పార్టీని దూరంగా ఉంచుతుందనేది వారి సునిశ్చిత విశ్వాసం. తమిళనాడులో రాజకీయంగా విస్తరించి అధికార జయ పతాక నెగురవేసేందుకు బీజేపీ శతవిధాల ప్రయత్నిస్తోంది. నరేంద్ర మోదీ విశేష ప్రచారం కల్పించిన 'కాశీ–తమిళ్ సంగమం' కార్యక్రమం, కొత్త పార్లమెంటు భవనంలో 'సెంగోల్' ప్రతిష్ఠాపన, ఒక మాజీ ఐపీఎస్ అధికారిని తమిళనాడులో హిందుత్వ ఉద్ధారకుడుగా నిలబెట్టేందుకు బీజేపీ అగ్రనాయకత్వం వినియోగిస్తున్న శక్తియుక్తులను పరిశీలిస్తే తమిళనాట అధికారాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ ఎంతగా ఆరాటపడుతుందో అర్థమవుతుంది.

హిందీ విధింపుపై తమిళనాడు వ్యతిరేకతకు రాజకీయ, సాంస్కృతిక ప్రాతిపదికలు ఉన్నాయి. అయినప్పటికీ మౌలిక రాజ్యాంగ స్ఫూర్తికి అది పూర్తిగా అనుకూలంగా ఉన్నది. 1976 వరకు విద్య రాష్ట్ర జాబితాలోని అంశంగా ఉండేది. అత్యవసర పరిస్థితి కాలంలో దానిని ఉమ్మడి జాబితాలో చేర్చారు. నిరంకుశపాలనలో ఏకపక్షంగా జరిగిన మార్పు అది. ఆ రాజ్యాంగ సవరణ ఆధారంగానే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తాను నిర్దేశించిన విద్యా విధానాన్ని అనుసరించి తీరాలని తమిళనాడును ఒత్తిడి చేస్తోంది. లేనిపక్షంలో నిధులను ఉపసంహరించుకుంటామని బెదిరిస్తోంది. తమిళనాడు వైఖరిని వ్యతిరేకిస్తున్నవారు వివిధ కమిషన్లు సిఫారసు చేసిన త్రిభాషా సూత్రాన్ని ప్రస్తావిస్తున్నారు. పాఠశాల బాలలు మాతృభాష, ఇంగ్లీష్‌తో పాటు మూడో భాషనూ నేర్చుకోవాలని ఆ సూత్రం ప్రతిపాదించింది.



> స్వతంత్ర భారతదేశం మత, భాషాపరమైన బహుళతత్వాన్ని అంగీకరించి ఆదరించి అనుసరిస్తోంది. తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాల మధ్య ప్రస్తుత ప్రతిష్టంభన మన దేశం గురించిన రెండు దృక్కోణాల మధ్య ఘర్షణ. వాటిలో ఒకటి– వస్త్రధారణ, ఆహార అలవాట్లు, వివాహ బంధం, దైవ ప్రార్థన విషయంలో భారతీయుల స్వేచ్ఛను సమర్థించేది, ప్రోత్సహించేది. మరొకటి ఆ స్వేచ్ఛ స్థానంలో అన్నిరకాల నిర్దేశాలు, నిషిద్ధాలు విధించేది.

అయితే హిందీ రాష్ట్రాలలో మూడో భాషగా సంస్కృతాన్ని మాత్రమే బోధించడం జరుగుతోంది. యూపీ, బిహార్‌ల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తమిళం లేదా కన్నడం లేదా బెంగాలీ లేదా మలయాళ భాషను ఎన్నడూ మూడో భాషగా బోధించిన దాఖలాలు లేవు. కనీసం మరాఠీ లేదా గుజరాతీని సైతం బోధించలేదు. ఈ త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు అమలుపరచలేదు. ఉత్తరాది రాష్ట్రాలలో అది ఆచరణలో ఎలా పరిణమించిందన్నది తమిళనాడు అభ్యంతరాలను ధ్రువపరిచింది. జాతీయ సమైక్యతను పెంపొందించడానికి బదులుగా ప్రభుత్వ ప్రాయోజిత హిందీ విస్తరణ వాదానికి త్రిభాషా సూత్రం ఒక అనుద్దేశపూర్వక సాధనమయింది. సరిగ్గా ఈ కారణంగానే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కూడా త్రిభాషాసూత్రాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ విషయమై ప్రధానమంత్రి మౌనంగా ఉన్నప్పటికీ హోం మంత్రి మాత్రం విభిన్న రాష్ట్రాల మధ్య కమ్యూనికేషన్ మాధ్యమంగా హిందీ మాత్రమే ఉండాలని ఉంటుందని పదే పదే ఉద్ఘాటిస్తూ వస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడే భారతీయుల పట్ల తన అయిష్టతను సైతం ఆయన పదే పదే వ్యక్తం చేస్తూనే ఉన్నారు. 1965 నుంచి 2014 దాకా అర్ధ శతాబ్దం పాటు హిందీయేతర రాష్ట్రాలలో హిందీని ప్రోత్సహించేందుకు కేంద్రం శ్రద్ధగా ప్రయత్నించలేదు. అయినప్పటికీ హిందీ దేశ వ్యాప్తంగా వ్యాపించింది. అంతర్ రాష్ట్ర వలసలు, మరీ ముఖ్యంగా సినిమాలు, టీవీ మాధ్యమం ద్వారా ఆ భాషా వ్యాప్తి జరిగింది. బాంబే హిందీ సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఉపయోగించే హిందీ మృదువైన, వ్యవహారిక హిందుస్థానీయే గానీ ఆకాశవాణి, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలలో ఉపయోగించే సౌలభ్యమూ, సౌందర్యమూ కొరవడిన, మితిమీరిన స్థాయిలో సంస్కృతీకరణ అయిన హిందీ కాదు.

మోహన్ భగవత్ ఇటీవల కేరళలో ఒక సమావేశంలో మాట్లాడుతూ హిందువులు ఆంగ్ల భాషను త్యజించాలని కోరారు. ఒకప్పుడు లోహియా వలే ఇప్పుడు ఆరెస్సెస్ అధినేత కడా ఇంగ్లీష్‌ను ఆంగ్ల మానస పుత్రులైన భారతీయుల భాషగా పరిగణిస్తున్నారు. వలసపాలన భావ దాస్యంలో ఉన్నవారు ఆ భాషను ఔదలదాలుస్తున్నారనేది వారి ఆరోపణ. ఇంగ్లీష్ త్వరలోనే భారత్ నుంచి బహిష్కృతమవుతుందని లోహియా భావించారు. ఆయన ఆశించినట్టు జరగలేదు. ముఖ్యంగా 1990ల నుంచి ఇంగ్లీష్ శీఘ్రగతిన వ్యాప్తి చెందింది. ప్రభుత్వ ప్రాపకం ద్వారా కాకుండా ఇతరేతర రీతుల్లో అది వ్యాప్తి చెందింది. సాఫ్ట్‌వేర్ బూమ్ ఇందుకొక ప్రధాన కారణం. మన ఇంజినీరింగ్ కళాశాలలు అన్నీ ఇంగ్లీష్‌లోనే బోధించడం వల్లే అది సంభవించింది. సామాజిక చలనశీలతకు మార్గంగా, వృత్తిపరమైన పురోగతికి సోపానంగా, విశాల ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ఒక ప్రధాన గవాక్షంగా ఆంగ్ల భాష గుర్తింపు, ప్రాధాన్యాన్ని పొందింది.

ఆధునిక వృత్తులలోకి ప్రవేశించేందుకు దళితులు ఆంగ్ల భాషను నేర్చుకుని తీరాలని ప్రముఖ మేధావి చంద్రభాన్ ప్రసాద్ చాలా సంవత్సరాలుగా వాదిస్తున్నారు. ఆంగ్ల భాషలో ప్రావీణ్యాలు లేక పోవడం వల్లే ఆధునిక వృత్తులలో దళితుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని ఆయన విశ్వసిస్తున్నారు. 'ఇంగ్లీష్ సివంగి పాలు వంటిది, ఆ పాలను తాగిన వారే గర్జించగలరన్న' అంబేడ్కర్ మాటలను తన వాదనకు మద్దతుగా ఆయన తరచు ఉటంకిస్తుంటారు. మాతృభాషా అభిమానంతో కన్నడ సాహిత్యలోక దిగ్గజాలు పాఠశాలల్లో ఆంగ్ల భాషను బోధించవద్దని విజ్ఞప్తి చేసినప్పుడు దళిత మేధావులు గర్జిస్తూ ఇలా ప్రతిస్పందించారు: తొలుత మీరు మాకు సంస్కృతాన్ని నిరాకరించారు. ఇప్పుడు ఇంగ్లీష్‌నూ అదే విధంగా నిరాకరిస్తున్నారు. మీ అగ్రకుల ప్రాముఖ్యాన్ని, నిలబెట్టుకునేందుకే మీరు ఇలా చేస్తున్నారు.

నరేంద్ర మోదీ అధికారానికి రావడానికి ముందు కాలంలో హిందీ, ఇంగ్లీష్ రెండూ దేశవ్యాప్తంగా విశేష ప్రాచుర్యం పొందాయి. వ్యాకరణ సమ్మతంగా రాయలేక పోయినప్పటికీ, స్ఫుటంగా మాట్లాడలేకపోయినప్పటికీ ఇప్పుడు చాలా మంది భారతీయులు ఆ రెండిటిలో ఏదో ఒక భాషను గానీ లేదా రెండిటినీ గానీ అర్థం చేసుకోగలుగుతారు. హిందీయేతరులు హిందీని, భారతీయులు ఇంగ్లీష్‌ను ఇలా ఆదరంగా స్వీకరించడమనేది స్వచ్ఛందంగా, స్వతస్సిద్ధంగా జరిగిందని చెప్పి తీరాలి. ఇది దేశ ప్రజలపై రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఆరోగ్యకరమైన ప్రభావాన్ని చూపింది. విషాదేమేమిటంటే ఈప్రక్రియ మరింత ప్రగతిశీలంగా ముందుకు సాగకుండా సంఘ్ పరివార్ రాజ్యాధికారాన్ని ఉపయోగించి ఆంగ్లాన్ని అణచివేసి హిందీని సర్వత్రా ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తోంది. హిందువులు మాత్రమే ఈ దేశ సహజ పౌరులు అన్న వారి సంకుచిత విశ్వాసం వల్లే ఇలా వ్యవహరించడం జరుగుతోంది. భాషా రంగంలో జాతీయ సమైక్యతకు హిందీ ఉపయోగపడుతుందని వారు విశ్వసిస్తున్నారు.

హిందువులే ఈ దేశ నిజమైన పౌరులు అని చెప్తూతూ భారతీయ ముస్లింలను తులనాడుతూ అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న ప్రయత్నాలను ఇదే కాలమ్‌లో గతంలో పలుమార్లు వివరించాను. అయితే నేను తమిళనాడులో ఓటు వేయడం లేదు. కుటుంబ పాలన విషయంలో కాంగ్రెస్‌కు తీసిపోని డీఎంకే పట్ల నాకు అభిమానమూ లేదు, నేను ఆ పార్టీ పక్షపాతినీ కాను. అధికార భాషపై ఘర్షణ రెండు పాలక పార్టీల మధ్య కాదు, అది మన దేశం గురించిన రెండు దృక్కోణాల మధ్య ఘర్షణ. వాటిలో ఒకటి– వస్త్రధారణ, ఆహార అలవాట్లు, వివాహ బంధం, దైవ ప్రార్థన విషయంలో భారతీయుల స్వేచ్ఛను సమర్థించేది, సంపూర్ణంగా ప్రోత్సహించేది కాగా మరొకటి ఆ స్వేచ్ఛ స్థానంలో అన్నిరకాల నిర్దేశాలు, నిషిద్ధాలు విధించేది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

పెనుప్రమాదంలో హిమానీనదాలు

మంచినీటి ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి, జలవనరుల స్థిరనిర్వహణ కోసం 32వ ప్రపంచ నీటి దినోత్సవాన్ని 'హిమానీనద సంరక్షణ' ఇతివృత్తంతో నేడు నిర్వహించుకుంటున్నాం. 1993 నుంచి ఐక్యరాజ్యసమితి ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది.

పది శాతానికి పైగా ప్రపంచ భూభాగాన్ని కప్పి ఉంచిన హిమానీనదాలు, మానవాళి మనుగడకు అత్యంత ఆవశ్యకమైన మంచినీటిని అందించే ప్రధాన వనరులు. నిరంతరం కురిసే మంచు కాలక్రమేణా మందపాటి మంచుపలకంగా మారి, తన బరువు కారణంగా కిందకు జారుతూ, పారే నదులుగా మారుతాయి. ఆస్ట్రేలియాలో మినహా, అన్ని భూఖండాలలో వున్న హిమానీనదాలు వాతావరణ మార్పులకు గురై, కుంచించుకుపోతూ, ప్రాణుల మనుగడకు సవాలు విసురుతున్నాయి.

విలుప్తమైన వాటిని కూడా పరిగణిస్తే, ప్రపంచంలో రమారమి రెండు లక్షల చిన్న, పెద్ద హిమానీనదాలు వున్నాయి. వీటిలో సింహభాగం భూగోళానికి ఉత్తర, దక్షిణ ధ్రువాలలోని ఆర్కిటిక్, అంటార్కిటికా ఖండాలలో 130–170 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన ఖండాంతర హిమానీనదాలు వున్నాయి. మిగిలినవి దాదాపు లక్ష చదరపు కిలోమీటర్లలో విస్తరించి హిందూకుష్ హిమాలయ ప్రాంతంలో వున్నాయి. ధృవ ప్రాంతాలకు వెలుపల ఎక్కువ మొత్తంలో మంచు, మంచు పలకలూ ఉన్నందున ఈ ప్రాంతం మూడో ధ్రువంగా గుర్తింపు పొందింది.

మూడో ధ్రువంలో భాగమైన ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్, తజకిస్తాన్ దేశాల పరిధిలోని హిందూకుష్ పర్వతాలలో, భూటాన్, చైనా, భారత్, నేపాల్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలలోని హిమాలయ పర్వత ప్రాంతాలలో కలిపి దాదాపు 46 వేల హిమానీనదాలు వున్నాయి. ఎనిమిది వేల మీటర్లకు పైగా వున్న 14 శిఖరాలలోని హిమానీనదాలు సింధు, గంగ, బ్రహ్మపుత్ర వంటి పది ప్రధాన నదులకు జీవం పోస్తూ అత్యధిక జనాభా గల దేశాలలో పర్యావరణానికి ఊతమిస్తున్నాయి. ధ్రువ ప్రాంతాలకు వెలుపల, అధికంగా ఏడు వేల హిమానీనదాలు కలిగివున్న దేశంగా పాకిస్థాన్ నిలుస్తోంది.

భారత్ విషయానికి వస్తే, ధ్రువ ప్రాంతాలకు ఆవల 78 కి.మీ. పొడవున్న సియాచిన్ రెండో అతిపెద్ద హిమానీనదం. ఇది కాకుండా, గంగ నది జన్మస్థానం గంగోత్రి, మిలన్, జెము, పిండారీ వంటి ప్రముఖ హిమానీనదాలు దేశంలో వున్నాయి. వాతావరణ మార్పులతో, హిందూకుష్ హిమాలయ ప్రాంతంలోని హిమానీనదాలు ద్విగుణీకృత వేగంతో కరుగుతున్నాయి.

పదేళ్ల క్రితం, లద్దాఖ్‌లోని లేహ్ జిల్లాలో కులుం గ్రామం ఇల్లూ వాకిలి వదిలి సమీపంలోని లేహ్–మనాలి జాతీయ రహదారి మీది ఉప్షి గ్రామంలో ఉపాధికి వలస వెళ్ళింది. తమ గ్రామం యావత్తూ ఆధారపడిన హిమానీనది కరిగి పోవడం, ఏడాదికేడాది తగ్గుముఖం పట్టిన మంచు మొత్తం ఇరవై కుటుంబాలకు తాగునీరు, సాగునీరు లేకుండా చేయడమే దీనికి కారణం. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరిగిన ఉష్ణోగ్రతలు పర్వత ప్రాంతాలలో శరదృతువు మంచును వసంత ఋతువులో నీటిగా వాడుకునే పరిస్థితిని క్రమంగా మారుస్తున్నాయి. లద్దాఖ్‌లో పద్మశ్రీ చెవాంగ్ నోర్ఫెల్ పర్వతపువాలులో చేపట్టిన కృత్రిమ హిమానీనదాల నిర్మాణం, లేదా రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఏటా శీతాకాలంలో నిర్మిస్తున్న హిమాస్థూపాలు అక్కడ చేజారుతున్న పరిస్థితిని అవగతం చేస్తున్నాయి. ఇది కేవలం కులుం గ్రామ కథ కాదు, హిమాలయ సానువుల్లో వున్న ప్రతి గ్రామం ఎదుర్కొంటున్న సవాలే. హిమాలయాల పర్యావరణాన్ని కాపాడే ఉద్యమంలో భాగంగా సోనమ్ వాంగ్‌చుక్ గత నెలలో ఖర్దుంగ్ లా పాస్ దగ్గర కరుగుతున్న హిమానీనద భాగాన్ని (ట్రావెలింగ్ గ్లేసియర్) ఐక్యరాజ్య సమితి ముఖ్య కార్యాలయంలో పర్యావరణ కార్యక్రమ అధికారి జమీల్ అహ్మద్‌కి అందజేసి హిమాలయ ప్రాంత ప్రజలు ఎదుర్కోనున్న మనుగడ సమస్యను, హిమానీనద సంరక్షణ ఆవశ్యకతను నొక్కి చెప్పారు.





> పది శాతానికి పైగా ప్రపంచ భూభాగాన్ని కప్పి ఉంచిన హిమానీనదాలు, మానవాళి మనుగడకు అత్యంత ఆవశ్యకమైన మంచినీటిని అందించే ప్రధాన వనరులు. ఆస్ట్రేలియాలో మినహా, అన్ని భూఖండాలలో వున్న హిమానీనదాలు వాతావరణ మార్పులకు గురై, కుంచించుకుపోతూ, ప్రాణుల మనుగడకు సవాలు విసురుతున్నాయి.

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 1984–2023 మధ్య హిమాలయ నదీ పరీవాహక ప్రాంతాలలో సేకరించిన వివరాల విశ్లేషణలో, పది హెక్టార్ల విస్తీర్ణం పైబడిన 2431 హిమానదీయ సరస్సులలో 676 సరస్సుల విస్తీర్ణం రెట్టింపయింది. ఇందులో 130 భారత్ పరిధిలోనివే. దీనర్థం, మంచు కరిగి నదుల ద్వారా సముద్రాలలో కలిసి, సముద్రాల మట్టం పెంచడం, తద్వారా తీర ప్రాంతాలను ముంచడం. ఇది దీర్ఘకాల ప్రమాదమైతే, హిమానదీయ సరస్సులు కట్టలు తెగి (గ్లేషియల్ లేక్ అవుట్ బరస్ట్ ఫ్లడ్స్) 2013 కేదార్‌నాథ్ వరదల వంటి ప్రమాదాలూ పొంచి ఉన్నాయి. క్రమరీతిలో నీటి లభ్యత లేకపోతే, గంగ వంటి జీవనదులు కాస్తా కాలానుగుణ నదులుగా మారే ప్రమాదం వున్నది. జాతీయ ధ్రువ, మహాసముద్ర పరిశోధన కేంద్రం (ఎన్‌సిపిఓఆర్) హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహోల్ స్పితీలోని చంద్రబేసిన్‌లో జరిపిన పరిశోధనలో 2013–2021 మధ్య హిమ ప్రాంతానికి ఆరుశాతం మేరకు నష్టం వాటిల్లినట్టు తెలిసింది.

గంగ, బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థలకు దాదాపు సగం నీరు హిమానీనదాలు కరిగిన నీటి ద్వారానే లభ్యమవుతుంది. అయితే, క్రమంగా తగ్గుతున్న హిమానీనదాలు, నేరుగా ఆయా పరీవాహక ప్రాంతాలలోని వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాల నీటి లభ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. విలుప్తమవుతున్న హిమానీనదాలు, హిమాలయాల్లోని కులుం వంటి గ్రామాలను ఇప్పటికే ప్రమాదంలో పడేశాయి. హిమాలయాలను ప్రభావితం చేసే అన్ని అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి తక్షణమే దిద్దుబాటు చర్యలను తీసుకుంటేనే దశాబ్దాల నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టాన్ని ప్రస్తుతానికి అరికట్టగలం. హిమాలయాలకు అయిన గాయం మానడానికి అవి ఏర్పడడానికి పట్టినంత సమయం పడుతుంది. ఇది ఒక ప్రభుత్వమో, దేశమో చేయగల కార్యం కాదు. సమష్టిగా మానవాళి తమ మనుగడ కోసం, తమ జీవన శైలిని మార్చుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా హిమానీనద సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయాలి.


• రమేశ్‌చంద్ర రావులపల్లి (ఐ.ఐ.ఎస్)

(నేడు ప్రపంచ నీటి దినోత్సవం)

కెవిఆర్ లేఖలు ఆవిష్కరణ

కెవిఆర్‌గా ప్రసిద్ధుడైన కె.వి.రమణా రెడ్డి తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రభావశీలమైన వ్యక్తి. కావలి జవహర్ భారతిలో అధ్యాపకులుగా పని చేస్తూనే రచనా వ్యాసాంగాన్ని కొనసాగించినవారు. సాహిత్య రచనలో భిన్నప్రక్రియలలో కెవిఆర్ కృషి ఉంది. జీవితాంతం ప్రగతిశీల ఉద్యమాలలో భాగమైనవాడు. 1970లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘానికి కార్యదర్శి ఎరుపు, అరుణతారకు సంపాదక బాధ్యతలు నిర్వహించాడు. 1975 జూన్‌లో అత్యవసర స్థితిలో 21 నెలలు జైలు జీవితాన్ని అనుభవించారు. తెలుగు సమాజపు సృజనాత్మక ఆవరణకు కెవిఆర్ సాక్షి. గురజాడ సాహిత్య కల్పనను మహోదయం పేరిట పరిచయం చేశారు. రవీంద్రుని కథలను తెలుగు చేసారు. చివరిశ్వాస వరకు విప్లవ రచయితల సంఘం బాధ్యతలలో ఉన్నారు. 1998 జనవరిలో కెవిఆర్, 2009లో ఆయన సహచరి శారదాంబ మరణించారు. కుటుంబ సభ్యులు కెవిఆర్–శారదాంబ కమిటీని ఏర్పాటు చేసి పుస్తకాలను ప్రచురించి, ప్రతి ఏటా కెవిఆర్ పుట్టిన తేదీ మార్చి 23న స్మారక ప్రసంగాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆదివారం విజయవాడలోని స్వర్ణాప్యాలెస్ సమావేశ మందిరం (చల్లపల్లి బంగళా)లో ఉదయం 10గం.లకు కెవిఆర్ లేఖలు ఆవిష్కరణ జరుగుతుంది. 'సంస్కృతి, భావజాలం, కెవిఆర్ దృక్పథం' అనే అంశంపై ప్రొఫెసర్ కాశీం, 'జీఎన్.సాయిబాబ అమరత్వం'పై వసంత ప్రసంగాలు ఉంటాయి.

– అరసవిల్లి కృష్ణ
కెవిఆర్–శారదాంబ స్మారక కమిటీ



సొమ్ములిస్తే చాలు!

నిబంధనలు పక్కనపెట్టి మరీ భూ రిజిస్ట్రేషన్లు

- కొందరు సబ్ రిజిస్ట్రార్ల సెప'రేటు' దందా
- నాలా కన్వర్షన్ లేకున్నా అసైన్డ్ భూములకు సైతం దర్జాగా రిజిస్ట్రేషన్లు
- ఒక్కో డాక్యుమెంటుకు రూ.10వేల నుంచి రూ.20 వేలకు వరకు వసూలు
- వివాదాస్పద భూములైతే భూమి విలువలో 10శాతం డిమాండ్
- సహాయకులు, దిగువస్థాయి సిబ్బంది ద్వారా వసూళ్ల పర్వం
- తొమ్మిది నెలల్లో ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్లు ఏసీబీకి చిక్కినా మారని మిగతావారి తీరు
- అక్రమాలకు అడ్డాగా ఓరుగల్లు కార్యాలయాలు
- ఉమ్మడి జిల్లాలో తిష్టవేసిన పొరుగు జిల్లా అధికారులు

వారిదంతా సెప'రేటు'రూటు. పైసలు ఇస్తే చాలు నిబంధనలను సైతం పక్కన పెట్టేస్తారు. అందినకాడికి దండుకుని అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్లు చేసేస్తారు. కొన్ని సందర్భాల్లో పత్రాలు సక్రమంగా ఉన్నా.. చేయి తడపనిదే ఫైలును కదలనివ్వరు. ఇక పత్రాలు లేని, వివాదాస్పద భూములైతే తమ నోటికొచ్చినంత అడిగేస్తారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొందరు సబ్‌రిజిస్ట్రార్లు తమ కార్యాలయాలను అవినీతికి అడ్డాలుగా మార్చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిది నెలల కాలంలో ముగ్గురు అధికారులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి అడ్డంగా దొరికినా ఆశాఖలో జరుగుతున్న వసూళ్ల పర్వం ఆగడం లేదు. ఈ దందాలో సదరు అధికారులకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లే సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్లకు ఇవ్వాల్సి సొమ్ముతో పాటు డాక్యుమెంట్ తయారీ ఖర్చుల పేరుతో వారు కూడా వసూళ్లకు దిగుతున్నారు. లింకు డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవటం, వివాదాస్పద భూములు, నాలా కన్వర్షన్ లేని భూములు, సాక్షులు అందుబాటులో లేకపోవటం లాంటివి సాకుగా చూపి రూ.5వేల నుంచి రూ.2లక్షల వరకు లంచంగా గుంజుతున్నారనే ఆరోపణలున్నాయి.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

హనుమకొండ పట్టణానికి చెందిన ఓ ఉద్యోగి ఓ ప్లాట్ కొనుగోలు చేశాడు. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయి. కానీ డాక్యుమెంట్ రైటర్ రూ.5వేలు ఇస్తే వెంటనే రిజిస్ట్రేషన్ అవుతుందని, లేదంటే కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పాడు. తనకు అన్ని పత్రాలు సక్రమంగా ఉండటంతో మామూళ్లు ఇచ్చేందుకు సదరు ఉద్యోగి ససేమిరా అనటంతో.. వారానికి పైగా కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చింది. దీంతో అడిగింది ఇచ్చి 24గంటల్లో పని పూర్తి చేయించుకున్నాడు.

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, గత ఏడాది ఇక్కడ పనిచేసిన ఆర్వోలంతా బదిలీ అయ్యారు. ఈ బదిలీల్లో ఎక్కువ శాతం ఖమ్మం జిల్లాకు చెందిన ఆర్వోలు ఉమ్మడి వరంగల్‌కు వచ్చారు. ఈ బదిలీల ప్రక్రియలోనూ భారీగానే సొమ్ముల చేతులు మారాయనే ఆరోపణలు వినిపించాయి. అయితే పొరుగు జిల్లా నుంచి వచ్చిన కొందరు అధికారులు పెట్టిన ఖర్చులను రాబట్టుకునే పనిలో భారీగా వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో భూముల రిజిస్ట్రేషన్ కొంతమంది సబ్‌రిజిస్ట్రార్ల కాసుల పంట పండిస్తుందనే చర్చ జరుగుతోంది. ఒక్కొక్క ఏరియా.. రిజిస్ట్రేషన్ చేయాల్సిన భూములను బట్టి.. రేట్లు పెట్టి మరీ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు ఇచ్చుకోవల్సిందేనని బాధితులు వాపోతున్నారు. చెయ్యి తడపకుంటే రిజిస్ట్రేషన్ కాగితాల్లో ఏదో ఒక తప్పును గుర్తించి రోజులు, నెలల తరబడి తిప్పుతున్నారు. దీంతో అడిగినంత ఇచ్చుకుని రిజిస్ట్రేషన్ తంతు ముగించుకుంటున్నారు. ఇక నాలా కన్వర్షన్ లేకున్నా కూడా చాలా ప్రాంతాల్లో దర్జాగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు మునిసిపాలిటీ ఏరియాల్లో గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగింది. అయితే చాలా చోట్ల నాన్‌లేవుట్ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు, ఫామ్‌ల్యాండ్ పేరిట భూములు కొనుగోలు చేసినవారికి చాలా వరకు నాలా కన్వర్షన్ లేదు. దీంతో ఇంటి నిర్మాణానికి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ అవసరం కావటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగుతున్నారు. ఇదే అదనుగా వీటి కోసం ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు ఏరియాను, భూమికి మార్కెట్ విలువను బట్టి దళారులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నాన్ లేవుట్ ప్లాట్లతో వ్యాపారం చేస్తున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు కాసుల పంట పండుతుండగా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా

మిగతా 7వ పేజీలో...




హనుమకొండ బాయ్స్ హైస్కూల్ సెంటర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం



ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

తొలి రోజు వరంగల్ జిల్లాలో 99.80, హనుమకొండలో 99.97 శాతం హాజరు



హనుమకొండ బాయ్స్ హైస్కూల్ సెంటర్‌లోకి వస్తున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి నెలకొంది. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను 9 గంటల నుంచి అనుమతించారు. వరంగల్ జిల్లాలో 9,238 మంది విద్యార్థులకు గాను 9,223 మంది హాజరు కాగా, 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హనుమకొండ జిల్లాలో 11,999 మంది విద్యార్థులకు గాను 11,995మంది విద్యార్థులు హాజరు కాగా, 4గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలి రోజు తెలుగు పరీక్షకు వరంగల్ జిల్లాలో 99.8 శాతం, హనుమకొండలో 99.97 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవోలు జ్ఞానేశ్వర్, వాసంతి తెలిపారు.

వరంగల్ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ప్లాటినం జూబ్లీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంతో పాటు గీసుగొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, ధర్మారం జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. కాగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి వివిధ కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరును పర్యవేక్షించారు. కేంద్రాల్లోని వసతులు కల్పించి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా జిల్లా యంత్రాంగం కృషి చేయాలన్నారు. కాగా, రెండు జిల్లాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వివిధ పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

వరంగల్ మెడికల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య హెచ్చరించారు. కమిషనర్ కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం బృందం సభ్యులు నాలుగు సెంటర్లను తనిఖీ చేసి రికార్డులు, స్కానింగ్ మెషిన్‌లు, ఫామ్ ఎఫ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించారు. పీసీ, పీఎన్‌డీటీ, ఎంటీపీ యాక్ట్ ప్రకారం నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని తెలిపారు. ధరల పట్టిక, గర్భిణుల పూర్తి వివరాలు, రెఫర్ చేసిన డాక్టర్ వివరాలను రికార్డులలో పొందుపర్చాలని అన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా అర్హతలేని డాక్టర్లు అబార్షన్లు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ మంజుల, సఖి వన్‌స్టాప్ సెంటర్ నుంచి హైమావతి, భరోసా సెంటర్ నుంచి ఎస్సై బోయిన మంగ, రాజేశ్వర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదిలో అందుబాటులోకి కోచ్‌ల తయారీ

- లోకో పైలెట్ల సమస్యలను పరిష్కరిస్తాం
- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్
- కాజీపేటలో సేఫ్టీపై లోకోపైలెట్లతో ప్రత్యేక సమావేశం



లోకోపైలెట్లతో సమావేశంలో మాట్లాడుతున్న ఏకే జైన్

కాజీపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివరి కల్లా కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీలో తయారు చేసిన కోచ్‌లు అందుబాటులోకి వస్తాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఏకే జైన్ అన్నారు. కాజీపేట క్రూలాబీలో శుక్రవారం లోకో పైలెట్‌లకు, అసిస్టెంట్ లోకో పైలెట్‌లకు సేఫ్టీ సెమినార్ జరిగింది. అంతకు ముందు జీఎం మీడియాతో మాట్లాడారు. కాజీపేటను అమృత్ భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రైల్వేలో సెఫ్టీయే ప్రధానం అన్నారు. సేఫ్టీ విభాగాల్లో పని చేసే ప్రతీ ఒక్కరు తమ విధుల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. అంతకుముందు క్రూలాబీలో లోకో పైలెట్‌లు, అసిస్టెంట్ లోకో పైలెట్‌లతో జరిగిన అంతర్గత సేఫ్టీ సెమినార్‌లో పలువురు లోకో పైలెట్‌లు తమ సమస్యల్ని విన్నవించారు. రైల్వే నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్నామని చెప్పారు. తొమ్మిది గంటలకు తమ విధులు పూర్తికాకుండా 14 గంటల వరకు విధుల్లో ఉండాల్సి వస్తోందని, దీంతో తమ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటోదని గోడు వెలిబుచ్చారు. మరికొందరు పైలెట్‌లైతే కొన్ని సందర్భాల్లో 14గంటల వరకు విధుల్లో ఉండడంతో కుటుంబ సమాచారం తెలియడం లేదని చెప్పారు. తమను రైల్వే నిబంధనలు లోబడి పనులు చేయించాలని కోరారు. సుమారు మూడుగంటల పాటు లోకోపైలెట్‌ల సమస్యలు ఓపిగ్గా విన్న రైల్వే జీఎం ఏకే జైన్ మాట్లాడు తూ.. లోకోపైలెట్‌ల సమస్యల్ని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జీఎం వెంట డీఆర్ఎం భర్తేష్‌కుమార్ జైన్, పీసీవోఎం పద్మజ, సీనియర్ డీవోఎం సురేశ్‌రెడ్డి, స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, ఆర్‌పీఎఫ్ ఇన్ స్పెక్టర్ ఎం.సంజీవరావుతోపాటు అన్ని డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీలు ఉన్నారు. ఈ సందర్భంగా రైల్వే ఆస్పత్రి మరమ్మతు చేయాలని కోరుతూ బీజేపీ నాయకురాలు రావు పద్మ వినతి పత్రం సమర్పించారు. లోకోపైలెట్‌ల ఖాళీలను భర్తీ చే యాలని కోరుతూ ఎంప్లాయీస్ సంఘ్ నేత పాక రాజ్‌కుమార్ ఇతర నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఇదిలా ఉండగా రైల్వే జీఎం రైలులో వస్తున్న క్రమంలో విరిగిన రైలు పట్టా పక్కట్రాక్‌పై పడి ఉండడంతో రైల్వే అధికారులు జీఎం దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. ట్రాక్‌పై విరిగిన పట్టాపడి ఉన్నా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంపై రైల్వే అధికారుల్లో చర్చ జరిగింది.

ప్రారంభానికి 'వరంగల్ స్టేషన్' సిద్ధం చేయండి 6 అభివృద్ధి పనులను పరిశీలించిన ఏకే జైన్

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

- కృతిమ మేధ ద్వారా బోధన చేయాలి..
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- ఐనవోలు మండలంలో విస్తృత పర్యటన

ఐనవోలు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కృత్రిమ మేధ(ఏఐ)తో పాఠాలు బోధించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలులో భాగంగా కక్కిరాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ద్వారా చేపట్టిన బోధన కార్యక్రమాన్ని శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులు కంప్యూటర్‌ను ఆపరేట్ చేస్తుండగా ప్రత్యక్షంగా చూసి వాటి వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కంప్యూటర్ ద్వారా పాఠాలు ఆసక్తికరంగా నేర్చుకుంటారని, ఏఐ ద్వారా ప్రతీ విద్యార్థి సామర్థ్యాన్ని మదింపు చేసి, వారి స్థాయికి తగిన విధంగా తెలుగు, ఆంగ్ల అంశాలలో పదాలు, వాక్యాలు, గణిత సమస్యలను సాధించడంలో ఏఐ సహకరిస్తుందని వివరించారు. విద్యార్థులు వాటిని పూర్తిచేస్తూ తర్వాత స్థాయికి వెళ్లడం ద్వారా అంచెలంచెలుగా నేర్చుకుంటారని తెలిపారు. పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శాస్త్ర సాంకేతిక అంశాలలో రాణించే విధంగా ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. అనంతరం హైస్కూల్ తరగతి గదులు, కిచెన్‌షెడ్‌ను పరిశీలించి ఇటీవల కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్‌వాడీ భవనాన్ని ప్రభుత్వ పాఠశాలలోని ఖాళీగా ఉన్న భవనంలోకి మార్చాలన్నారు. పలువురు స్థానికులు పాఠశాలకు వచ్చి కలెక్టర్‌కు సమస్యలు విన్నవించగా పరిష్కరిస్తానన్నారు.



కక్కిరాలపల్లి పాఠశాలలో ఏఐ విద్యా బోధనను ఆసక్తిగా పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

'గేట్' ఫస్ట్ ర్యాంకర్ రేవంత్‌కు సత్కారం


రేవంత్‌ను సత్కరిస్తున్న మేరు కుల సంఘం నాయకులు

శంభునిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గేట్‌లో ప్రతిభ కనబరిచిన కీర్తి రేవంత్‌ను మేరు కుల సంఘం రాష్ట్ర నాయకుడు కర్నె రవీందర్ సత్కరించారు. ఐఐటీ రూర్కీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ (గేట్)- 2025 అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగంలో దేశాయిపేటకు చెందిన కీర్తి రేవంత్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం కర్నె రవీందర్ దేశాయిపేటలో రేవంత్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు కీర్తి నాగరాజు, కవితలకు మిఠాయిలు తినిపించి అభినందించారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ.. రేవంత్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేరు కుల సంఘం నాయకులు కర్నె వాసుదేవ్, ఓడపల్లి సాగర్, గందె గోపి, పొడిశెట్టి దేవేందర్, సంఘ వేణు పాల్గొన్నారు. కాగా, రేవంత్ తండ్రి నాగరాజు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.

రైల్వే జీఎంకు త్రుటిలో తప్పిన ప్రమాదం?


ఇనుప ముక్కలు

హసన్‌పర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం నుంచి వరంగల్ వరకు ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా హాజరైన రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు శుక్రవారం త్రుటిలో ప్రమాదం తప్పినట్లు రైల్వే అధికారులు గుర్తించినప్పటికీ గోప్యంగా ఉంచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైల్వే ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా ఆయన ప్రయాణిస్తున్న రైలు మార్గంలోగుర్తు తెలియని వ్యక్తులు 372/36-373/14 కిలోమీటర్ రైల్వే లైన్ పట్టాలపై ఇనుప చువ్వలు ఏర్పాటు చేయడంతో ఆఇనుప ముక్కలు కిలో మీటర్ వరకు దూసు కెళ్లినట్లు రైల్వే డ్రైవర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు గుర్తించినప్పటికీ కిమ్మనకుండా ఉన్నతాధికారుల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రైల్వే శాఖలోనే చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ప్రమాదం జరిగితే రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్‌తో పాటు పలువురి ప్రాణాలకు పెనుప్రమాదం జరిగేదని పలువురు రైల్వే అధికారు లు చెబుతున్నారు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన పీడబ్ల్యుఐ, అసిస్టెం ట్ పీడబ్ల్యుఐతోపాటు నలుగురు ట్రాలీమెన్స్ గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

కల్తీ ఐస్‌క్రీమ్ ఉత్పత్తులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు సమీపంలోని ఏనుగంటి ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్‌లో ఆహార భద్రత నియమాలు పాటించకుండా, గడువు తేదీలను ముద్రించకుండా అమ్మకానికి నిల్వచేసిన రూ.93.200 విలువ చేసే 12 రకాల ఉత్పత్తులను సీజ్‌చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం సీజ్‌చేసిన ఉత్పత్తులతో పాటు నిర్వాహకుడు ఏనుగంటి సురేశ్‌ను ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తికి అప్పగించినట్లు తెలిపారు.

గుట్కాలు పట్టివేత

హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీ మార్త మార్కేండయ అనే కిరాణ వ్యాపారి నుంచి రూ.27,750 విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన గుట్కాలను పట్టుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ ఘటనలో గుట్కాలు సరఫరా చేసే రాందేవ్ జనరల్ స్టోర్స్ హుజూరాబాద్‌కు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు.

పెట్టుబడిదారీవర్గాలకు వంతపాడుతున్న ప్రభుత్వాలు

- సంకీర్ణ ప్రభుత్వాల అవశ్యకత పెరుగుతోంది
- కర్నాటక గుల్బార్గా వర్సిటీ యాక్టింగ్ వీసీ ప్రొఫెసర్ శ్రీరాములు
- కేయూ రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం


మాట్లాడుతున్న గుల్బార్గా వర్సిటీ యాక్టింగ్ వీసీ ప్రొఫెసర్ శ్రీరాములు

కేయూ క్యాంపస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భారత రాజకీయాల్లో సంకీర్ణ ప్రభుత్వాల పాత్ర కీలకంగా మారుతోందని, ఒక్క ఓటుతో ప్రభుత్వాలు అస్థిరమై అధికారం కోల్పోయాయని కర్నాటకలోని గుర్బాల్గా యూనివర్సిటీ యాక్టింగ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శ్రీరాములు అన్నారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేయూ సెనెట్ హాల్‌లో రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ శ్రీరాములు హాజరై మాట్లాడారు. ప్రాంతీయ పార్టీలు ప్రజల అభీష్టాల మేరకు పనిచేస్తాయని, ఈ పార్టీల ప్రాధాన్యత ప్రజాస్వామ్యంలో కీలమన్నారు. కులం, ప్రాంతం, వర్గం, మతం ప్రాతిపదికగా పార్టీలు ఏర్పడుతున్నాయని వెల్లడించారు. ప్రాంతీయ పార్టీలతో ప్రజలకు జవాబుదారీ పెరుగుతోందని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణమైన పాలన అందిస్తేనే ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రముఖ సామాజిక వేత్త, హెచ్‌సీయూ రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ సదస్సులో కీలక ప్రసంగం చేశారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే రాజకీయ పార్టీల కర్తవ్యమని చెప్పారు. ప్రజల జీవితాల్లో ప్రభుత్వాలు, పార్టీలు వెలుగులు నింపాలని సూచించారు. ప్రజలందరూ చైతన్యవంతంగా ఉండాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో డబ్బులు పంచి అధికారాన్ని చెలాయిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. భిన్నత్వం కలిగిన మన దేశంలో జమిలీ ఎన్నికలు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. 1960నుంచి ప్రాంతీయ పార్టీల ప్రభావం పెరుగుతోందని చెప్పారు. 1991 గ్లోబలైజేషన్‌తో మానవ సంబంధాలు మృగ్యంగా మారుతున్నాయని చెప్పారు. యువత ప్రజాస్వామ్య లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం. మాట్లాడుతూ.. రాజకీయాలు వ్యక్తి జీవితంలో ప్రాధాన్యత కలవన్నారు. ప్రజలు నిత్యం జాగ్రత్తతో ఉండాలని పేర్కొన్నారు. విభాగ అభివృద్ధిలో పాలుపంచుకుంటాని చెప్పారు. కేయూ సోషల్ సైన్స్ డీన్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ మాట్లాడుతూ.. రాజకీయాలను, వ్యక్తులను వేర్వేరుగా చూడలేమన్నారు. రాజనీతిశాస్త్ర విభాగానికి తన వంతుగా సహాయ, సహకారాలు ఇస్తానన్నారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. రెండు నెలలుగా మేధావులు, విద్యావేత్తలు, వర్సిటీ ఉన్నతాధికారుల సూచనలతో సంకీర్ణ ప్రభుత్వాలపై కీలక అంశాల నేపథ్యంలో జాతీయ సదస్సు నిర్వహించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. దేశ రాజకీయాలను సునిశితంగా అంచనా వేసేందుకు సదస్సు దోహదపడుతోందని చెప్పారు. ఈ సదస్సులో పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజు గౌడ్, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ జి.కృష్ణయ్య, డాక్టర్ సత్యనారాయణ, వేడపల్లి నాగరాజు, లక్ష్మీనారాయణ, సంజీవ్, లలిత కుమారి, విజయ్, భాగ్యమ్మ, ప్రొఫెసర్ గుగులోత్ వీరన్న నాయక్, రఘురాంరెడ్డి, డాక్టర్ మంద వీరాస్వామి, ఓయూ ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ కొట్టే భాస్కర్, పొలిటికల్ సైన్స్ విభాగం స్కాలర్లు బి.నరసింహరావు, కల్లెపల్లి ప్రశాంత్, అంకిళ్ల శంకర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం చేయండి

- దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్
- వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన


వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న జీఎం అరుణ్ కుమార్ జైన్

గిర్మాజీపేట, మార్చి21(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద ఎయిర్‌పోర్టు తరహాలో అధునాతన వసతులతో అభివృద్ధి చేసిన వరంగల్ రైల్వేస్టేషన్ పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా దీన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని ఆయన అధికారులకు సూచనప్రాయంగా చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం రామగుండం నుంచి ప్రత్యేక రైలులో ఆయన రైల్వే ఉన్నతాధికారులతో కలిసి వరంగల్‌కు చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ మేనేజర్ బాల రాజ్ నాయక్ ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమృత్ భారత్ పథకం కింద రూ.25 కోట్లతో చేపట్టిన వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల ఫొటోలను వీక్షించారు. పనుల గురించి సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ భరతేష్ కుమార్ జీఎంకు వివరించారు.

అనంతరం జీఎం సర్కులేటింగ్ ఏరియాలో నూతనంగా ఏర్పాటుచేసిన రైల్‌కోచ్ రెస్టారెంట్‌కు వెళ్లి ఆహార పదార్థాల నాణ్యత గురించి ప్రయాణికులను అడిగితెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత మెయిన్ రోడ్డు వరకు వెళ్లి వాహనాల పార్కింగ్, సర్కులేటింగ్ ఏరియాలో ఏర్పాటుచేసిన గ్రీనరీని పరిశీలించారు. ప్రయాణికుల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అక్కడి నుంచి మొదటి ప్లాట్‌ఫామ్‌పైకి చేరుకుని అధునాతనంగా తీర్చిదిద్దిన ఏసీ పెయిడ్ వెయిటింగ్ హాల్, సాధారణ ప్రయాణికుల విశ్రాంతి మందిరాలను పరిశీలించారు. వసతులు ఎలా ఉన్నాయంటూ ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఎస్కలేటర్లు, ర్యాంపులు, లిఫ్టలను చూసి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి సకాలంలో పూర్తి చేస్తామని రైల్వే అధికారులు జీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బాలాజీ కిరణ్, రైల్వే డిఈఎన్ (సౌత్) దినకర్, సిసిఐ రాజ్‌గోపాల్, ఆర్‌పీఎఫ్ సీఐ టి.ఎస్.ఆర్. కృష్ణ, ఎస్సై వెంకటేశ్వర్లు, జీఆర్‌పీ సీఐ సురేందర్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై విస్తృత ప్రచారం జరగాలి


పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు మహిళా ఉద్యోగుల వాహన ర్యాలీ

హనుమకొండ సిటీ, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): బాలికల సంరక్షణ కోసం అమల్లో ఉన్న కార్యక్రమాలతో పాటు మరింత విస్తృత ప్రచారం జరగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. 'బేటీ బచావో - బేటీ పడావో' కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వాహనాల ర్యాలీ జరిగింది. హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ కార్యాలయం జరిగిన ర్యాలీలో మహిళా పోలీసులు, మహిళా ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు. కమిషనరేట్ వద్ద ప్రారంభమైన ర్యాలీని సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ వద్ద ర్యాలీని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. బాలిక సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. విద్యాభివృద్ధిపైనే బాలికల భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ఈ మేరకు ప్రతీ ఒక్కరు సహకరిస్తే బాలికల భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీను, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారుల సేవల్లో ఎన్పీడీసీఎల్‌కు ఐదో ర్యాంకు

రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కన్స్యూమర్ సర్వీసింగ్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్‌లో ఎన్పీడీసీఎల్‌కు కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో 'ఏ' రేటింగ్‌తోపాటు కేటగిరి పరంగా ఐదోర్యాంకు ప్రకటించినట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగ దారులకు మెరుగైన సేవలందించడంలో భాగంగా త్వరతగిన సర్వీసులు మంజూరు చేయడం, బిల్లింగ్ ప్రక్రియ వేగవంతం, ఫిర్యాదుల పరిష్కారం లో జవాబుదారీతనంతో పాటు కార్యాచరణలో ముందుండటం వలన ఐదో ర్యాంకు వచ్చిందన్నారు. విద్యుత్ సరఫరాలో సాంకేతికతను అందిపుచ్చుకొని నిబద్ధతతో ముందుకెళ్తున్నామని అన్నారు.

మానవజీవితంతో గణితం అవిభాజ్యం

రిటైర్డ్ డీఈవో రమేశ్వర రాజు



గణిత పథకం-భవిత రథం పుస్తకం ఆవిష్కరణ

హనుమకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గణితానికి, మానవ జీవితానికి విడదీయరాని సంబంధం ఉందని, ప్రపంచమంతా గణితం చుట్టే తిరుగుతోందని రిటైర్డ్ జిల్లా విద్యాశాఖాధికారి నన్నపునేని రమేశ్వర రాజు అన్నారు. శుక్రవారం హనుమకొండ పరిమిళకాలనీ సిగ్నేచర్ ప్లేస్ అపార్టుమెంట్‌లో రిటైర్డ్ మ్యాథ్స్ లెక్చరర్, గణిత అవధాని డాక్టర్ అడ్లూరు నరసింహమూర్తి రాసిన గణిత పథం-భవిత రథం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సభకు అధ్యక్షత వహించిన రమేశ్వర రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గణితం పట్ల విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగిస్తే వారు చదువులో అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈ దిశగా డాక్టర్ నరసింహమూర్తి 365 గణిత ప్రశ్నలు, వాటి సమాధానాలతో గణిత పథం-భవిత రథం అన్నారు. ప్రముఖ విద్య, పారిశ్రామికవేత్త డాక్టర్ గుజ్జారి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. డాక్టర్ నరిసింహమూర్తి గణితంపై ముద్రించిన పుస్తకాల్లో ఇది పదిహేనవదని, భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని అకాంక్షించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ దహగాం సాంబమూర్తి 365 గణిత సమస్యలకు 365 సమాధానాలతో వారంలో 24 గంటలు ప్రవర్ధిల్ల గల ఈ పుస్తకం ఎంతో విలువైందన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ పెరటి మల్లారెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ నరసింహమూర్తి జలధి గణిత విజ్ఞాన పీఠం ద్వారా విద్యార్థుల కోసం వందలాది కార్యక్రమాలను నిర్వహించారని, 365 గణిత కార్యక్రమంలో 365 నిముషాలలో అధ్యయనం చేయగలిగేట్లు వివిధ మార్గాల ద్వారా సమస్యలన సేకరించి తయారు చేసిన గణిత పథం-భవిత రథం ఒక కొత్త భావనకు ప్రతీకగా అభివర్ణించారు. డాక్టర్ అడ్లూరి తన పుస్తకాన్ని పెరటి మల్లారెడ్డికి అంకితం ఇచ్చారు.

డాక్టర్ నరసింహమూర్తి మాట్లాడుతూ.. గణిత అవధానాలను నిర్వహించడంతో పాటు గణితంపై 15 పుస్తకాలను రాశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీవీ జూనియర్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ వేముగంటి వెంకటేశ్వరరావు, అబ్దుల్ కలాం ఫౌండేషన్ (ఏకేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు దేవునూరి ఆనంద్, ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి, ఎల్బీ కాలేజీ కిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బిల్ల మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రంధకర్త డాక్టర్ అడ్లూరు నరసింహమూర్తిని శాలువలతో ఘనంగా సత్కరించారు.

రైతులు బ్యాంకుల నుంచి మాత్రమే రుణాలు తీసుకోవాలి

హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే

వరంగల్ లీగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి రైతులు వ్యవసాయ రుణాలు తీసుకోవడంవల్ల తక్కువ వడ్డీ రేట్లతో మేలు జరుగుతోందని హనుమకొండ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, జడ్జి క్షమా దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవా సంస్థ సమావేశ మందిరంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలు, హనుమకొండ జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతుల రుణ మార్పిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ.. ప్రైవేటు వ్యక్తుల సంస్థల నుంచి తీసుకున్న రుణ భారం తగ్గాలంటే బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు తీసుకొని లబ్ధిపొందాలని సూచించారు. రైతులు తమ ప్రైవేటు అప్పుల గురించి బ్యాంకులకు సమాచారం ఇవ్వాలని తద్వారా వారి ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు ఇస్తారని వరంగల్ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్ అన్నారు. దీంతో పాత ప్రైవేటు అప్పులను పూర్తిగా చెల్లించే అవకాశం లభిస్తుందని, బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పును తక్కువ వడ్డీతో సులభ వాయిదాల్లో చెల్లించడానికి అవకా శం కల్పిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, బ్యాంకులు ప్రవేశపెట్టిన డెబిట్ స్వాపింగ్ స్కీమ్‌ను ఉపయోగించుకో వాలని న్యాయమూర్తులు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, హనుమకొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం. శ్రీనివాస్, బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అదరగొట్టిన ఇంజనీరింగ్ స్టూడెంట్స్

- కేయూలో ఘనంగా రూబీ జెస్టు-25 వేడుకలు
- జాతీయ సమైక్యతను చాటే ఈవెంట్ల ప్రదర్శన
- హోరెత్తించిన డ్యాన్స్‌లు.. ర్యాంప్ వాక్ హొయలు..


సంప్రదాయ దుస్తులతో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

కేయూ క్యాంపస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులు టెక్నికల్ ఈవెంట్లతో ఆదరగొట్టారు. రెండు రోజులుగా కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న రూబీజెస్టు-2025 వేడుకల్లో భాగంగా శుక్రవారం కేయూ ఆడిటోరియంలో సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఇతర ప్రాంతాల సంప్రదాయ దుస్తులు ధరించి తమ ప్రత్యేకతను చాటారు. జాతీయ సమైక్యతను చాటే ఈవెంట్లు, సంప్రదాయ దుస్తుల జిగేళ్లు, హోరెత్తించే డ్యాన్స్‌లు, ర్యాంప్‌వాక్ హొయలతో కళాశాల కళకళలాడింది. థీమ్‌డే వేడుకల్లో భాగంగా కేరళ సంప్రదాయ దుస్తులు, సోలో, గ్రూప్ సాంగ్స్, డ్యాన్స్‌లతో అధ్యాపకులు, విద్యార్థులు హోరెత్తించారు. జాతీయంగా వివిధ ప్రాంతాల సంప్రదాయ నృత్యాలతో భిన్నత్వంలో ఏకత్వ భావాలను నింపారు. జాతీయ సమైక్యతను హృదయాల్లో ప్రతిష్ఠింపచేశారు. లక్కీ డ్రాప్స్‌లో ఎంపికైన విద్యార్థులకు బహుమతులను పంచి హుషారును నింపారు. ర్యాంప్ వ్యాక్‌లో ఈసీఈ ఫైనల్ ఫస్ట్‌ఇయర్ స్టూడెంట్ ఆర్.సుదీప్తి మిస్‌గా ప్రతిభ చూపి గెలుపొందారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కిరీటంతో పాటు బహుమతిని ఇచ్చారు.

రూబీజెస్టు వేడుకల కోఆర్డినేటర్లుగా ఎపీక్లారా సాత్విక, జాహ్నవి, హరిప్రియలతో పాటు కన్వీనర్‌గా కె.సాయితరుణ్, కళాశాల అధ్యాపకులు ఎస్.వీణ, స్వప్న, వెంకటేశ్, సురేం దర్, బొల్లం కిరణ్ కుమార్, యశస్విని, సాహితీ, దీప్తి, శ్రీజ, రచన, వైష్ణవి, జి.కిషన్, ఎ.శ్రీనివాస్, రమజ్యోతి, శ్రీవిద్య, మమత, డాక్టర్ ఎస్.జ్యోత్స్న, అనూష, రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, దేవేందర్, కళాశాల సూపరింటెండెంట్ బి.వీరునాయక్, మల్లేశ్, జగన్, సంజయ్, యాదగిరి, ఫిరోజ్, సుమన్, లావణ్య, చైతన్య, జ్యోతి, తిరుమల్‌సింగ్, నాగరాజు, తాజోద్దీన్ బాబా, మమత, సుజాత, ప్రమీల పాల్గొన్నారు.


ర్యాంప్ వాక్ చేస్తున్న కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7025	5800
మక్కలు (బిల్టీ రకం)	2121	2100
కందులు	6789	5540
పెసళ్లు	7703	4645
పల్లికాయ (సూక)	7700	6500
పల్లికాయ (పచ్చిది)	4250	3400
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13200	9000
వండర్‌హాట్	14800	11500
యూఎస్341	12800	9500
దీపిక	15800	15245
దేశీ	27500	25500
సింగిల్ పట్టి	30000	28000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ముందుంది.. నీటి ముప్పు!

రోజురోజుకు అడుగంటుతున్న భూగర్భ జలం

- విచ్చలవిడి వాడకం, యథేచ్ఛగా బోర్ల తవ్వకంతో జటిలం
- కానరాని ఇంకుడు గుంతలు
- పట్టించుకోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు

నేడు ప్రపంచ జల దినోత్సవం



హనుమకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మానవాళి మనుగడలో నీటి అవసరత ఎంతో తెలిసిందే. ప్రపంచ ప్రపంచవ్యాప్తంగా 2.50బిలియన్ల మంది ప్రజలు తమ ప్రాథమిక రోజువారీ నీటి అవసరాలను తీర్చుకునేందుకు పూర్తిగా భూగర్భ జల వనరులపై ఆధారపడుతున్నారు. మనిషి జీవితంలో ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఈ భూగర్భ జలాల పరిరక్షణ విషయంలో ప్రజలు, ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడుతుండడం వల్ల సమస్య రోజురోజుకు జటిలమవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గతంలో భూగర్భ జలాలు అతి తక్కువ లోతులోనే లభ్యమయ్యేవి. ప్రస్తుతం అత్యధికంగా భూగర్భ జలాలను వాడుకోవడం వల్ల దిగజారుతున్నాయి. ఇవి ప్రమాద స్థాయికి పడిపోక ముందే వాటి స్థాయిలను పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఇంకుడు గుంతల ద్వారా వృథా నీటిని ఒడిసిపట్టకపోతే ముందుంది ప్రమాద ఘంటికలు తప్పవన్న హెచ్చరిస్తున్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నీటి వినియోగం, భూగర్భ జల నీటి మట్టాల పరిస్థితిపై కథనం.

ఇంకుడుగుంతల జాడేది ?

వరంగల్ నగర పాలక సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీల పరిధిలో భూగర్భ జలాలు అడుగంటే పలు కాలనీల్లో గుంతలు, వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టాలి. కానీ ఇక్కడ పట్టించుకునేవారే కరువయ్యారు. కార్పొరేషన్ పరిధిలో అప్పట్లో 200 అడుగు లోతుల్లోనే పుష్కలంగా నీరు ఉండేది. ప్రస్తుతం వెయ్యి అడుగుల లోతున తవ్వితే కానీ బోర్లలో నీటి చుక్క జాడ కనిపించడం లేదు. ప్రతి ఇంట్లో నిత్యావసరాలకు ఉపయోగించే నీటికంటే వృథాగా పోయే నీరే ఎక్కువ. వృథాగా పోయే నీటిని ఒక చోటికి చేర్చితే భవిష్యత్ తరాలకు నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. వ్యక్తిగతంగానే కాకుండా ప్రతీ ఒక్కరూ సామాజిక పరంగా ప్రజల్లో అవగాహన చేపట్టి భారీ ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టగలిగే ప్రయత్నం చేస్తే సరైన ప్రతిఫలం పొందగలుగుతామని జల నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నీటి సంరక్షణకు చర్యలు

నీటి సంరక్షణకు చర్యలు తీసుకున్నప్పుడే మానవాళి మనుగడ. లేకుంటే నీటి కొరత ఏర్పడి తాగు, సాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ప్రధానంగా భూగర్భ జల మట్టాలు పడిపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. భూగర్భ జలవనరులను పెంచడానికి, వాన నాటిని సంరక్షించడానికి ఇంకుడు గుంతలు, చెక్ డ్యాములు, రీచార్జి స్ట్రక్చర్స్ కట్టాలి. వాటర్ రీచార్జి స్ట్రక్చర్లు, సోపిట్లు విస్తృతంగా నిర్మించాలి. కృత్రిమ వనరుల ద్వారా వచ్చిన నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపునకు చర్యలు తీసుకోవాలి. బండలు ఉన్న ప్రాంతాల్లో నీరు భూమిలోకి ఇంకనప్పుడు అలాంటి చోట్ల చెక్ డ్యాంలను నిర్మించడం ఒక్కటో ప్రత్యామ్నాయం. భూగర్భ జలాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ద్వారా మ్యాపింగ్ చేయాలి. వాల్టా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి. కొత్తగా చేపట్టిన లే ఔట్లలో 10 శాతం గ్రీనరీ, సోపిట్స్ లేకుండా అనుమతులు ఇవ్వరాదు. కొత్తగా కట్టే ఇళ్లకు సోపిట్స్ ఉంటేనే అనుమతులు ఇవ్వాలి. వాన నీటిని ఒడిసిపట్టేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.



హనుమకొండ జిల్లాలో...

హనుమకొండ జిల్లాలో భూగర్భ జలాలు కాస్త తక్కువ స్థాయిలో పడిపోయాయి. గతేడాది ఫిబ్రవరిలో ఉన్న భూగర్భజల మట్టాలతో పోల్చితే ఈ ఏడాది ఫిబ్రవరిలో సగటున 0.09 మీటర్ల లోతుకు, అలాగే పరకాల డివిజన్ పరిధిలో 0.85 మీటర్ల లోతుకు పడిపోయాయి. భీమదేవరపల్లి మండలంలో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. ఈ మండలంలో ఇప్పటికే 2.81 మీటర్లు పడిపోయాయి. ధర్మసాగర్ మండలంలో 0.92 మీటర్లు, ఎల్కతుర్తి మండలంలో 0.89 మీటర్లు, హనుమకొండ మండలంలో 0.91 మీటర్లు, కమలాపూర్ మండలంలో 2.12 మీటర్ల లోతుకు, వేలేరులో 0.42 మీటర్లు, ఐనవోలు 2.02 మీటర్ల లోతుకు పడిపోయాయి. రానున్న రోజుల్లో ఈ నీటి మట్టాలు మరింత లోతుకు వెళ్లే అవకాశాలున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఒక్క హసన్‌పర్తి మండలంలో మాత్రం ఇందుకు భిన్నంగా నీటి మట్టాలు 0.79మీటర్లు పెరిగాయి. ఇందుకు కారణం ఈ మండలంలో పెద్ద చెరువు ఉండడం వల్ల భూగర్భ జలాలు స్థిరంగా ఉన్నాయి. భద్రకాళి చెరువును ఖాళీ చేయడంతో దాని ప్రభావంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు 0.92 మీటర్ల మేరకు తగ్గినట్టు తేలింది. ఇంతకు ముందు ఈ ప్రాంతాల్లో ఎంత ఎండలు కొట్టిన భూగర్భ జలమట్టాలు స్థిరంగా ఉండేవి. ఉమ్మడి జిల్లాలోని పెద్ద చెరువులున్న ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు స్థిరంగా ఉంటున్నాయి. ఈ చెరువుల నీటిని ఇష్టారాజ్యంగా వాడడం వల్ల అవి ఖాళీ అయి దాని ప్రభావం భూగర్భ జలమట్టాలపై పడుతోంది.

సేఫ్‌జోన్లు

భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయిలో పడిపోతుండడంతో వాటిని సేఫ్ జోన్లుగా, సెమిక్రిటికల్, క్రిటికల్, ఓవర్ ఎక్స్‌ప్లాయిడ్ జోన్లుగా విభజించారు. మహబూబాబాద్‌లో 15 సేఫ్ జోన్లు, ఒకటి సెమి క్రిటికల్ జోన్లు ఉండగా, హనుమకొండ జిల్లాలో 10 సేఫ్ జోన్లు, 4 సెమి క్రిటికల్ జోన్లు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 13 సేఫ్ జోన్లు , జనగామలో 11 సేఫ్, ఒక సెమీ క్రిటికల్ జోన్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 11 సేఫ్ , ఒక సెమీ క్రిటికల్, ములుగు జిల్లాలో 9 సేఫ్ జోన్లు ఉన్నాయి. భూగర్భ జలాలను అతిగా వాడుకుంటున్న ప్రాంతాలు లేవు.

ఫిజియోమీటర్ల సంఖ్య పెంచాలి

ఉమ్మడి జిల్లాలో భూగర్భజల మట్టాలను కొలిచే పీజియోమీటర్లు చాలినన్ని లేవు. పెరుగుతున్న జనాభ, పట్టణ విస్తరణను దృష్టిలోపెట్టుకొని వీటి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తు తం మహబూబాబాద్‌లో 65, ములుగులో 50, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 46, వరంగల్‌లో 31, హనుమకొండలో 22 జనగామలో 37 ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..!

ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించాలనే నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా రు. వర్షపు నీరు వచ్చే దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలు, పార్క్ స్థలాల్లో ఇంకుడుగుం త నిర్మాణం చేపట్టేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నగరంలో, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ప్రధానంగా గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్లు, విల్లాల నిర్మాణా లు జోరుగా సాగుతున్నాయి. చాలా మంది బిల్డర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. నిర్మాణ సమయంలోనే ఇంకుడుగుంత నిర్మించాలనే నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు సగటున ఒకటి నుంచి ఒకటిన్నర మీటర్ల మేర పడిపోయాయి. ఇప్పుడే ఇవి ఇంతగా దిగజారితే ఏప్రిల్, మే, జూన్‌నెలలో మరింతెగా పడిపోతాయోననే ఆందోళన కలుగుతోంది. హనుమకొండ జిల్లా పరిధిలో భూగర్భ జల నీటి మట్టాలు కాస్త తక్కువ స్థాయిలోనే పడిపోగా వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఆందోళన కర స్థాయిలో పతనమవుతున్నాయి.

ట్రాలీలో ప్రయాణాలు గాలిలో ప్రాణాలు..

సరుకులు తరలించే వాహనాల్లో ప్రజల ప్రయాణం

కూలి పనుల కోసం మనుషుల చేరవేత

- నిబంధనలను పట్టించుకోని వాహన యజమానులు
- ప్రజలే స్వీయ జాగ్రత్త పాటించాలంటున్న ఆర్‌టీఏ అధికారులు
- ఓవర్‌లోడ్‌తో అదుపుతప్పి ప్రమాదాలు



వాజేడులో మహిళా కూలీలతో వెళ్తున్న వాహనం

వరంగల్ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పది మంది కలిసి ప్రయాణం చేయాలనుకుంటే చాలు.. గ్రామాల్లో అందుబాటులో ఉండే గూడ్స్ వాహనాలను కిరాయి తీసుకొని వెళుతున్నారు. సరుకులను తరలించే వాహనాల్లో పరిమితికి మించిన లోడ్‌తో మనుషులు వెళ్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. గూడ్స్ వాహనాల్లో మనుషులను తరలించొద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ వాహన యాజమానులు, డ్రైవర్లు ఖాతరు చేయకుండా సరుకుల మూటల లెక్క ఒకరి మీద ఒకరిని కుక్కి ఎక్కించి నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారు. ఫలితంగా ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ప్రమాదం నుంచి బతికి బయటపడ్డోళ్లు జీవితాంతం అంగవైకల్యంతో బాధపడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. వాహన యాజమానులు కేసుల పాలవుతున్నారు. అంతిమంగా గూడ్స్ వాహనాల్లో ప్రయాణించే వారితోపాటు వాహన యాజమానులు జీవితాలు ఛిన్నాభిన్నమై రోడ్డున పడుతున్నాయి.

వ్యవసాయ కూలీలు

గ్రామాల్లో వ్యవసాయ పనుల కోసం కూలీల కొరత ఉంటుండటంతో ఆయా పనుల కోసం రైతులు ఇతర ప్రాంతాల్లో ఉన్న కూలీలపై ఆధారపడుతున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో కూలీలను తరలించడానికి ట్రాలీ ఆటోలను కిరాయికి మాట్లాడుకుంటున్నారు. ట్రాలీ యాజమానులు సైతం కూలీలను ఎక్కువ సంఖ్యలో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఓవర్ లోడ్‌తో వాహనం అదుపుతప్పుతూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కూలీలు ఒక్కరే కాకుండా శుభకార్యాలకు, జాతరలకు వెళ్లే క్రమంలో సైతం ట్రాలీఆటోలు, ట్రాక్టర్‌లను ప్రజలు ఆశ్రయించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

కనిపించని తనిఖీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాకు కలిపి ఒకే ఒక్క ఆర్‌టీవో ఉన్నప్పుడైనా రోడ్లపై ఆర్‌టీఏ అధికారులు తనిఖీలు కనిపించేది. పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలు ఏర్పాటుచేసి జిల్లాకో అధికారిని నియమించినప్పటికీ తనిఖీల ఊసే లేకుండా పోయింది. వరుస ఘటనలు జరిగినప్పుడైనా మెరుపు దాడులతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించేదని, ఇప్పుడు అలాంటి తనిఖీలు కూడా ఉండటం లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. కేవలం ఉన్నతాధికారులు ఇచ్చే టార్గెట్ ప్రకారం రోజుకు ఒకటి రెండు కేసులు నమోదు చేసి కార్యాలయాలకు మాత్రమే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాల నివారణపై ఎలాంటి అవగాహన కార్యక్రమాలు సైతం వాహనదారులు, ప్రజలకు కల్పించడం లేదనే అపవాదు ఆర్‌టీఏ అధికారులపై ఉంది.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- జనవరి 27న హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మునిపల్లి గ్రామంకు చెందిన 22మంది కూలీలు ట్రాలీ ఆటోలో కమలాపూర్ మండలం వంగపల్లికి వ్యవయసాయ పనుల కోసం వెళ్లారు. తిరిగి సాయంత్రం వస్తున్న క్రమంలో గూడూరు-అంబాల మధ్య ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును వేగం ఢీకొట్టింది. ఈ ఘటనలో హుస్సేన్‌బీ (50) మృతిచెందగా, 16 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.
- మార్చి 6న వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కోనాపురం శివారులో జరిగిన ప్రమాదంలో టాటా ఏసీ వాహనంలో ప్రయాణిస్తున్న జీడిగడ్డ తండాకు చెందిన 31 మంది మహిళలు, 6 పురుషులు కలిపి మొత్తం 37 మంది వ్యవసాయ కూలీల్లో బానోతు సుక్క (55) మరణించగా, ఎంజీఎంలో చికిత్స పొందుతూ బానోతు ఈర్యా (52) మృతి చెందాడు. సుమారు 20పైగా మంది కూలీలు గాయపడ్డారు.
- మార్చి 8న ఏటూరునాగారం మండలం రాంనగర్ వద్ద కూలీలను తరలిస్తున్న గూడ్స్ వాహనం బోల్తాపడి 15 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.
- మార్చి 12న హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన 30మంది వ్యవసాయ మహిళా కూలీలు మిరపకాయలు తెంపేందుకు పరకాల మండలంలోని మల్లక్కపేటకు వస్తుండగా నడికూడ శివారులో ట్రాలీ బోల్తాపడి కూలీలు తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు.
- మార్చి 21 శుక్రవారం తొర్రూరు మండలంలోని ఫత్తేపురం, చర్లపాలెం గ్రామాలకు చెందిన 17మంది మహిళా కూలీలు మరిపెడ మండలంలో వ్యవసాయ పనులకు వెళ్తుండగా లారీ ఢీకొనడంతో చర్లపాలెంకు చెందిన అరుణ (40) మృతిచెందగా, మిగతా కూలీలు గాయపడ్డారు.



చెన్నారావుపేట మండలం కోనాపురంలో వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో గాయపడిన కూలీలు (ఫైల్)

గూడ్స్ వాహనాల్లో ప్రయాణించొద్దు..

గూడ్స్ వాహనాల్లో ప్రజలు ప్రయాణాలు చేయొద్దు. గూడ్స్ వాహనాలు సరుకులు తరలించేలా నిర్మాణం చేస్తారు కనుక మనుషులు కూర్చునేందుకు ఇబ్బందిగా ఉంటుంది. గూడ్స్ వాహనాల్లో ప్యాసింజర్స్‌ను తరలించడం నిబంధనలకు విరుద్ధం. అలాంటి వాహనాలు సీజ్‌చేసి జరిమానా విధిస్తున్నాం. రోడ్లపై తనిఖీలు చేస్తున్న సమయంలో గంటల కొద్దీ వేచి చూస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కూలీలను చూసి మానవతా దృక్పథంతో చూసీచూడనట్లుగా వదిలేయాల్సి వస్తోంది. ప్రజలే స్వీయ జాగ్రత్తలు పాటిస్తూ గూడ్స్ వాహనాలకు దూరంగా ఉండాలి.

- వేణుగోపాల్, రవాణా శాఖ హనుమకొండ జిల్లా అధికారి

'బంగినపల్లి'కి రికార్డు ధర

- లక్ష్మీపురం మార్కెట్‌లో క్వింటా రూ.10,200
- హర్షం వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు



మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద సమక్షంలో వేలం పాడుతున్న దృశ్యం (ఫైల్)



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మామిడికాయలు

వరంగల్ వ్యవసాయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బంగినపల్లి మామిడి భలే ధర పలుకుతోంది. వరంగల్ లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌కు నాలుగు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రైతులు కాయల ను అమ్మకానికి తెస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు రెండు నుంచి ఐదు టన్నుల వరకు పంట వస్తుండగా.. సీజన్ ప్రారంభ దశ కావడంతో ధరలు మా త్రం అంచనాకు మించి పలుకుతు న్నాయి. ఈ మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గురువారం బంగినపల్లి మామిడికాయ టన్నుకు రూ.లక్షా 22వేలు పలికింది. అంటే కిలో మామిడికాయలకు రూ.122 అన్నమాట. ఇది ఈ మార్కెట్ చరిత్రలోనే రికార్డు ధర. గత సోమవారం సీజన్ ప్రారంభం మొదటి రోజు క్వింటా ధర రూ.10500 పలికింది. బుధవారం నాడు టన్ను రూ.70వేలు, శుక్రవారం లక్షా రెండు వేల రూపాయలు పలికింది.

సీజన్ ప్రారంభంలో అధిక ధరలే...

మామిడి సీజన్ ప్రారంభ దశలో ఉన్నప్పుడు అధిక ధరలు ఉండడం మామూలే. కానీ మరీ టన్నుకు లక్షా 22వేల ధర పలకడం రికార్డే. ముందు వందల టన్నుల పంట వస్తే ధరలు అమాంతం పడిపోతాయి. వరంగల్ జిల్లాలో 6500 ఎకరాలు, హనుమకొండ జిల్లాలో 5500 ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. అయితే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పంట దిగుబడి తక్కువగా ఉన్నట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూత, పిందె దశలో పురుగు ఆశించి పంట నష్టం ఎక్కువగా జరిగినట్టు చెబుతున్నారు. మరి కొద్ది రోజులు పోతే కానీ ఎకరానికి ఎంత దిగుబడి వస్తుందనేది అంచనా వేయలేమని అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పలికే ధరలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం మామిడి సీజన్‌లో మొత్తం లక్షా 30 వేల క్వింటాళ్ల మామిడికాయలు అమ్మకానికి రాగా మార్కెట్‌కు ఫీజు రూపంలో రూ.40లక్షల ఆదాయం వచ్చింది.

సొమ్ములిస్తే చాలు!

5వ పేజీ తరువాయి

గండి పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక లింకు పేపర్లు లేకపోతే డాక్యుమెంట్‌కు అదనంగా రూ.5వేల నుంచి రూ.20వేల వరకు ఇచ్చుకోవాల్సిందేనట. వీటితో పాటు వివాదస్పద భూములు, కోర్టు కేసుల్లో ఉన్న భూములు, అసైన్డ్, ప్రభుత్వం భూములయితే ఏరియాను బట్టి రూ.20వేల నుంచి రూ.2లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంచర్ల ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు వస్తే గజానికి రూ.200 వరకు వసూలు చేస్తున్నారట. ఇలా ఎవరు ఎంత ఎక్కువ చెల్లిస్తే వారి రిజిస్ట్రేషన్ చకాచకా చేసేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.


రైటర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ద్వారా వసూళ్లు..

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఉన్న కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు డాక్యుమెంట్ రైటర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ప్రైవేట్ సిబ్బంది దళారులుగా అవతారమెత్తి వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. డాక్యుమెంట్ రైటర్లు పత్రాల తయారీ ఖర్చులతో పాటు సబ్‌రిజిస్ట్రార్లకు ఇవ్వాల్సిన మాముళ్ల లెక్క కూడా ఈ డాక్యుమెంట్ రైటర్ ఆఫీసుల్లోనే కుదురుతుందనే ఆరోపణలున్నాయి. డాక్యుమెంట్ రైటర్లు నేరుగా సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాల్లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసే వరకు అన్ని దగ్గరుండి చూసుకుంటున్నారనే చర్చ ఉంది. గతేడాది ఏడాది జూలై 26వ తేదీన హనుమకొండ జిల్లా పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునిత 1,173గజాల భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు డాక్యుమెంట్ రైటర్ నరేష్ ద్వారా రూ.80వేల తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్‌లకు, డాక్యుమెంట్ రైటర్లకు మధ్య వసూళ్ల బాగోతం బయట పడింది. ఇక వీరితో పాటు ఔట్‌సోర్సింగ్ ద్వారా తమ వారిని కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఆఫీసు బాయ్‌లుగా, స్వీపర్లుగా కార్యాలయాల్లో పెట్టుకుని కొందరు ఎస్‌ఆర్‌వోలు వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగతోంది. గతేడాది మార్చి 22న మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా 128గజాల ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వెంకటేశ్ ద్వారా రూ.19,200లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. వీటితో పాటు ఎలాంటి లెక్కలు లేని రూ.1.72లక్షల కూడా ఏసీబీ అధికారులకు లభించాయి. ప్రైవేటు వ్యక్తులను కార్యాలయాల్లో దళారులుగా నియమిస్తూ వసూళ్లకు పాల్పడుతున్న ఉదంతాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. గురువారం జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణ ఇంటి రిజిస్ట్రేషన్ కోసం రూ.18వేల డిమాండ్ చేసి, తన ప్రైవేట్ అసిస్టెంట్ రమేష్ ద్వారా లంచం తీసుకుంటు ఏసీబీకి పట్టుబడ్డారు. ఇలా సబ్‌రిజిస్ట్రార్లు తమకు అనుకూలంగా ఉన్న ప్రైవేటు వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా మాముళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూర్చుతున్నాయి.

పట్టుబడుతున్నా.. పట్టింపులేదు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉంది. వీటిలో ప్రతి రోజు వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఏడాది కాలంగా 12 మంది సబ్‌రిజిస్ట్రార్లలో ముగ్గురు ఏసీబీ అధికారులకు పట్టుబడటం రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి ఏమేరకు జరుగుతుందో తెలియ జెబుతోంది. గతేడాది మార్చి 22న మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, జూలై 26వ తేదీన పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునిత, ఈ నెల 20వ తేదీన స్టేషన్ ఘనపూర్ సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణ అవినీతి నిరోధకశాఖ అధికారులు పట్టుబడ్డారు. అయినా కొంతమంది సబ్‌రిజిస్ట్రార్లలో మార్పు రావటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జీతం కంటే గీతంపైనే ఎక్కువ మంది ఆధారపడుతున్నారని, మాముళ్లను మాములుగానే తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవినీతికి ఆనవాళ్లుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిలుస్తున్నాయని, ఏసీబీ అధికారులు మరింత నజర్ వేసి అక్రమార్కుల ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక స్థైర్యం : ప్రొఫెసర్ వల్లూరి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రిన్సిపాల్ మనోహర్

కేయూ క్యాంపస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులతో మానసిక స్థైర్యం, వికాసం పెరుగుతోందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. శుక్రవారం కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నేతృత్వంలో క్యాంపస్ కళాశాల పీజీ స్టూడెంట్స్‌కు టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల పీడీ డాక్టర్ పి. కుమారస్వామి నేతృత్వంలో జరిగిన ఈ క్రీడలను రామచంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, పీడీ కుమారస్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే కేయూ క్రీడామైదానంలో శనివారం జరిగే క్రికెట్ ఫైనల్ పోటీల్లో రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల జట్లు తలపడనున్నాయి. 24 నుంచి ట్రాక్ అండ్ ఫీల్డు అథ్లెటిక్స్ క్రీడాంశాలల్లో పోటీలు జరగనున్నట్టు కేయూ ఫిజికల్ డైరెక్టర్ శేషాల కుమార్ తెలిపారు.

డంపింగ్ యార్డును తరిమేద్దాం..



మడికొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజలు

మడికొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మడికొండ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించాల్సిందేనని బాధిత ప్రజలు పోరుబాట పట్టారు. సమస్య తీవ్రతను దఫదఫాలుగా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా స్థానిక ప్రజల్లో పూర్తిస్థాయిలో ఇంటింటికీ అవగాహన కల్పిస్తూ చైతన్య పరచాలని భావించారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులు, మేధావులు ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను మడికొండ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్వచ్ఛందంగా కరపత్రాలు, వాల్‌పోస్టర్స్ అందజేసిన రిటైర్డ్ ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టుస్వామి, బైరి సాంబరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడ్‌హాక్ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కులగణన సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కులగణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.కుమార్, సుజన్‌ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్వో విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. వరంగల్ జిల్లా పరిధిలో కులగణనలో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ పారితోషికాన్ని వెంటనే అందజేయాలన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు లేవని, వారికి వెంటనే చెల్లించాలన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

హసన్‌పర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల జయగిరి రోడ్ హసన్‌పర్తిలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అవసరమైన విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. శుక్రవారం విద్యార్థులకు కంటి అద్దాలను ఆయన పంపిణీ చేసి కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సుధాకృష్ణ, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి, ఆప్తాల్మిక్ అధికారి మల్లారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ జి.మంజుల, ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్టు ఎస్.మాధురి, ఏఎన్‌ఎం సీహెచ్.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం లష్కర్‌సింగారంలో మందకృష్ణ చిత్రపటానికిని క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ విజయం మాదిగ అమరవీరులతో పాటు మాదిగ జాతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మందకృష్ణకు చెందుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొక్క రాజేశ్, ఎర్ర వరదరాజు, రాము, అల్వాల ఎల్లేశ్, సుదర్శన్, అశోక్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పారి జీవితం ఉపాధ్యాయులకు ఆదర్శం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి జీవితం ఉపాధ్యాయులకు ఆదర్శమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ అన్నారు. అప్పారి 24వ వర్ధంతిని పురస్కరించుకొని హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకం చేసి సమస్యల పరిష్కారం కోసం అప్పారి నిరంతరం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవీందర్ రాజు, రాజు, కుమార్, సుజన్‌ప్రసాద్‌రావు, రాజారాం, మల్లిక్, కర్ణాకర్, వెంకటేశ్వర్‌రావు, కిషోర్, రమేష్, నర్సింహారావు, రవీందర్, సదానందం, శ్రీనివాస్, భాస్కర్‌రావు, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

వడ్డెపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం ద్వారా ఆమోదించాలని, దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీ లెక్కలు తేల్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే బీసీల మహాధర్నాకు వేలాదిగా తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి శాసన సభలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, రాష్ట్ర, జిల్లా నాయకులు కాసగాని అశోక్‌గౌడ్, అరగంటి నాగరాజు, మాదం పద్మజాదేవి, తమ్మల శోభారాణి, మాడిశెట్టి అరుంధతి, సులోచన, ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం బోర్డులో స్థానం కల్పించాలి

వడ్డెపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం బోర్డులో విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మలకు స్థానం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మధన్‌మోహన్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ప్రైవేటు సమావేశ మందిరంలో నిర్వహించిన తెలంగాణరాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం సభలో ఆయన మాట్లాడారు. వైదిక ఆగమ శిల్ప శాస్త్రంలో, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ పంచదాయి శిల్పులలో శ్రేష్టులైన, నిష్ణాతులైన వారిని లక్ష్మీనర్సింహ స్వామి బోర్డులో నియమించి సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు. సభలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణచారి, రాష్ట్ర కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్రీడా మైదానంలో విద్యార్థుల సందడి

కేయూ క్యాంపస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ క్రీడామైదానంలో శుక్రవారం రాత్రి కోఆర్డినేటర్ కమిటీ కన్వీనర్ కందికట్ల విజయ్ నేతృత్వంలో వాగ్గేయకారులు ఎర్రన్న, అనితయాదవ్‌లు ఆడిపాడారు. రాజనీతిశాస్త్ర విభాగం జాతీయ సదస్సును పురస్కరించుకుని సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారుల ఆటపాటలకు విద్యార్థులు గ్రౌండ్‌లో ఉర్రూతలూగారు. తెలంగాణ సాహిత్యం, సాంస్కృతిక విషయాంశాలతో పాటు సామాజిక సందేహాలను ప్రబోధిస్తూ పాటలు పాడారు. రాజనీతిశాస్త్ర విభాగాధిపతి సంకినేని వెంకట్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం హాజరయ్యారు.

బీసీలకు రాజ్యాధికార స్థాపనే లక్ష్యం

వడ్డెపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ, ఎస్సీ ఎస్టీలకు రాజ్యాధికార స్థాపనే తమ పార్టీ లక్ష్యమని ధర్మ సమాజ్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మేకల సుమన్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఏప్రిల్ 14న ఆదిలాబాద్‌లో చేపట్టే మా భూమి లక్ష కిలోమీటర్ల రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు సాయిబాబా, చుక్క రత్నాకర్, మైదం రవీందర్, బోకూరి రాజు, కొట్టె ఏసోబు, ఎర్ర ప్రసాద్, బొల్లె క్రాంతిరాజ్, ఎల్లస్వామి, పూరెళ్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించండి

▸▸ మేయర్ గుండు సుధారాణి



ఆరెపల్లి వ్యవసాయ క్షేత్రంలో స్థలాన్ని పరిశీలిస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) ఏర్పాటులో భాగంగా సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన చేయాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. ఎస్టీపీల ఏర్పాటు కోసం శుక్రవారం నగర పరిధిలోని ఆరెపల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రం, బొల్లికుంట ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను మేయర్ అధికారులతో కలిసిన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని ఎస్టీపీల కోసం స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సిటీప్లానర్ రవీంద్ర రాడేకర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు మహేందర్, శ్రీనివాస్, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి, కన్సల్టెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

వరంగల్ నగర ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం కలిగిస్తే సహించేది లేదని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని మేయర్ గుండు సుధారాణి హెచ్చరించారు. శుక్రవారం వరంగల్ ఉర్సు, కరీమాబాద్ ప్రాంతంలోని వ్యాటర్ ట్యాంక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. నీటి సరఫరాలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని అన్నారు. నీటి ఎద్దడి ఉండే కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని చెప్పారు. ప్రజలకు నీటి సమస్య ఏర్పడితే డీఈలు, ఏఈలదే బాధ్యత అని అన్నారు. ఈ తనిఖీలలో మేయర్ వెంట ఏఈ ముజామిల్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయాలి

వడ్డెపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరూ ప్రైవేటు అప్పులు తీర్చుకోవడానికి పట్టా పాస్‌పుస్తకాల ద్వారా రుణాలను మంజూరు చేయాలని కోరారు. బ్యాంకులు దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తే ప్రైవేటు బ్యాంకులను రైతులు ఆశ్రయించరని తెలిపారు.

ఈ సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హిందే భాస్కర్, తిరుపతి, రాజు, బాపురావు, తోకల ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్‌పై అవగాహన కల్పించండి

▸▸ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024 అవార్డు కోసం ఫీడ్ బ్యాక్ అందించేలా మెప్మా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో మెప్మా అధికారులు, సీవోలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్-2024 అవార్డు మన నగరానికి రావాలంటే నగర ప్రజలు సోషల్ మీడియాలో అందించే ఫీడ్ బ్యాక్ అవసరమని అన్నారు. ఇక మెప్మా సిబ్బంది ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించాలని, ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. ఇంకా ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈనెల 31తో ఫీజులో 25 శాతం రాయితీ ఉందని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్‌రావు, టీఎంసీ కంజర్ల రమేష్, సవోలు సఫియా, శ్రీలత, రమేష్, స్వామి, అలీ పాల్గొన్నారు.



మెప్మా అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

▸▸ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, ఈ పవిత్ర మాసంలో ప్రభుత్వం ఇఫ్తార్ విందులకు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట దర్గాలో శుక్రవారం ఇఫ్తార్ విందు జరిగింది. హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గంలో ఏడు ప్రధాన మసీదులలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, దర్గా పీఠాధిపతి కుస్రుపాష, కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్, కార్పొరేటర్ జక్కుల రవిందర్ యాదవ్, నాయకులు అబూబక్కర్ తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరల్డ్ డౌన్ సింద్రోమ్ డే

హనుమకొండటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస మానసిక దివ్యాంగుల కేంద్రంలో వరల్డ్ డౌన్ సింద్రోమ్ డేను శుక్రవారం సంస్థ నిర్వాహకులు బండ రామలీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. యేటా వరల్డ్ డౌన్ సింద్రోమ్ డే మార్చి 21న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమాజంలో మానసిక వికలాంగులను సమానంగా చూడాలని అన్నారు. మానసిక వికలాంగులను చేరదీసి వారి బాగోగులు చూసుకుంటున్న మల్లికాంబ మనోవికాస ఫౌండర్ బండ రామలీలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి డౌన్ సింద్రోమ్ పిల్లలు చేసిన నృత్య ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన పిల్లలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాడిశెట్టి సందీప్, డాక్టర్ ఎం.అజీద్, మల్లికాంబ సంస్థ నిర్వాహకులు బండ సదానందం, కోడెం కల్యాణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వరల్డ్ డౌన్ సింద్రోమ్ డే కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

మానవ మనుగడకు అడవులను రక్షించుకోవాలి

▸▸ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎస్‌ఎం రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఎస్‌ఎం రెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడ అడవులపై ఆధారపడి ఉందని, అడవులను రక్షించుకోవాలని ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, కేయూ బాటనీ విభాగం ప్రొఫెసర్ ఎస్‌ఎం రెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగళి మహిళా అటానమస్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి, కళాశాల బాటనీ విభాగాధిపతి డాక్టర్ దార సునిత నేతృత్వంలో ప్రపంచ ఆటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఎం రెడ్డి హాజరై కీలక ప్రసంగం చేశారు. అడవులతోనే సమాజం మనుగడ సాధ్యమవుతుందన్నారు. అరుదైన వృక్షజాతులు నశించిపోయాయని చెప్పారు. మొక్కలు మానవ జీవితంలో ప్రధానమన్నారు. అడవులలో అరుదైన వృక్షజాతులు ఔషధాలుగా ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. మొండివ్యాధులకు మొక్కలతో సరైన వైద్యం అందుతుందని చెప్పారు. వరంగల్ ప్రాంతంలోనూ అరుదైన వృక్షజాతులు ఉన్నాయన్నారు. విద్యార్థులు మొక్కలపై అవగాహన పెంచుకుని పరిశోధకులుగా ఎదగాలని చెప్పారు.

ఈ సందర్భంగా మొక్కల ప్రాధాన్యతపై కళాశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సదస్సులో ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ శ్రీలత, ఇతర సభ్యులు ఆర్.జ్యోతిర్మయి విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చింతగట్టులో పశువైద్య శిబిరం

హసన్‌పర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగట్టు మహర్షి గోశాలలో శుక్రవారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. త్రిదండి చిన జీయర్ స్వామి ఆశీస్సులతో గోపూజ నిర్వహించి గోశాలలోని గోవులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి ఉపాధ్యక్షుడు, పశుసంవర్ధక శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ చాడ సుభాష్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాస్, హసన్‌పర్తి పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి, చింతగట్టు వీఎల్‌ఏ బింగి సురేష్, వికాస తరంగిణి సభ్యులు దయాకర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, తిరుమల్, మహర్షిగోశాల నిర్వాహకులు సర్జన రమేష్, వివేక్ సాగర్, యాదగిరి, ఓఎస్ రాహుల్, రైతులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

బాలసముద్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మత్స్య కార్మిక సంఘం(టీఎంకేఎంకేఎస్) 2025 సంవత్సర డైరీని మత్స్యశాఖ జిల్లా అధికారి సల్మాన్ శుక్రవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు అనేక కష్టాలకు ఓర్చి సమాజానికి మంచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం వారికి అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎలాంటి తావులేకుండా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల రవి, మాటూరి సమ్మయ్య, జిల్లా సహాయ కార్యదర్శి నీలం భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎర్త్ అవర్ కార్యక్రమం

వడ్డెపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో శనివారం ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ ఫుల్లూరి వంశీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరవుతారని పేర్కొన్నారు.

బీపీఈఏ హనుమకొండ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

హనుమకొండ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బీఎంఎస్ అనుబంధ సంఘంగా భారతీయ తపాలా ఉద్యోగుల సంఘం (బీపీఈఏ) హనుమకొండ డివిజన్ నూతన కమిటీని శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని హెడ్ పోస్టాఫీసు ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు హెచ్‌వో పోస్టుమాస్టర్ పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పీత్రీ డివిజన్ అధ్యక్షుడిగా ఎం.శంకర్, సెక్రటరీగా ఎ.సత్యనారాయణ, పీఫోర్ అండ్ ఎంటీఎస్ డివిజన్ అధ్యక్షుడిగా పి.మురళీకృష్ణ, పీఫోర్ అండ్ ఎంటీఎస్ డివిజన్ సెక్రటరీగా బత్తుల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు హెచ్‌వో పవన్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజనల్ సూపరింటెండెంట్ వి.హనుమంతును కలిసి నూతన కమిటీ పత్రాన్ని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సర్కిల్ నాయకులు పి.లక్ష్మీనారాయణ, ఎస్‌కే.లాల్‌మియాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ప్రవీణ్‌కుమార్, ఎ.సందీప్, ఆర్.మమత, ఎం.చంద్రశేఖర్, ఆర్.రవికుమార్, కె.సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని రాజాజీనగర్, రంగ్‌బార్ వెనుకాల సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు, శాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షిరోడ్డు, జేఎస్‌ఎం స్కూల్ ఏరియాలో సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

కేయూ బీఈడీ కళాశాలలో విచారణ షురూ..

కేయూ క్యాంపస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ బీఈడీ కళాశాలలో శుక్రవారం విచారణ అధికారులు విచారణ ప్రారంభించారు. బీఈడీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఫిర్యాదులందడంతో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం విచారణ కమిటీని నియమించారు. కమిటీ చైర్మన్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, సభ్యులు ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు, అకడమిక్ డీన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, కమిటీ కన్వీనర్ డాక్టర్ కోలా శంకర్‌లు విచారించారు. బీఈడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్‌తో పాటు, మరో పార్టుటైమ్ అధ్యాపకుడు ఆర్థిక అవకతవకలతో పాటు, కళాశాలలను పరిపాలనను అస్తవ్యస్థంగా మార్చినట్లు గుర్తించారు. టీసీలపై పార్టుటైమ్ అధ్యాపకుడి సంతకాలతో పాటు ఇతర అవకతవకలకు పాల్పడ్డారని కమిటీ గుర్తించినట్లు సమాచారం.

బంగారు గొలుసు చోరీ

కాజీపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో మహిళ మెడలో ఉన్న గొలుసును ఓ దుండగుడు లాక్కెళ్లాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట మయూరిగార్డెన్ సమీపకాలనీలోని దేవాన్ష్ కిరాణం షాపునకు శుక్రవారం ఇద్దరు దుండగులు బైకిపై వచ్చారు. బిస్కెట్ ప్యాకెట్లు కావాలని అడగడంతో షాపు యజమాని(మహిళ) బిస్కెట్ ప్యాకెట్లు ఇచ్చే క్రమంలో మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. మహిళ భయంతో కేకలు వేయగా దుండగులు బైక్‌పై పారిపోయారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ద్వారా ఒక దొంగను పట్టుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించడానికి ఆసక్తి చూపడం లేదు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

హసన్‌పర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఆశాలకు బడ్జెట్ పెంచాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని శుక్రవారం హసన్‌పర్తి పీహెచ్‌ఎసీ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పుల్లా అశోక్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్.రాజేశ్వరి, డి.నవమణి, శోభ, శైలజ, సరిత, రజిత, విజయకుమారి, బొక్క సునిత పాల్గొన్నారు.

24న కేయూలో ఎస్ఎఫ్ఐ మహాసభలు

కేయూ క్యాంపస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న కాకతీయ యూనివర్సిటీ మ్యాథ్స్ విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ కేయూ 52వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం మానవీయశాస్త్ర భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

మహంకాళి దేవాలయ పరిరక్షణకు శ్రీకారం

• కబ్జాలో ఉన్న సిమెంటు రేకుల తొలగింపు

హసన్‌పర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్‌లోని మహంకాళి దేవాలయ పరిరక్షణ కోసం శుక్రవారం గ్రామస్తులంతా కదిలారు. 50 ఏళ్లుగా ఎటువంటి హక్కులు లేకుండా దేవాలయ భూమిని ఉపయోగించుకుంటూ ఆలయాన్ని కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ సమీప ఇంటి యజమానులను గ్రామస్తులు నిలదీశారు. ఆలయ హద్దులు చెరిపేసి కబ్జా చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఇంటి యజమానులకు, గ్రామస్తులకు తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఆలయానికి సంబంధించిన పాత పునాదులను గుర్తించాలని నిర్ణయించారు వెంటనే ఇంటి యజమానులతో పాటు గ్రామస్తులు జేసీబీని రప్పించి పాత పునాదిని గుర్తించారు. ఆలయ స్థలంలో కబ్జా చేసి నిర్మించిన బాత్‌రూమ్‌లను తొలగించాలని గ్రామస్తులు యజమానులకు సూచించారు. రెండు రోజుల గడువు కోరగా, తదుపరి హద్దుల సమస్య పరిష్కారానికి సహకరించాలని గ్రామస్తులు సూచించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ నాయకులు పిట్టల కుమారస్వామి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు అనుమాండ్ల విద్యాసాగర్, దీకొండ భిక్షపతి, రాకేష్; రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



దేవాలయ భూమిని పరిశీలిస్తున్న గ్రామస్థులు



అంతరిక్షంలో సునీత భారతీయత

సునీతా విలియమ్స్... ప్రస్తుతం ప్రపంచమంతా మారుమోగుతున్న పేరు. భారతీయ మూలాలున్న సునీత... తొమ్మిది నెలలు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో పరిశోధనలు చేసి ఇటీవల భూమిపైకి వచ్చారు. అంతరిక్షంలో అతి ఎక్కువ రోజులు ఉన్న వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన సునీతకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు అంటే చాలా ఇష్టం. తనకున్న ఈ ఇష్టాన్ని అంతరిక్ష కేంద్రంలో ఉన్నప్పుడు కూడా ప్రదర్శిస్తూనే వచ్చారు. ఆ సందర్భాలేమిటో చూద్దాం...

సమోసా

అంతరిక్షంలో నివసించే వ్యోమగాములు తమకు నచ్చిన ఆహారాన్ని అంతరిక్షంలోకి పట్టుకువెళ్లవచ్చు. సునీత భారతదేశ ఆహార సంస్కృతికి గుర్తుగా సమోసాను అంతరిక్షంలోకి తీసుకువెళ్లారు. సునీతకు చిన్నప్పటి నుంచి భారతీయ ఆహారమంటే చాలా ఇష్టం. ఈ విషయాన్ని ఆమె అనేకసార్లు ఇంటర్వ్యూలలో కూడా పేర్కొన్నారు. సమోసా కేవలం ఆమెకు ఒక చిరుతిండి మాత్రమే కాదు.. భారత దేశాన్ని ప్రతిరోజూ తలుచుకోవటానికి ఒక అవకాశం కూడా!

దీపావళి



సునీత తండ్రి భారత దేశం నుంచి అమెరికాకు వలస వెళ్లారు. అమెరికాలో కూడా భారతీయ పండుగలు జరుపుకుంటూ ఉండేవారు. అంతరిక్షంలో వ్యోమగాములు తమకు నచ్చిన పండుగ జరుపుకొనే అవకాశముంటుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని సునీత అంతరిక్షంలో దీపావళి జరుపుకున్నారు. "దీపావళి జరుపుకుంటుంటే నాన్న గారు గుర్తుకువస్తున్నారు" అన్న ఆమె మాటలు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అయ్యాయి.

భగవద్గీత



అంతరిక్షానికి సునీత తనతో పాటుగా భగవద్గీత, ఉపనిషత్‌లను తీసుకువెళ్లారు. "నాకు మార్గదర్శకత్వం కావాల్సి వచ్చినప్పుడు.. ఆత్మస్థైర్యం కావాల్సినప్పుడు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అందుకే వీటిని అంతరిక్షంలోకి తీసుకువెళ్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. ఈ పుస్తకాలను తనతో తీసుకువెళ్లటం- భారతీయ సంస్కృతి మూలాలపై ఆమెకు ఉన్న అభిమానాన్ని తెలియజేస్తోంది.

గణేశుడు కూడా...



సునీత తనతో పాటుగా గణేశ విగ్రహాన్ని అంతరిక్షంలోకి తీసుకువెళ్లారు. గతంలో ఇచ్చిన కొన్ని ఇంటర్వ్యూలలో ఆమె తన ఆధ్యాత్మిక జీవితంలో గణేశుడు ఒక ప్రముఖమైన పాత్ర పోషిస్తాడని పేర్కొన్నారు. అంతరిక్షంలోకి ఒక హిందూ దేవుడి విగ్రహాన్ని తీసుకువెళ్లిన వ్యోమగామి సునీతే కావటం విశేషం.

యువతకు స్ఫూర్తిగా...

సునీత చాలాకాలంగా భారతీయ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే ఎంతటి ఎత్తుకైన ఎదగవచ్చనటానికి ఆమె ఒక ఉదాహరణ. ఈ విషయాన్నే ఆమె 2013లో భారత దేశానికి చెందిన కొద్దిమంది పిల్లలతో పంచుకున్నారు. "ఈ ప్రపంచం మీకు ఆహ్వానం పలుకుతోంది. నేనూ మీలాంటిదానినే" అని సునీత ఇచ్చిన సందేశం అనేక మందిలో స్ఫూర్తి రగిలించింది.

అల్లం... అద్భుత ఔషధం

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

అల్లానికి అయిర్వేదంలో ఒక ప్రత్యేక స్థానముంది. దుంపలలో ఎక్కువ రసం ఉన్నది అల్లమే కాబట్టి దీనిని సంస్కృతంలో ఆర్ద్రకం అని పిలుస్తారు. దీని నుంచే హిందీలో అదరక్ అనే పదం పుట్టింది. అల్లం మొక్కను చూస్తే అనేక కొమ్మలు కనిపిస్తాయి. దాని నుంచి వచ్చిన దుంప కాబట్టి అల్లాన్ని శృంగవేర అని పిలుస్తారు. ఇదే విధంగా గ్రీకు భాషలో జింజి అంటే కొమ్ము అని అర్థం. దీని దుంపలు కొమ్ముల ఆకారంలో ఉంటాయి కాబట్టి.. దీనికి జింజిబేర అని పేరు వచ్చింది. ఆ పదం నుంచి జింజర్ అనే పదం పుట్టింది. అల్లాన్ని భారతీయులు మాత్రమే కాకుండా చైనీయులు, కొరియన్లు ఎక్కువగా ఉపయోగిస్తారు. చైనీయులు అల్లాన్ని తురిమి దానిలో కరివేపాకు కలిపి బూందీలా వేయిస్తారు. దీనిని చావో అంటారు. ఇక కొరియన్లు బార్లీ పిండిని పులియబెట్టి దానిలో అల్లం వేసి తింటారు.

రకరకాలుగా...



అల్లం లేతగా.. తాజాగా ఉన్నప్పుడే రుచికరంగా ఉంటుంది. ఎండిన అల్లాన్ని శొంఠి అంటారు. అల్లమూ, శొంఠీ రెండూ వాతాన్ని, కఫాన్నీ తగ్గించే ప్రసిద్ధ ద్రవ్యాలు. శొంఠి కన్నా అల్లం వేడి చేసే స్వభావం ఉన్న ద్రవ్యం. మిరపకారంతో పోలిస్తే వేడి చేసే విషయంలో అల్లమే నయం. అయితే అల్లాన్ని పరిమితంగా.. ఒక ఔషధంగా వాడుకోవాలి. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం అల్లంకూడా బలాన్నిచ్చే టానిక్ లాంటిది. ఇది వ్యాధినిరోధక శక్తినిస్తుంది. రక్తదోషాల్ని పోగొడుతుంది. ఇది జఠరాగ్నిని పెంచుతుంది. అల్లాన్ని దంచి, ఒక వస్త్రంలో వేసి, గిన్నెలో గట్టిగా పిండితే రసం వస్తుంది. కొద్ది సేపటికి నీరు తేరుకుని అడుగున తెట్టు మిగుల్తుంది. తేరిన రసాన్ని మాత్రమే తీసుకొని అడుగున మిగిలింది వదిలేయాలి. ఇదే అల్లం రసం. ఈ రసంలో బెల్లం కలిపి తాగితే వెంటనే జీర్ణశక్తి పెరుగుతుంది. ఇందులో తగినన్ని పాలు పోసి ఉడికించి తేనె కలిపి, టీలాగా తాగే అలవాటు చాలా దేశాల వారికి ఉంది.

లాభాలెన్నో!

అల్లంలో ఫాస్పరస్.. కాల్షియంతో పాటుగా ప్రొటీన్లు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇందులో జింజిరోన్, షోయగోల్ అనే రసాయనాల వలన జ్వరాన్ని.. నొప్పులను తగ్గించే శక్తి ఉంటుంది. అల్లంలో ఉన్న పీచు పేగులను దృఢపరుస్తుంది. ఇది పేగులను వేగంగా కదిలించి, విరేచనం అయ్యేలా చేస్తుంది. అల్లం.. బెల్లం కలిపి నూరి, చిన్నచిన్న బిళ్లలు కట్టి ఆరనిచ్చి సీసాలో పోసుకొని, ఒక్కొక్క బిళ్ళ చొప్పున రెండు లేక మూడుసార్లు చప్పరిస్తే అరచేతిలో చెమటపట్టటం, పొట్టు రాలటు తగ్గుతాయి. సొరియాసిస్ వ్యాధిలో ఇది మంచి ఉపాయం! దగ్గు, జలుబు, ఉబ్బసం, ఇతర ఎలర్జీ వ్యాధుల్లో అల్లం మంచిది. కీళ్లవాతం, సయాటికా, నడుంనొప్పి, మెడనొప్పి, ఇలా అనేక దీర్ఘవ్యాధులతో బాధపడేవారు- ఆహార పదార్థాల్లో కారానికి బదులుగా అల్లం వాడుకొంటే మంచిది. నిమ్మరసంలో అల్లం ముక్కల్ని నానబెట్టిన అల్లం మురబ్బా జీర్ణ శక్తిని పెంచుతుంది.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

వేసవి కాలం వచ్చేసింది. రోజు రోజుకీ ఎండ వేడి పెరుగుతోంది. మధ్యాహ్నం వేళ బాగా ఎండగా ఉన్నప్పుడు ఒక గ్లాసు చల్లటి మజ్జిగ తాగితే ప్రాణం లేచొచ్చినట్లు ఉంటుంది. అందుకే ఈ వేసవిలో మీ దాహార్తిని తీర్చేందుకు విభిన్న మజ్జిగ రుచులను అందిస్తున్నాం...

కమ్మని మజ్జిగతో... చల్ల చల్లగా...



స్వీట్ లస్సీ

కావాల్సిన పదార్థాలు

• పెరుగు- రెండు కప్పులు, పంచదార- అర కప్పు, యాలకుల పొడి- అర చెంచా, కుంకుమ పువ్వు- పావు చెంచా, గులాబీ నీళ్లు- ఒక చెంచా, చల్లటి నీళ్లు- అర గ్లాసు, ఐస్ క్యూబ్స్- ఆరు

తయారీ విధానం

• ఒక కప్పులో ఒక చెంచా నీళ్లు, కుంకుమ పువ్వు వేసి అయిదు నిమిషాలు నాననివ్వాలి.

• ఒక వెడల్పాటి గిన్నెలో పెరుగు, పంచదార వేసి బీటర్ సహాయంతో బాగా బీట్ చేయాలి. పంచదార మొత్తం కరిగాక ఇందులో యాలకుల పొడి, కుంకుమపువ్వు మిశ్రమం, గులాబీ నీళ్లు, చల్లటి నీళ్లు, ఐస్ క్యూబ్స్ వేసి మరోసారి బీట్ చేయాలి. తరవాత ఈ మిశ్రమాన్ని గాజు గ్లాసులో పోసి పైన కుంకుమ పువ్వు రేకులు, పిస్తా తరుగు చల్లితే స్వీట్ లస్సీ సిద్ధం అవుతుంది.

జాగ్రత్తలు

• కమ్మగా ఉండే గడ్డ పెరుగుని తీసుకుంటే లస్సీ రుచికరంగా తయారవుతుంది.
• ఇందులో ఒక చెంచా కోవా కలిపితే మరింత కమ్మగా ఉంటుంది.
• పంచదారకు బదులు బెల్లం పొడి లేదా తాటి బెల్లం కూడా వాడుకోవచ్చు.

మసాలా మజ్జిగ



కావాల్సిన పదార్థాలు

• అల్లం- ఒక చిన్న ముక్క, పచ్చి మిర్చి- ఒకటి, పుదీనా ఆకులు- అయిదు, కొత్తిమీర- రెండు రెమ్మలు, మిరియాల పొడి- పావు చెంచా, జీలకర్ర పొడి- పావు చెంచా, పెరుగు- ఒక గంటె, ఉప్పు- తగినంత, చల్లటి నీళ్లు- ఒక గ్లాసు, నిమ్మరసం- ఒక చెంచా

తయారీ విధానం

• పచ్చిమిర్చి, పుదీనా, అల్లం, కొత్తిమీరలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. కొత్తిమీరను సన్నగా తరగాలి.

• మిక్సీ గిన్నెలో పెరుగు, అల్లం, పచ్చిమిర్చి, పుదీనా ఆకులు, కొత్తిమీర తరుగు, మిరియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులో చల్లటి నీళ్లు పోసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఇలా తయారైన మసాలా మజ్జిగను గాజు గ్లాసులో పోయాలి. ఇందులో నిమ్మరసం వేసి కలపాలి. దీనిపైన చిటికెడు జీలకర్ర పొడి, కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేస్తే బాగుంటుంది.

జాగ్రత్తలు

• గ్రైండ్ చేసిన మసాలా మజ్జిగను కావాలనుకుంటే వడబోసుకోవచ్చు.
• ఈ మజ్జిగ ఘాటుగా ఉందనిపిస్తే అందులో కొన్ని చల్లటి నీళ్లు, కొద్దిగా ఉప్పు కలుపుకోవచ్చు.

షాహీ లస్సీ



కావాల్సిన పదార్థాలు

• ఖర్జూరాలు- తొమ్మిది, బాదం పప్పులు- పదమూడు, జీడిపప్పులు- పది, పిస్తా పప్పులు- పది, ఎండు ద్రాక్ష- ఆరు, యాలకుల పొడి- పావు చెంచా, కుంకుమ పువ్వు- పావు చెంచా, పెరుగు- ఒక గరిటెడు, నీళ్లు- ఒక గ్లాసు, గులాబీ రేకులు- అయిదు

తయారీ విధానం

• ముందుగా ఒక గిన్నెలో ఖర్జూరాలు, బాదం, జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష వేసి అవి మునిగేవరకూ నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. ఒక కప్పులో ఒక చెంచా నీళ్లు తీసుకుని అందులో కుంకుమపువ్వు వేసి ఉంచాలి.

• మిక్సీ గిన్నెలో పెరుగు, నానబెట్టిన డ్రై ఫ్రూట్స్, కుంకుమపువ్వు మిశ్రమం, యాలకుల పొడి వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులో నీళ్లు పోసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గాజు గ్లాసులో పోసి పైన పిస్తా తరుగు, గులాబీ రేకులు చల్లితే రుచికరమైన షాహీ లస్సీ తయారవుతుంది. చల్లగా తాగాలనుకుంటే ఫ్రిజ్‌లో అరగంటసేపు పెడితే చాలు.

జాగ్రత్తలు

• పుల్లగా కాకుండా తియ్యగా ఉండే పెరుగు తీసుకుంటే షాహీ లస్సీ రుచిగా ఉంటుంది.
• డ్రైఫ్రూట్స్‌ని రాత్రంతా నీళ్లలో నానబెడితే లస్సీ రుచి పెరుగుతుంది.

మేకప్

రాత్రి వేడుకల్లో వెలిగిపోయేలా...



పగటి వెలుగుకూ, రాత్రి వేళ లైట్ల వెలుగుకూ తేడా ఉంటుంది. కాబట్టి ఆ వెలుగుకు తగ్గట్టు మేకప్ వేసుకుంటే సహజసిద్ధ అందంతో మెరిసిపోవచ్చు. అందుకోసం...

• **లిప్‌స్టిక్:** పగటి వేళ న్యూడ్, బీజ్ లాంటి రంగులతో వీలైనంత తేలికపాటి మేకప్‌తో సరిపెట్టుకోవచ్చు. కానీ రాత్రి వేళ లేత రంగులు లైట్ల వెలుగుకు వెలాతెలా పోతాయి. కాబట్టి ముదురు ఎరుపు రంగు లిప్‌స్టిక్స్ మాత్రమే ఎంచుకోవాలి. ఎరుపు, ముదురు గోధుమ రంగు లిప్‌స్టిక్స్ బాగుంటాయి.

• **ఐ షాడో:** లైట్ల వెలుగుకు ఐషాడో ప్రతిఫలించేలా చూసుకోవాలి. అందుకోసం గ్లిట్టర్ వాడుకోవాలి. నీలం, పర్పుల్ గ్లిట్టర్స్ రాత్రి వేళ వేడుకలకు ఎంతో బాగా నప్పుతాయి. ఇవి ధరించే డ్రస్సుతో సరిపోయేలా చూసుకోవాలి.

• **చెక్కుచెదరకుండా:** మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం మేకప్ సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి. లేదంటే, ఫౌండేషన్ మీద కాంపాక్ట్ పౌడర్ అద్దుకోవాలి. అలాగే బేస్ చెదిరిపోకుండా ఉండడం కోసం కొంత ఫౌండేషన్, బ్యూటీ బ్లెండర్ కలిపి వాడుకోవాలి.

• **ఐలైనర్:** మేకప్ (లుక్ అదిరిపోవాలంటే కనురెప్పలకు నియాన్ ఐలైనర్ వేయాలి.

• **చెక్కినట్టు:** ముక్కు, చుబుకం, కనుబొమలు స్పష్టంగా చెక్కినట్టు కనిపించడం కోసం బ్రాంజర్‌తో కాంటూర్ చేసుకోవాలి.

• **బ్లషర్:** సాధారణంగా బ్లషర్ కొన్ని గంటలకే చెదిరిపోతూ ఉంటుంది. కాబట్టి చెక్కిళ్లకు కూడా బ్లషర్ అప్లై చేయడం మర్చిపోకూడదు.

• **ఐ ల్యాషెస్:** కృత్రిమ కనురెప్పలు ఉపయోగించవచ్చు. ఇష్టం లేకపోతే డ్రమాటిక్ మస్కారా అప్లై చేయాలి.

• **హైలైటర్:** చెక్కిళ్లు, బ్రో బోన్ మీద అద్దుకోవాలి.

సంకల్పం

లోపం... శాపం కాకూడదని..!

మగపిల్లాడు కావాలనుకొంటే ఆడపిల్ల పుట్టింది. అదికూడా వినికిడి శక్తి లేని పిల్ల. ఇంట్లో వద్దు పొమ్మని కన్నతండ్రి చీదరించుకున్నాడు. అయినవాళ్లు, బంధువులు దూరం పెట్టారు. కానీ అమ్మ అండతో సామాజిక అసమానతలు దాటి... ఉన్నత చదువులు చదివింది. నాట్యం, సంగీతం... అన్నింటా అద్భుతాలు చేస్తోంది. తనలాంటివారికి ప్రేరణగా నిలుస్తూ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్న 33 ఏళ్ల రచనా షా కథ ఇది.

"నాది భిన్నమైన కథ. కన్నవారు ఉన్నా అనాథలా ఇంటికి దూరంగా బతికాను. నాకోసం అమ్మ అన్నిటినీ వదిలేసి కట్టు బట్టలతో బయటకు వచ్చింది. అమ్మమ్మ... అమ్మను, నన్నూ చేరదీసింది. నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు వారిద్దరే కారణం. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మధ్యతరగతి కుటుంబం మాది. అమ్మ, నాన్న ఇద్దరూ విద్యావంతులు. మా అమ్మ డాక్టర్ జ్ఞానేశ్వరీషా కెమికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేసింది. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్ విభాగం అధిపతిగా పని చేస్తోంది. నాన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్. కానీ నేను పుట్టినప్పుడు మా ఇంట్లో సంబరాలు చేసుకోలేదు. అబ్బాయి కావాలని పూజలు చేస్తే అమ్మాయి పుట్టడం



ఒక కారణమైతే, నేను పుట్టు బధిరురాలిని కావడం మరో కారణం.

'అలాంటి కూతురు నాకొద్దు...'

చావు పుట్టుకలు ఎవరి చేతుల్లోనూ ఉండవని తెలిసి కూడా నాన్న నన్ను చీదరించుకున్నారు. చెవిటిదాన్నని నా పట్ల వివక్ష చూపారు. నాన్నతో పాటు ఆయన తరుపు బంధువుల వరుస కూడా అదే. 'వైకల్యంతో పుట్టిన ఆడపిల్లకు ఇంట్లో స్థానం లేదు' అంటూ తేల్చేశారు. మరి ఎక్కడ ఉండాలి? 'ఏదో ఒక ఆశ్రమంలో పడేయండి'... ఇదీ సమాధానం. అమ్మ నా కోసం ఇంటిని, భర్తను వదిలేయడానికి సిద్ధపడింది. అప్పటికి వాళ్ల పెళ్లయ్యి ఏడాదిన్నరే. కానీ మరో ఆలోచన లేకుండా అమ్మ అన్నిటినీ త్యాగం చేసి, నన్ను తీసుకొని, బయటకు వచ్చేసింది. నాకున్న లోపం గురించి ఇకపై ఎవరూ నోరెత్తకుండా నన్ను ఉన్నతంగా పెంచాలని ఆ క్షణం దృఢంగా నిశ్చయించుకుంది.

కొత్త వెలుగు...

నిశిరాత్రి చీకట్లు చీల్చుకొంటూ ఉదయం కొత్త వెలుగుతో వస్తుంది. ఆ నమ్మకంతోనే నా జీవితాన్ని ప్రారంభించాను. నాపై నాకంటే మా అమ్మకు నమ్మకం ఎక్కువ. అందుకు అమ్మమ్మ మద్దతు దొరికింది. సామాజిక అసమానతలు, కట్టుబాట్లు తన కూతురి భవిష్యత్తును నిర్దేశించకూడదన్నది అమ్మ సంకల్పం. అందులో భాగంగా 1995లో తొలిసారి నాకు హియరింగ్ డివైజ్ కొని తెచ్చింది. అధునాతన సాంకేతికతో కూడిన మల్టీచానల్, డిజిటల్ డివైజ్‌లు మార్కెట్‌లోకి రాగానే అవి మా ఇంట్లో ఉండేవి. నా ఎదుగుదలలో వాటి పాత్ర అమూల్యం. అయితే నా వైకల్యం వల్ల చాలాచోట్ల అవహేళనలు ఎదుర్కొన్నా. వినికిడి శక్తిలేనివారు ఈ ప్రపంచంతో పోటీ పడలేరని ఎంతోమంది ముఖం మీదే అన్నారు. ఆ క్షణం బాధ కలిగినా, క్రమంగా నాకు నేను ధైర్యం చెప్పుకున్నా. నన్ను చులకన చేసినవారికి, నా సామర్థ్యాన్ని తక్కువ చేసి మాట్లాడినవారికి, నన్ను ఇంటి నుంచి గెంటేసిన కన్న తండ్రికి గట్టిగా సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నా.

ఒకటి కాదు... ఎన్నో...

నాకు మాటలు రావడమే కష్టమన్నారు. కానీ మాతృభాషతో పాటు హిందీ, ఇంగ్లీష్ కూడా నేర్చుకున్నా. వాటిల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నా. నాలాంటివారికి చదువే వంటబట్టదన్నారు. చదువుతో పాటు భరతనాట్యం నేర్చుకున్నా. అదీ ఐదేళ్ల కోర్సు మూడేళ్లలోనే పూర్తి చేశా. పలు ప్రదర్శనలు కూడా ఇచ్చాను. హిందుస్థానీ సంగీతం అభ్యసించాను. హార్మోనియం వాయిస్తాను. సంబంధిత పరీక్షలు కూడా పూర్తి చేశాను. నా ఈ తపన కేవలం బతకడానికే కాదు... విజయం వైపు అడుగులు వేయడానికి. నలుగురిలో నన్ను నేను ప్రత్యేకంగా నిలపుకోవడానికి. నాలాంటివారికి నేనొక స్ఫూర్తిమంత్రం కావాలి. అన్నిటికీ మించి మా అమ్మ, అమ్మమ్మ నన్ను చూసి గర్వపడాలి.

వారిలో ధైర్యం నింపేందుకు...

చదువుకొనే రోజుల్లో నాకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తానంటే వద్దన్నాను. అది నా వైకల్యాన్ని గుర్తు చేస్తుంది. సాధారణ విద్యార్థులతో పోటీపడి చదివాను. 2014లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. సమాజంలో వివక్ష ఎదుర్కొంటున్న ఆడపిల్లలకు, వైకల్యం గల పిల్లలకు అండగా నిలబడాలన్న ఉద్దేశంతో ఖాళీ సమయాల్లో వారికి పాఠాలు చెబుతున్నాను. తమలోని లోపాలను చూసుకొని వెనకడుగు వేయకుండా, దాన్ని ఒక సవాలుగా తీసుకొని ప్రయత్నిస్తే ఎంతటి లక్ష్యమైనా దరి చేరుతుంది. ఈ విషయం మరింత అర్థమయ్యేలా వీధి నాటకాలు, నాట్య ప్రదర్శనలు ఇస్తున్నాను. ఎందుకంటే నేను ఎదిగితే సరిపోదు... నా చుట్టూ ఉన్నవారు కూడా అభివృద్ధి పథంలో పయనించాలి. అదే నా సంకల్పం."

'రోల్‌మోడల్...'

వినికిడిశక్తి లేని ఒక అమ్మాయిగా నాకు కొన్ని పరిమితులు ఉండవచ్చు. కానీ నా ప్రతిభ, సామర్థ్యాలతో వాటిని అధిగమించాను. ఇప్పుడు నేను డ్యాన్స్ చేయగలను. సంగీతం ఆలపించగలను. బొమ్మలు గీయగలను. ఇంకా ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్.. అన్నిట్లో నైపుణ్యం సంపాదించాను. నా ప్రతిభ, సామాజిక స్పృహను గుర్తించి గుజరాత్ ప్రభుత్వం 'సర్వశిక్ష అభియాన్' ప్రచార కార్యక్రమాలకు నన్ను రోల్ మోడల్‌గా నియమించింది. అలాగే 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్', 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. 'రోల్‌మోడల్ హియరింగ్ ఇంపెయిర్డ్ ఫిమేల్' అవార్డును నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదగా అందుకోవడం నా జీవితంలోనే ఒక మధురమైన ఘట్టం. యూకేలోని 'వరల్డ్ రికార్డ్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది.



బిజినెస్

వరంగల్ ● శనివారం 22 మార్చి 2025

లగ్జరీ వాచీలకు భలే గిరాకీ



బ్రైట్లింగ్ ఇండియా ఎండీ ప్రదీప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో ఖరీదైన వాచీలకు రోజు రోజుకు డిమాండ్ పెరిగిపోతోందని స్విట్జర్లాండ్‌కు చెందిన వాచీల తయారీ సంస్థ బ్రైట్లింగ్ వెల్లడించింది. దేశీయంగా కొనుగోలు శక్తి పెరుగుతుండటం, నవతరం కొత్త, ఖరీదైన ఉత్పత్తులపై ఆసక్తి చూపిస్తుండటంతో ఈ మార్కెట్ ఏటా 15 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని బ్రైట్లింగ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ భానోట్ వెల్లడించారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్ నుంచి ఏటా రూ.2,500 కోట్ల విలువైన లగ్జరీ వాచీలు దిగుమతి అవుతున్నాయన్నారు. లగ్జరీ వాచీల మార్కెట్లో బ్రైట్లింగ్‌తో పాటు మరో రెండు స్విస్ వాచీ కంపెనీలు కీలకంగా ఉన్నాయన్నారు. లగ్జరీ వాచీ మార్కెట్లో బ్రైట్లింగ్ మార్కెట్ వాటా 10 శాతానికి పైగా ఉందని ప్రదీప్ తెలిపారు. బ్రైట్లింగ్ వాచీల ధర రూ.3.15 లక్షల నుంచి ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. కాగా 2023లో కంపెనీ దేశంలోనే తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించిందన్నారు. ఆ తర్వాత చెన్నై, పుణె, బెంగళూరుకు కార్యకలాపాలను విస్తరించినట్లు ఆయన వివరించారు. కాగా విస్తరణలో భాగంగా వచ్చే ఏడాదిన్నర కాలంలో మరో 6 ఔట్‌లెట్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించినట్లు ప్రదీప్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		దజను గుడ్లు రూ.	60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	96	విజయవాడ	105
వరంగల్	96	గుంటూరు	103
కరీంనగర్	96	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	82
కర్నూలు	96	నెల్లూరు	87
విశాఖపట్నం	99	అనంతపురం	87
గోదావరి	105		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,220 ▼	82,700 ▼	1,12,000 ▼
విజయవాడ	91,300 ▼	86,500 ▼	1,00,000 ▼
విశాఖపట్నం	88,610 ▼	81,230 ▼	98,740 ▼
రాజమండ్రి	90,220 ▼	82,700 ▼	1,00,700 ▼
ప్రొద్దుటూరు	90,200 ▼	83,530 ▼	1,00,200 ▼
ముంబై	88,169 ▼	80,763 ▼	97,620 ▼

బోగస్ ఫిన్ఇన్‌ఫ్లుయెన్సర్లపై సెబీ వేటు



70,000 సోషల్ మీడియా ఖాతాలు క్లోజ్

ముంబై: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. అనధికారిక పెట్టుబడి సలహాదారుల (ఫిన్ఇన్‌ఫ్లుయెన్సర్స్) భరతం పడుతోంది. గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఇలాంటి 70,000 మంది ఫిన్ఇన్‌ఫ్లుయెన్సర్స్ సోషల్ మీడియా ఖాతాలను క్లోజ్ చేయించింది. సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అనంత్ నారాయణ్ ఈ విషయం వెల్లడించారు. స్టాక్ మార్కెట్ గరిష్ఠ స్థాయికి చేరడంతో చాలా మంది సెబీ వద్ద నమోదు కాకుండానే పెట్టుబడి సలహాదారులు, రీసెర్చ్ అనలిస్టుల పేరుతో సోషల్ మీడియా ద్వారా పెట్టుబడి సలహాలు ఇస్తూ మదుపరులను తప్పుదారి పట్టిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సెబీ గత ఏడాది అక్టోబరు నుంచి వీరిపై చర్యలు ప్రారంభించింది. ఇలాంటి కేటుగాళ్ల ఆటలు కట్టించేందుకు సెబీ వద్ద నమోదైన ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, అనలిస్టులు కూడా తమకు సహకరించాలని నారాయణ్ కోరారు.

ఎఫ్‌పీఐల పెట్టుబడులు

దేశీయ మార్కెట్లో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులపైనా నారాయణ్ మాట్లాడారు. ఎఫ్‌పీఐ సంస్థల అమ్మకాలపై మరీ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల వీటి అమ్మకాలు ఎంత ఉధృతంగా ఉన్నా గత నెలాఖరు వరకు చూసినా, వీటి పెట్టుబడులు మన ఈక్విటీ మార్కెట్లో రూ.62 లక్షల కోట్లు, డెట్ మార్కెట్‌లో రూ.5.9 లక్షల కోట్ల వరకు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే కీలకమైన ఎఫ్‌పీఐల పెట్టుబడులపై ఉదాసీన వైఖరి కూడా పనికిరాదన్నారు. స్థిరమైన ఆర్థిక అభివృద్ధి, పటిష్ఠమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, చక్కటి నిర్వహణ ద్వారా ఈ పెట్టుబడులను ఆకర్షించవచ్చన్నారు.

జూలై 1 వరకు గడువు

లిస్టెడ్ కంపెనీలకు ఉద్దేశించిన సంబంధిత ఆర్థిక లావాదేవీల వివరాల వెల్లడిపై అభిప్రాయాల సేకరణ గడువును సెబీ ఏప్రిల్ 1 నుంచి జూలై 1 వరకు పొడిగించింది. లిస్టెడ్ కంపెనీలు తమ అనుబంధ కంపెనీలు, లేదా తమ ప్రమోటర్లు, బోర్డు సభ్యుల నిర్వహణలోని కంపెనీలతో జరిగే ఆర్థిక లావాదేవీల వివరాలను ఆయా కంపెనీల ఆడిట్ కమిటీలకు తెలియజేసేందుకు నిర్దిష్ట ప్రామాణికాలు రూపొందించాలని సెబీ తలపెట్టింది. దీనిపై ఏప్రిల్ 1లోగా తమ అభిప్రాయాలు తెలపాలని గత నెల పరిశ్రమ వర్గాలను కోరింది. అయితే ఫిక్కీ, సీఐఐ, అసోచామ్ ఇందుకు మరింత గడువు కోరడంతో ఈ గడువును ఈ ఏడాది జూలై 1 వరకు పొడిగిస్తున్నట్టు తెలిపింది.

బ్రోకర్లకు ఊరట

గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ-ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సీ)లో సొంత యూనిట్లు లేదా జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేయాలనుకునే బ్రోకర్లకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని సెబీ భావిస్తోంది. ఇందుకు తన నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) లేకుండానే వారిని అనుమతించాలని యోచిస్తోంది. అయితే గిఫ్ట్ సిటీలో ఏర్పాటు చేసే బ్రోకరేజీ సంస్థల అనుబంధ లేదా జాయింట్ వెంచర్ కంపెనీలు ప్రధాన కంపెనీతో ఎలాంటి సంబంధం లేకుండా పూర్తి స్వతంత్రగా, గిఫ్ట్ సిటీ నిబంధలకు లోబడి పని చేయాలని ప్రతిపాదించింది.

ప్రకటనలపైనా నియంత్రణ

మదుపరుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సెబీ మరో కీలక చర్య తీసుకుంది. తన వద్ద నమోదైన సంస్థలు.. గూగుల్, మెటా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఇచ్చే ప్రకటనలను మరింత కట్టుదిట్టం చేసింది. ఇక ఈ ప్రకటనలు ఇచ్చే సంస్థలు తమ ప్రచార ప్రకటనలతో పాటు సెబీ వద్ద నమోదు చేసిన తమ ఈ-మెయిల్, మొబైల్ నంబర్లను కూడా ఆ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌కు ఇవ్వాలని స్పష్టం చేసింది. దీంతో ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఈ సంస్థలు నిజమైనవా? కావా? అని నిర్ధారించుకుని వారి ప్రకటనలను తమ ప్లాట్‌ఫామ్స్‌లో పోస్టు చేస్తాయి. తమ వద్ద నమోదైన సంస్థలు, వ్యక్తులు వచ్చే నెలాఖరులోగా మారిన తమ ఈ-మెయిల్స్, మొబైల్ నంబర్లను 'సెబీ ఎస్ఐ' పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకోవాలని సెబీ కోరింది.సెబీ వద్ద నమోదైన గుర్తింపు సంస్థల పేరుతో కొన్ని బోగస్ సంస్థలు, కేటుగాళ్లు మదుపరులకు టోపీ పెడుతున్నట్టు వార్తలు రావడంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

మార్కెట్లో కొనసాగిన జోరు

- సెన్సెక్స్ 557 పాయింట్లు అప్
- 5 రోజుల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.22 లక్షల కోట్లు అప్

ముంబై: స్టాక్ మార్కెట్లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. ఈ వారంలో వరుసగా ఐదు ట్రేడింగ్ రోజులూ కీలక సూచీలు లాభాల్లోనే ముగిశాయి. ప్రధానంగా ఈ ఏడాది మరో రెండు విడతలు వడ్డీ రేట్ల కోత ఉంటుందన్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలు ఇన్వెస్టర్ సెంటిమెంట్ పెరిగేందుకు దోహదపడ్డాయి. దీనికి తోడు డాలర్ ఇండెక్స్ బలహీనపడడంతో విదేశీ ఇన్వెస్టర్లు మరోసారి వర్ధమాన మార్కెట్లలో పెట్టుబడులను పెంచారు. దీంతో శుక్రవారం సెన్సెక్స్ 557.45 పాయింట్లు లాభపడి 76,905.51 వద్ద ముగియగా నిఫ్టీ 159.75 పాయింట్ల లాభంతో 23,350.40 వద్ద ముగిసింది. సర్వత్రా సానుకూల వాతావరణంలో వారం మొత్తం మీద సెన్సెక్స్ 3076 పాయింట్లు, నిఫ్టీ 953 పాయింట్లు లాభపడ్డాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న సమాచారం ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు గురువారం రూ.3,239.19 కోట్ల విలువ గల ఈక్విటీలు కొనుగోలు చేశారు. చమురు ధరలు అదుపులో ఉండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచింది. శుక్రవారం బ్యారెల్ క్రూడాయిల్ 0.21 శాతం తగ్గి 71.85 డాలర్ల వద్ద ట్రేడయింది. కాగా ఐదు రోజుల ర్యాలీ ప్రభావంతో ఇన్వెస్టర్ల సంపద రూ.22,12,191.12 కోట్లు పెరిగి రూ.4,13,30,624.05 కోట్లకు (4.79 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. అన్ని వర్గాల ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించటం కలిసివచ్చిందని విశ్లేషకులంటున్నారు.

మునిసిపల్ బాండ్ల కోసం ప్రత్యేక వెబ్‌సైట్

ఎన్ఎస్ఈ

న్యూఢిల్లీ: దేశంలో మునిసిపల్ బాండ్స్ మార్కెట్‌ను పటిష్ఠం చేసేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించింది. ఈ వెబ్‌సైట్‌లో మార్కెట్లో ఉన్న మునిసిపల్ బాండ్స్ ఇష్యూలు, వాటి పరపతి రేటింగ్, ట్రేడవుతున్న బాండ్ల సంఖ్య, ఆయా బాండ్స్‌పై లభించే నికర రాబడులు, వాటి ప్రస్తుత ధర, నిఫ్టీ ఇండియా మునిసిపల్ బాండ్ ఇండెక్స్ పనితీరుతో సహా సమగ్ర సమాచారం ఉంటుందని తెలిపింది. మునిసిపల్ బాండ్స్‌పై అవగాహన, పారదర్శకత, అమ్మకాలు, కొనుగోళ్లకు కూడా ఈ వెబ్‌సైట్ ఎంతగానే ఉపయోగపడనుంది.

బ్యాంకుల సమ్మె వాయిదా

న్యూఢిల్లీ: వచ్చే సోమ, మంగళవారాల్లో చేయతలపెట్టిన రెండు రోజుల సమ్మెను బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక (యూఎఫ్‌బీయూ) వాయిదా వేసింది. ఐదు రోజుల పని, అన్ని క్యాడర్లలోనూ తగినన్ని నియామకాలు చేపట్టాలన్న తమ డిమాండ్ల విషయంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) నుంచి సానుకూల హామీ లభించిన నేపథ్యంలో సమ్మె వాయిదా వేస్తున్నట్టు 9 బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక యూఎఫ్‌బీయూ ప్రకటించింది.

రిలయన్స్ క్యాపిటల్ దివాలా సుఖాంతం

న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ క్యాపిటల్ కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియ సుఖాంతమైంది. హిందుజాల నేతృత్వంలోని ఇండస్ ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్ లిమిటెడ్ (ఐఐహెచ్ఎల్) రూ.10,000 కోట్లతో ఈ కంపెనీని దక్కించుకుంది. రుణదాతలు, రెగ్యులేటరీ సంస్థల ఆమోదాలూ పూర్తయ్యాయి. కంపెనీ డైరెక్టర్ల బోర్డునీ పునర్ వ్యవస్థీకరించారు. దీంతో ఈ నెల 19న రిలయన్స్ క్యాపిటల్ దివాలా పరిష్కార ప్రక్రియ పూర్తయిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తెలిపింది. ఈ ప్రక్రియ మొత్తానికి వై నాగేశ్వర రావు దివాలా పరిష్కార పరిష్కర్తగా వ్యవహరించారు. దేశంలో దివాలా పరిష్కార ప్రక్రియకు వచ్చిన తొలి ఎన్‌బీఎఫ్‌సీ కూడా రిలయన్స్ క్యాపిటలే.

శ్రీసిటీలో కోబెల్కో ఆర్ అండ్ డీ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నిర్మాణ రంగ దిగ్గజం కోబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో పరిశోధన, అభివృద్ధి కేంద్రం (ఆర్ అండ్ డీ) ఏర్పాటు చేయనుంది. భారత్‌ను జపాన్‌లోని తమ మాతృసంస్థ కోబెల్కో కన్‌స్ట్రక్షన్ మెషినరీ కంపెనీకి కీలక తయారీ, ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చి దిద్దాలనుకుంటున్నట్టు ప్రకటించింది. ఈ కేంద్రం అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్ సొల్యూషన్లు, విభిన్న మార్కెట్ అవసరాలకు దీటుగా కస్టమైజేషన్, కీలక తయారీ కేంద్రంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంపై కృషి చేస్తుందని కంపెనీ తెలిపింది. చెన్నైకి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీసిటీలోఈ కంపెనీ హైడ్రాలిక్ ఎస్కవేటర్ల తయారీ కేంద్రం నడుపుతోంది. శుక్రవారం ఈ కేంద్రం 20 వేల ఎస్కవేటర్ల తయారీ మైలురాయిని చేరింది. ఏడాదికి 3,000 ఎస్కవేటర్ల తయారీ సామర్థ్యం గల ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తులను 16 దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

రెండేళ్లలో తెలంగాణలో రూ.1,000 కోట్ల టర్నోవర్

గోద్రెజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జెర్సీ బ్రాండ్‌తో పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గోద్రెజ్ జెర్సీ. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో గట్టి పట్టును చేజిక్కించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా బాదంపాలు, పన్నీర్, పెరుగు ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు గోద్రెజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి వెల్లడించారు. మార్కెట్ కార్యకలాపాల విస్తరణ, వ్యూహాత్మక పెట్టుబడులు, భాగస్వామ్యాల ద్వారా ఈ ఉత్పత్తుల అమ్మకాలను గణనీయంగా పెంచుకోవాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. గోద్రెజ్ జెర్సీ ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో కీలకమైన బ్రాండ్‌గా ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కంపెనీ టర్నోవర్ రూ.660 కోట్లుగా ఉందని 2026-27 నాటికి దీన్ని రూ.1,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సూరి తెలిపారు. కాగా విలువ ఆధారిత ఉత్పత్తులపై మరింతగా దృష్టి పెట్టడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో మరో రూ.1,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.1,540 కోట్లుగా ఉండగా అందులో విలువ ఆధారిత ఉత్పత్తుల వాటా దాదాపు 40 శాతం వరకు ఉందన్నారు. కాగా బాదంపాల మార్కెట్లో మరింత పట్టును చేజిక్కించుకునే ఉద్దేశంతో టాలీవుడ్ నటుడు రానా దగ్గుబాటిని ప్రచారకర్తగా నియమించుకున్నట్లు సూరి వెల్లడించారు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ మార్కెట్లో కంపెనీ రోజుకు 2 లక్షల లీటర్ల వరకు పాలను సేకరిస్తోందని తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఆసక్తికరమైన ప్రయాణం ఇది

\- కీరవాణి



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం గురించి ఆ చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకూ తను పని చేసిన చిత్రాల్లో ఇది కష్టతరమైన ప్రాజెక్ట్ అని ఆయన పేర్కొన్నారు. 'ప్రతి సినిమాకూ సవాళ్లు పెరుగుతుంటాయి. దానికి తగ్గట్టు కొత్త సౌండ్స్ సృష్టించాలి. మహేశ్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం లాంటిది ఇంతవరకూ రాలేదని అనుకుంటున్నా. అదొక అడ్వంచర్. అయినా ఆసక్తికరమైన ప్రయాణమే' అన్నారు కీరవాణి. 'నా టూర్ ఎం.ఎం.కె.' పేరుతో నిర్వహించే మ్యూజిక్ కాన్సర్ట్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఇటీవల ఒడిశాలోని కోరాపుట్‌లో జరిగిన షూటింగ్‌తో మహేశ్‌బాబు చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయిన విషయం విదితమే.

తొలి గీతం అప్పుడే



నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హిట్: ద థర్డ్ కేస్'. ప్రశాంతి త్రిపిర్నేని నిర్మాత. మే 1న థియేటర్లలో విడుదల కానుంది. కాగా, ఈ సినిమా నుంచి తొలి గీతం 'ప్రేమ వెల్లువ'ను ఈనెల 24న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. మిక్కీ జె.మేయర్ సంగీతం అందించారు. విజయవంతమైన 'హిట్' ఫ్రాంచైజీలో మూడో భాగంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

వేసవిలో 'సింగిల్'



శ్రీ విష్ణు హీరోగా కార్తీక్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సింగిల్'. కేతిక శర్మ, ఇవాన హీరోయిన్లు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఇదివరకే ప్రకటించినట్లుగా మే 9న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల అవుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్ శ్రీ విష్ణు పాత్రను రెండు విభిన్నమైన షేడ్స్‌లో ప్రజెంట్ చేస్తోంది.

రెండు భాగాలుగా విజయ్ సినిమా



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కింగ్‌డమ్'. సూర్యదేవర నాగ వంశీ నిర్మాత. మే 30 థియేటర్లలో విడుదల కానుంది. అయితే ఈ సినిమా గురించి ఆసక్తికర విషయం వెల్లడించారు నిర్మాత నాగ వంశీ. 'మ్యాడ్ స్క్వేర్' ప్రమోషన్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'కింగ్‌డమ్' సినిమా రెండు భాగాలుగా రాబోతోందని చెప్పారు. 'రెండు భాగాలు తీయాలనేది తొలుత మేము అనుకోలేదు. అయితే కథ డిమాండ్‌ను బట్టి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని చెప్పారు.

చెలియా చెలియా..



'పొలిమేర' చిత్రం విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వం వహించిన మొదటి సినిమా '28 డిగ్రీల సెల్సియస్'. నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించారు. ఈనెల 28న థియేటర్లలో విడుదలవుతోంది. వీరాంజనేయ బ్యానర్‌పై సాయి అభిషేక్ నిర్మించారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'చెలియా చెలియా' అనే ప్రేమ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యానికి శ్రావణ్ భరద్వాజ్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'మనసును తాకే భావోద్వేగాలతో ఆద్యంతం సాగే అద్భుతమైన ప్రేమ కథా చిత్రమని' తెలిపారు.

స్టూడియోలు నిర్మించాలని కోరాం

● తెలుగు నిర్మాతల మండలి

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం కొత్త విధానం తీసుకురావాలని నిర్ణయించినందుకు తెలుగు నిర్మాతలమండలి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, దుర్గేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపింది. పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సమర్పించామనీ, వైజాగ్, తిరుపతి, రాజమహేంద్రవరంలో స్టూడియోల నిర్మాణం కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, నిర్మాతలు, నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణుల గృహనిర్మాణం కోసం భూమి కేటాయింపు వంటి ప్రతిపాదనలు పంపామని నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే నంది అవార్డులను పునరుద్ధరించాలనీ, పెండింగ్‌లో ఉన్న అవార్డులను కూడా ఇవ్వాలని అభ్యర్థించినట్లు ఆయన వెల్లడించారు. ఏపీలో తెలుగు చిత్ర పరిశ్రమ వేగవంతమైన అభివృద్ధి కోసం ప్రభుత్వానికి పూర్తి సహకారం, మద్దతు అందిస్తామని కూడా ప్రసన్నకుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం ఈ విషయంలో త్వరిత చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

స్పోర్ట్స్


సంజూతో పంత్

వేసవిలో మస్తు మజా!

నేటి నుంచే ఐపీఎల్

తొలి మ్యాచ్‌లో కేకేఆర్ X ఆర్‌సీబీ

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



ధోనీకిదే ఆఖరా?

గత రెండేళ్లుగా ఐపీఎల్ ఆరంభమైనప్పుడల్లా సీఎస్‌కే మూలస్తంభం ఎంఎస్ ధోనీకిదే చివరిదా? అనే సందేహం పరిపాటిగా మారింది. 43 ఏళ్ల ఈ వెటరన్ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఐదేళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ తన చరిష్మా ఏమాత్రం తగ్గలేదు. ఐపీఎల్‌లో మాత్రమే ఆడుతుండడంతో దేశంలోని ఏ స్టేడియానికి వెళ్లినా అతడి కోసం ప్రేక్షకులు భారీగా తరలివస్తున్నారు. జట్టులో ధోనీ ఉండడం అటు సీఎస్‌కేకు కూడా కొండంత బలంగా మారింది. క్రికెట్‌పై అతడికున్న అవగాహన, తిరుగులేని వ్యూహాలు, ఫీల్డింగ్ మార్పులు, మెరుపు ఆటతో మ్యాచ్‌ను ముగించే తీరు ధోనీని విలువైన ఆటగాడిగా మార్చాయి. ఇప్పటికీ అద్భుత ఫిట్‌నె‌స్‌తో కనిపిస్తున్న ఈ చెన్నై 'తలా' తాజా సీజన్‌తో ఐపీఎల్‌ను ముగించవచ్చని బలంగా విశ్వసిస్తున్నారు.

టీ20 బరిలోకి రో-కో



గతేడాది టీ20 ప్రపంచకప్ విజయంతో స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఆ తర్వాత మళ్లీ ధనాధన్ పోరు కోసం ఈ జోడీ బరిలోకి దిగనుండడం ఇదే మొదటిసారి. అందుకే అందరి దృష్టి వీరిపైనే ఉంది. 2024 సీజన్‌లో కోహ్లీ 741 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే రోహిత్ మాత్రం అంచనాలను అందుకోలేకపోయాడు. ఈసారి తన ట్రేడ్ మార్క్ షాట్లతో విరుచుకుపడి ముంబైకి అండగా నిలవాలనుకుంటున్నాడు. బహుశా హిట్‌మ్యాన్‌కు కూడా ఇదే చివరి ఐపీఎల్ కావచ్చనే భావనలో ఉన్నారు.

ఈసారి కొత్త కొత్తగా..

మారిన ఆటగాళ్లు, నిబంధనలు

ఐదు జట్లకు నూతన కెప్టెన్లు

మండు వేసవిలో భానుడి భగభగలతో అలసిపోయే అభిమానులు..ఆటగాళ్ల విన్యాసాలతో హాయిగా సేద తీరే సమయం వచ్చేసింది. టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ విజయ సంబరాలు ఇంకా సద్దుమణగక ముందే.. క్రికెట్ ప్రేమికులకు మరింత హుషారునిస్తూ ఇండియన్ ప్రీమియర్ లీగ్ దూసుకొచ్చింది. ప్రపంచ క్రికెట్‌ను సమ్మోహితం చేసే ఈ మెగా లీగ్ నేడే మొదలవనుంది.

కొత్త కెప్టెన్లు, మారిన ఆటగాళ్లు, నిబంధనలు.. ఇలాంటి అంశాలతో ఈసారి లీగ్ సరికొత్తగా ముస్తాబై మన ముందుకొచ్చింది. భారీ వేలంలో స్టార్ ఆటగాళ్లు ఫ్రాంచైజీలను మార్చగా, కొందరు కెప్టెన్లు పాత జట్లకు వీడ్కోలు పలికారు. చాంపియన్స్ ట్రోఫీలో కలిసికట్టుగా కదం తొక్కిన మన క్రికెటర్లు, ఇప్పుడు విడివిడిగా పోటీ పడనున్నారు. అయితేనేం.. బ్యాటర్లు, బౌలర్లు, ఫీల్డర్ల మెరుపులతో ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగే ప్రతీ మ్యాచ్‌ను ఆస్వాదించేందుకు అభిమానులంతా సిద్ధం కండి!

కోల్‌కతా: ఏళ్లుగా వన్నె తరగని ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌కు నేడు తెర లేవనుంది. దాదాపు రెండు నెలలపాటు ఉర్రూతలూగించే ఈ లీగ్ మే 25న ఫైనల్‌తో ముగుస్తుంది. పది జట్లు మొత్తంగా 74 మ్యాచ్‌లు ఆడబోతున్నాయి. శనివారం నాటి ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టుతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తలపడనుంది. గత సీజన్ల మాదిరిగా కాకుండా ఈసారి మాత్రం ఐపీఎల్ అభిమానులకు కాస్త విభిన్నంగా కనిపించనుంది. ఎందుకంటే.. కొన్నేళ్లుగా అలవాటు పడిన జట్లకు కాకుండా వేలం కారణంగా చాలా మంది ఇతర ఫ్రాంచైజీల తరఫున బరిలోకి దిగనున్నారు. అలాగే ఇప్పటికే కొనసాగుతున్న నిబంధనలకు తోడు మరికొన్నింటిని జత చేశారు. ముఖ్యంగా ఈ సీజన్ నుంచి బంతికి ఉమ్మి రాయడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడంతో పేసర్లు అత్యంత ప్రభావం చూపే అవకాశం ఉంది. మంచు ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అంపైర్ల అంగీకారంతో బంతిని మార్చే వెసులుబాటు కూడా ఉంది. అలాగే ఎత్తు వైడ్లు, ఆఫ్‌స్టంప్ ఆవల వైడ్లను తేల్చేందుకు డీఆర్ఎస్‌ను వినియోగించనున్నారు. ఈ మార్పులన్నీ కూడా మ్యాచ్‌లను రసవత్తరంగా మార్చేవే.

వరుణుడితో ఇబ్బందే..



అభిమానుల సందడి ఎలా ఉన్నా వారి ఉత్సాహంపై వరుణుడు నీళ్లుజల్లే అవకాశం ఉంది. వాతావరణ శాఖ కోల్‌కతా రీజియన్‌లో ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేయడమే ఇందుకు కారణం. దీంతో శనివారం కోల్‌కతా నైట్‌రైడర్స్-బెంగళూరు రాయల్ చాలెంజర్స్ ఆరంభ మ్యాచ్‌ను ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ఇబ్బందిపెట్టే అవకాశం ఉంది. శుక్రవారం కూడా ఇరు జట్లు ప్రాక్టీస్ సెషన్‌ను పూర్తి చేయలేకపోయాయి. అలాగే టాస్‌కు ముందు జరిగే ఆరంభ వేడుకలపైనా వర్షం ప్రభావం చూపనుంది. ఇక లీగ్ దశలో మ్యాచ్‌లకు అదనంగా గంటపాటు సమయం కేటాయిస్తారు. దీంతో ఐదు ఓవర్ల మ్యాచ్ అర్ధరాత్రి 12 గంటల్లోపు ముగియాలి. ఒక వేళ వర్షంతో మ్యాచ్ రద్దయితే చెరో పాయింట్‌ను ఇస్తారు.

కెప్టెన్ల మార్పుతో రాత మారేనా?


అక్షర్ పటేల్

ఎన్నడూ లేని విధంగా ఈసారి ఐపీఎల్‌లో తొమ్మిది జట్లకు స్వదేశీ ఆటగాళ్లే సారథులుగా ఉండబోతున్నారు. ఒక్క సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మాత్రమే విదేశీ కెప్టెన్‌గా ప్యాట్ కమిన్స్ కొనసాగుతున్నాడు. మరోవైపు ఐదు జట్లను కొత్త కెప్టెన్లు నడిపించబోతున్నారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఉన్నప్పటికీ ఆర్‌సీబీ రజత్ పటీదార్‌ను తమ నాయకుడిగా ఎంచుకుంది. తను ఇప్పటి వరకు భారత్ తరఫున ఈ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయకపోవడం గమనార్హం. అలాగే రాహుల్ అనాసక్తితో ఢిల్లీ క్యాపిటల్స్ సారథ్య బాధ్యతలను స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తీసుకున్నాడు. చివరి సీజన్‌లో కేకేఆర్‌ను విజేతగా నిలిపిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్.. ఈసారి తన జట్టు పంజాబ్ కింగ్స్ పవరేంటో చూపాలనుకుంటున్నాడు. మరోవైపు డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా పగ్గాలు అనూహ్యంగా అజింక్యా రహానెకు దక్కాయి. ఢిల్లీకి దూరమైన రిషభ్ పంత్.. సారథిగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రాత మార్చాలని పట్టుదలగా ఉన్నాడు. ఇక, తమ ఆరంభ మ్యాచ్‌ల్లో రాజస్థాన్ రాయల్స్‌కు రియాన్ పరాగ్, ముంబై ఇండియన్స్‌కు సూర్యకుమార్ నేతృత్వం వహిస్తుండడం విశేషం.


రజత్ పటీదార్

లఖ్‌నవూ తరఫున శార్దూల్!



వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ లఖ్‌నవూ తరఫున బరిలోకి దిగనున్నాడు. గాయపడిన పేసర్ మొహిసిన్ ఖాన్ స్థానంలో అతడిని తీసుకున్నారు. అయితే ఇప్పటికే జట్టు సన్నాహకాల్లో పాల్గొంటున్నప్పటికీ లఖ్‌నవూ జట్టు శార్దూల్ పేరును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. గత వేలంలో చెన్నై జట్టు అతడిని రిటైన్ చేసుకోలేదు. అయితే దేశవాళీల్లో శార్దూల్ తన ఆల్‌రౌండ్ ప్రతిభతో అదరగొట్టిన విషయం తెలిసిందే.

కేన్ కొత్త అవతారం

ఐపీఎల్ కామెంటేటర్‌గా విలియమ్సన్

44 మందితో జాబితా విడుదల



న్యూఢిల్లీ: ఈసారి ఐపీఎల్ వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ కొత్త అవతారంలో కనిపించనున్నాడు. గత సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఆడిన కేన్‌ను ఆ ఫ్రాంచైజీ రిటైన్ చేసుకోలేదు. దాంతో మెగా వేలం బరిలో నిలిచిన 34 ఏళ్ల విలియమ్సన్‌ను ఏ జట్టూ కొనుగోలు చేయలేదు. ఈనేపథ్యంలో వ్యాఖ్యాతగా మారాలని అతడు నిశ్చయించుకున్నాడు. శనివారం మొదలయ్యే ఐపీఎల్‌కు ఇంగ్లీష్, హిందీ భాషల వ్యాఖ్యాతల జాబితాను స్టార్ స్పోర్ట్స్ విడుదల జేసింది. ఇందులో కేన్ విలియమ్సన్ కామెంటేటర్‌గా మెగా లీగ్‌లో కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. అలాగే సుదీర్ఘకాలం ఐసీసీ ప్యానెల్ అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన 60 ఏళ్ల అనిల్ చౌదరి ఇటీవల రిటైర్ అయ్యాడు. అతడు హిందీ వ్యాఖ్యాతగా కెరీర్ ప్రారంభించనున్నాడు. ఇంగ్లీష్‌లో 27 మంది, హిందీలో 17 మంది మాజీలు తమ కామెంట్రీతో అలరించనున్నారు. గవాస్కర్, రవిశాస్త్రి, సంజయ్ మంజ్రేకర్, దీప్‌దాస్ గుప్తా రెండు భాషల్లోనూ వ్యాఖ్యానం చేస్తారు.

ప్రారంభోత్సవానికి అదిరే ఏర్పాట్లు: ఐపీఎల్ ప్రారంభ కార్యక్రమానికి బీసీసీఐ విస్తృత ఏర్పాట్లు చేసింది. టాస్ వేయడానికి గంట ముందు.. అంటే సాయంత్రం 6 గంటలకు ఈడెన్ గార్డెన్స్‌లో ఆరంభోత్సవాన్ని నిర్వహించనున్నట్టు బెంగాల్ క్రికెట్ సంఘం చీఫ్ స్నేహాశీష్ గంగూలీ వెల్లడించాడు. 35 నిమిషాల పాటు సాగే వేడుకల్లో ప్రఖ్యాత గాయని శ్రేయా ఘోషల్, పంజాబ్ గాయకుడు కరణ్ అహూజా తమ పాటలతో ఉర్రూతలూగించనున్నారు. బాలీవుడ్ అందాల భామ దిశా పటాని తన నృత్యంతో ప్రేక్షకులను సమ్మోహితులను చేయనుంది.

షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థులు	వేదిక	సమయం
మార్చి 22	కోల్‌కతా x బెంగళూరు	కోల్‌కతా	రా.7.30
మార్చి 23	హైదరాబాద్ x రాజస్థాన్	హైదరాబాద్	మ.3.30
మార్చి 23	చెన్నై x ముంబై	చెన్నై	రా.7.30
మార్చి 24	ఢిల్లీ x లఖ్‌నవూ	విశాఖపట్నం	రా.7.30
మార్చి 25	గుజరాత్ x పంజాబ్	అహ్మదాబాద్	రా.7.30
మార్చి 26	రాజస్థాన్ x కోల్‌కతా	గువాహటి	రా.7.30
మార్చి 27	హైదరాబాద్ x లఖ్‌నవూ	హైదరాబాద్	రా.7.30
మార్చి 28	చెన్నై x బెంగళూరు	చెన్నై	రా.7.30
మార్చి 29	గుజరాత్ x ముంబై	అహ్మదాబాద్	రా.7.30
మార్చి 30	ఢిల్లీ x హైదరాబాద్	విశాఖపట్నం	మ.3.30
మార్చి 30	రాజస్థాన్ x చెన్నై	గువాహటి	రా.7.30
మార్చి 31	ముంబై x కోల్‌కతా	ముంబై	రా.7.30
ఏప్రిల్ 1	లఖ్‌నవూ x పంజాబ్	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 2	బెంగళూరు x గుజరాత్	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 3	కోల్‌కతా x హైదరాబాద్	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 4	లఖ్‌నవూ x ముంబై	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 5	చెన్నై x ఢిల్లీ	చెన్నై	మ.3.30
ఏప్రిల్ 5	పంజాబ్ x రాజస్థాన్	చండీగఢ్	రా.7.30
ఏప్రిల్ 6	కోల్‌కతా x లఖ్‌నవూ	గువాహటి	మ.3.30
ఏప్రిల్ 6	హైదరాబాద్ x గుజరాత్	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 7	ముంబై x బెంగళూరు	ముంబై	రా.7.30
ఏప్రిల్ 8	పంజాబ్ x చెన్నై	చండీగఢ్	రా.7.30
ఏప్రిల్ 9	గుజరాత్ x రాజస్థాన్	అహ్మదాబాద్	రా.7.30
ఏప్రిల్ 10	బెంగళూరు x ఢిల్లీ	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 11	చెన్నై x కోల్‌కతా	చెన్నై	రా.7.30
ఏప్రిల్ 12	లఖ్‌నవూ x గుజరాత్	లఖ్‌నవూ	మ.3.30
ఏప్రిల్ 12	హైదరాబాద్ x పంజాబ్	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 13	రాజస్థాన్ x బెంగళూరు	జైపూర్	మ.3.30
ఏప్రిల్ 13	ఢిల్లీ x ముంబై	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 14	లఖ్‌నవూ x చెన్నై	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 15	పంజాబ్ x కోల్‌కతా	చండీగఢ్	రా.7.30
ఏప్రిల్ 16	ఢిల్లీ x రాజస్థాన్	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 17	ముంబై x హైదరాబాద్	ముంబై	రా.7.30
ఏప్రిల్ 18	బెంగళూరు x పంజాబ్	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 19	గుజరాత్ x ఢిల్లీ	అహ్మదాబాద్	మ.3.30
ఏప్రిల్ 19	రాజస్థాన్ x లఖ్‌నవూ	జైపూర్	రా.7.30
ఏప్రిల్ 20	పంజాబ్ x బెంగళూరు	చండీగఢ్	మ.3.30
ఏప్రిల్ 20	ముంబై x చెన్నై	ముంబై	రా.7.30
ఏప్రిల్ 21	కోల్‌కతా x గుజరాత్	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 22	లఖ్‌నవూ x ఢిల్లీ	లఖ్‌నవూ	రా.7.30
ఏప్రిల్ 23	హైదరాబాద్ x ముంబై	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 24	బెంగళూరు x రాజస్థాన్	బెంగళూరు	రా.7.30
ఏప్రిల్ 25	చెన్నై x హైదరాబాద్	చెన్నై	రా.7.30
ఏప్రిల్ 26	కోల్‌కతా x పంజాబ్	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 27	ముంబై x లఖ్‌నవూ	ముంబై	మ.3.30
ఏప్రిల్ 27	ఢిల్లీ x బెంగళూరు	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 28	రాజస్థాన్ x గుజరాత్	జైపూర్	రా.7.30
ఏప్రిల్ 29	ఢిల్లీ x కోల్‌కతా	ఢిల్లీ	రా.7.30
ఏప్రిల్ 30	చెన్నై x పంజాబ్	చెన్నై	రా.7.30
మే 1	రాజస్థాన్ x ముంబై	జైపూర్	రా.7.30
మే 2	గుజరాత్ x హైదరాబాద్	అహ్మదాబాద్	రా.7.30
మే 3	బెంగళూరు x చెన్నై	బెంగళూరు	రా.7.30
మే 4	కోల్‌కతా x రాజస్థాన్	కోల్‌కతా	మ.3.30
మే 4	పంజాబ్ x లఖ్‌నవూ	ధర్మశాల	రా.7.30
మే 5	హైదరాబాద్ x ఢిల్లీ	హైదరాబాద్	రా.7.30
మే 6	ముంబై x గుజరాత్	ముంబై	రా.7.30
మే 7	కోల్‌కతా x చెన్నై	కోల్‌కతా	రా.7.30
మే 8	పంజాబ్ x ఢిల్లీ	ధర్మశాల	రా.7.30
మే 9	లఖ్‌నవూ x బెంగళూరు	లఖ్‌నవూ	రా.7.30
మే 10	హైదరాబాద్ x కోల్‌కతా	హైదరాబాద్	రా.7.30
మే 11	పంజాబ్ x ముంబై	ధర్మశాల	మ.3.30
మే 11	ఢిల్లీ x గుజరాత్	ఢిల్లీ	రా.7.30
మే 12	చెన్నై x రాజస్థాన్	చెన్నై	రా.7.30
మే 13	బెంగళూరు x హైదరాబాద్	బెంగళూరు	రా.7.30
మే 14	గుజరాత్ x లఖ్‌నవూ	అహ్మదాబాద్	రా.7.30
మే 15	ముంబై x ఢిల్లీ	ముంబై	రా.7.30
మే 16	రాజస్థాన్ x పంజాబ్	జైపూర్	రా.7.30
మే 17	బెంగళూరు x కోల్‌కతా	బెంగళూరు	రా.7.30
మే 18	గుజరాత్ x చెన్నై	అహ్మదాబాద్	మ.3.30
మే 18	లఖ్‌నవూ x హైదరాబాద్	లఖ్‌నవూ	రా.7.30
మే 20	క్వాలిఫయర్-1	హైదరాబాద్	రా.7.30
మే 21	ఎలిమినేటర్	హైదరాబాద్	రా.7.30
మే 23	క్వాలిఫయర్-2	కోల్‌కతా	రా.7.30
మే 25	ఫైనల్	కోల్‌కతా	రా.7.30

సెమీస్‌కు గాయత్రి జోడీ



రెండో ర్యాంకర్‌కు శంకర్ షాక్ ● స్విస్ ఓపెన్

బాసెల్ (స్విట్జర్లాండ్): డబుల్స్ స్టార్ జోడీ పుల్లెల గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళుతోంది. ఈ ఏస్ జంట మహిళల డబుల్స్‌లో సెమీఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 4వ సీడ్ గాయత్రి/ట్రీసా ద్వయం 21-18, 21-14తో హాంకాంగ్ జంట యంగ్ గా టింగ్/యంగ్ పూ లామ్‌పై గెలిచింది. ఫైనల్లో చోటుకోసం చైనాకు చెందిన టాప్‌సీడ్ ద్వయం లూ షెంగ్ షు/టాన్ నింగ్‌తో గాయత్రి జోడీ తలపడనుంది. ఇక, పురుషుల సింగిల్స్‌లో భారత యువ షట్లర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ తన కెరీర్‌లోనే తొలిసారిగా సంచలనాత్మక ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల శంకర్ 18-21, 21-12, 21-5తో మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ పతక విజేత, ఆంటోన్సెన్ (డెన్మార్క్)ను కంగుతినిపించి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గంటకుపైగా సాగిన హోరాహోరీ పోరులో ఆరంభ గేమ్‌ను కోల్పోయిన శంకర్.. అద్భుతంగా పుంజుకొని తర్వాతి రెండు గేముల్లో ప్రత్యర్థిని చిత్తుగా ఓడించాడు. సెమీఫైనల్ బెర్త్ కోసం ఫ్రాన్స్‌కు చెందిన 31వ ర్యాంకర్ క్రిస్టో పొపోవ్‌తో శంకర్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక, మిక్స్‌డ్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భారత జోడీ ఆద్య/సతీశ్14-21, 16-21తో చైనీస్ తైపీ జంట లూ కువాంగ్ హెంగ్/జెంగ్ యూ చీ చేతిలో ఓటమిపాలై ఇంటిబాట పట్టింది.

చాలెంజర్ ట్రోఫీకి ఏడుగురు తెలుగోళ్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల చాలెంజర్ ట్రోఫీకి ఏడుగురు తెలుగు క్రికెటర్లు ఎంపికయ్యారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 8 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే ఈ టోర్నీలో పోటీపడే నాలుగు జట్లను బీసీసీఐ ప్రకటించింది. ఆంధ్ర నుంచి శరణ్య (టీమ్-డి), ఎండీ షబ్నం (టీమ్-సి), శ్రీచరణి (టీమ్-బి), హెన్రీటా, పావని (టీమ్-ఎ), తెలంగాణ నుంచి జి.త్రిష (టీమ్-డి), మమత (టీమ్-బి)కు చోటు దక్కింది.

ఖేలో ఇండియాలో ఆంధ్ర పాంచ్ పటాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా పారా క్రీడల్లో తొలిరోజు ఆంధ్ర అథ్లెట్లు 5 పతకాలు కొల్లగొట్టగా, తెలంగాణకు ఒక పతకం లభించింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో రవి (అనకాపల్లి) షాట్‌పుట్‌లో, రవణి (విశాఖపట్నం) 100 మీటర్ల రేసులో చెరో స్వర్ణం.. భవాని (నెల్లూరు) 100 పరుగులో, స్వరాజ్ (శ్రీకాకుళం) 100 మీటర్ల రేసులో చెరో రజతం.. బాబు (అనంతపురం) వీల్‌చైర్ షాట్‌పుట్‌లో రజతం సాధించారు. తెలంగాణ అథ్లెట్ శిరీష 100 మీటర్లలో రజతం నెగ్గింది.

హసన్ రికార్డు సెంచరీ

మూడో టీ20లో పాక్ గెలుపు



ఆక్లాండ్: తొలి రెండు టీ20లలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్ కీలకమైన మూడో మ్యాచ్‌లో దుమ్మురేపింది. ఓపెనర్ హసన్ నవాజ్ (45 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్స్‌లతో 105 నాటౌట్) రికార్డు సెంచరీతో కదం తొక్కడంతో..శుక్రవారం జరిగిన మూడో టీ20లో పాకిస్థాన్ తొమ్మిది వికెట్లతో నెగ్గింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆశలను సజీవంగా ఉంచుకుంది. తొలుత న్యూజిలాండ్ 19.5 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. చాప్‌మన్ (94), బ్రేస్‌వెల్ (31) సత్తా చాటారు. రౌఫ్ మూడు, అబ్బాస్ అఫ్రీది, షహీన్ షా అఫ్రీది, అబ్రార్ అహ్మద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో హసన్‌తోపాటు కెప్టెన్ సల్మాన్ ఆఘా (51 నాటౌట్), మరో ఓపెనర్ మహ్మద్ హారిస్ (41) చెలరేగడంతో పాకిస్థాన్ 16 ఓవర్లలోనే 207/1 స్కోరు చేసి ఘన విజయాన్నందుకుంది. హసన్ 44 బంతుల్లో మూడంకెల మార్క్ చేరడం ద్వారా పొట్టి ఫార్మాట్ వేగవంతమైన సెంచరీ చేసిన పాకిస్థాన్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు.

చౌకబారు ప్రకటనల్లో నటించొద్దు!

- కాసుల కోసం కక్కుర్తి పడకండి
- బెట్టింగ్ యాప్‌లకు ఎంతో మంది బలయ్యారు
- గతంలో చిరంజీవికి వద్దని చెబితే మానేశాడు
- హీరో అంటే అలా ఉండాలి: సీపీఐ నారాయణ

న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యువతను నాశనం చేసే బెట్టింగ్ యాప్‌లు, సమాజాన్ని చెడగొట్టే వాణిజ్య ప్రకటనలను సినీనటులు ప్రోత్సహించవద్దని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. డబ్బుల కోసం కక్కుర్తి పడి చౌకబారు ప్రకటనల్లో నటించవద్దని హితవు పలికారు. తెలియక చేశామని, చట్ట పరంగా అవకాశం ఉన్నందున చేశామని కొంత మంది చెప్పడాన్ని తప్పుపట్టారు. సినిమా వాళ్లను ఎక్కువ మంది అనుసరిస్తూ ఉంటారని గుర్తుచేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. బెట్టింగ్ యాప్‌లు, గుట్కాల వంటి ప్రకటనలు యువతపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చిరంజీవి ఒక కూల్ డ్రింక్ ప్రకటనలో నటిస్తే తాను వద్దని వారించానని, ఆపకపోతే ధర్నా చేస్తానని హెచ్చరించానని తెలిపారు. ఓ వైపు రక్తదానం చేస్తూ, మరోవైపు రక్తాన్ని దెబ్బతీసే డ్రింక్‌లను ఎలా ప్రోత్సహిస్తారని అడిగినట్లు చెప్పారు. కాంట్రాక్టు గడువు ముగిసిన తర్వాత ఆయన మళ్లీ ఆ ప్రకటన చేయలేదన్నారు. ఎంత డబ్బులిస్తామన్నా ఆయన అంగీకరించలేదని, హీరో అంటే అలా ఉండాలని నారాయణ పేర్కొన్నారు. గుట్కా ఆహారంలో భాగమేనని ఓ తీర్పు వచ్చిందని, దాన్ని ఆసరాగా చేసుకుని పాన్ పరాగ్ పేరుతో ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. సినిమాలు, సీరియళ్లు, వెబ్ సిరీస్‌లు, ఓటీటీ.. ఇలా ఎన్నో రకాల అవకాశాలు ఉన్నాయని, వాటిని వదిలేసి పాడు సంపాదన ఎందుకని ప్రశ్నించారు. ఇకనైనా చౌకబారు ప్రకటనలు చేయొద్దని సూచించారు. ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. సినిమా వాళ్లు చెబుతున్నారని ప్రజలు ప్రభావితం కావొద్దని, ఆలోచనతో వ్యవహరించాలని సూచించారు.

'బెట్టింగ్ యాప్' నిందితులకు 24 గంటల్లో నోటీసులు!

- సినీ, టీవీ ప్రముఖులకు ఇచ్చేందుకు రంగం సిద్ధం
- ఇప్పటికే పంజాగుట్టలో నమోదైన కేసులో 11 మందికి జారీ.. విచారణకు హాజరైన నలుగురు
- కేసును కొట్టేయాలంటూ హైకోర్టుకు యాంకర్ శ్యామల..
- 24న విచారణకు హాజరై సహకరించాలన్న ధర్మాసనం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో 25 మంది ప్రముఖ సినీ, టీవీ నటులు, యూట్యూబర్లపై కేసులు నమోదైన నేపథ్యంలో వారికి మరో 24 గంటల్లో నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. అంతకుముందు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసులో 11 మంది ఉండగా.. వారిలో 8 మంది మియాపూర్ కేసులోని వారేనని పోలీసులు తెలిపారు. అయితే మియాపూర్ కేసులో పలువురు సినీ ప్రముఖులు ఉండటంతో అన్ని న్యాయపరమైన అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. సినీ నటులతో బెట్టింగ్ యాప్‌ల అగ్రిమెంట్లపై ఇప్పటికే దాదాపు 15 బెట్టింగ్ యాప్ సంస్థలను గుర్తించారు. రెండు చోట్ల కేసుల నమోదైన వారి విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై కూడా పోలీసులు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారు. ఈ కేసులో బాధితుల వివరాలతో పాటు ఫణీంద్రశర్మ తన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పరిశీలించి దానికి సంబంధించిన ఆధారాలను సైతం సేకరిస్తున్నట్లు తెలిసింది. ఇక పంజాగుట్ట పీఎస్‌లో కేసులు నమోదైన నిందితులకు ఇప్పటికే విచారణకు హాజరు కావాలంటూ నోటీసులిచ్చారు. ఇప్పటివరకు టేస్టీ తేజ, కానిస్టేబుల్ కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, రీతూ చౌదరి విచారణకు హాజరయ్యారు. మిగతావారు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వారికి సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

24న పోలీసుల విచారణకు హాజరు కండి..: హైకోర్టు

బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంలో పోలీసులు చేపట్టే దర్యాప్తునకు సహకరించాలని.. ఈనెల 24న దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని యాంకర్ శ్యామలకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బెట్టింగ్ యాప్‌ల కేసుతో తనకెలాంటి సంబంధం లేదని.. పంజాగుట్ట పోలీసులు తనపై నమోదు చేసిన కేసు కొట్టేయాలని పేర్కొంటూ ఆమె హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. తప్పుడు ఆరోపణలతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు పెట్టారన్నారు. నోటీసు ఇచ్చినప్పటికీ విచారణకు హాజరు కాలేదని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్‌కు బీఎన్ఎస్ఎస్ 35 (సీఆర్పీసీ 41ఏ) నోటీసు ఇవ్వాలని పోలీసులకు తెలిపింది. ఈ మేరకు పిటిషనర్ సోమవారం పోలీసుల ఎదుట హాజరై.. దర్యాప్తుకు సహకరించాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీచేసింది.

108 అక్రమ బెట్టింగ్ యాప్‌ల బ్లాక్..

రాష్ట్రంలో బెట్టింగ్‌పై నిషేధమున్న నేపథ్యంలో తమకు అందిన ఫిర్యాదుల మేరకు 108 అక్రమ బెట్టింగ్ యాప్‌లను బ్లాక్ చేశామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షిఖా గోయల్ శుక్రవారం తెలిపారు. అలాగే ఇక్కడి వారికి లాగిన్ యాక్సెస్ ఇస్తున్న 133 భారత బెట్టింగ్ కంపెనీలకు నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. బెట్టింగ్ వెబ్‌సైట్లను అడ్డుకోవడానికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కృషి చేస్తోందని, అయితే ఇందులో చాలావరకు విదేశాల పరిధిలో ఉంటున్నాయని వివరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రోత్సహించినా, పాల్గొన్నా కూడా తెలంగాణ గేమింగ్ చట్టం 2017 ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి..


సాయితేజ (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలయ్యాడు. మూడు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అతడు.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన కొరవేన సాయితేజ (26) గోదావరిఖనిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన సాయితేజ రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే మానసికంగా కుంగిపోయిన అతడు.. ఈనెల 18న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్నేహితుడికి చెప్పడంతో వెంటనే గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సాయితేజ ఆరేళ్ల కింద ప్రేమ వివాహం చేసుకోగా కుమారుడు, కుమార్తె ఉన్నారు.


రాజన్న సిరిసిల్ల జిల్లా మామిడిపల్లిలో పంటను పరిశీలిస్తున్న జర్మనీ బృందం

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తెలంగాణ ప్రాధాన్యం

» జర్మనీ బృందంతో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సిరిసిల్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధను వ్యవసాయానికి అనుసంధానం చేసి, సాగును మరింత లాభసాటిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. జర్మనీ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఫెడరల్ మినిస్ట్రీ ఏషియా హెడ్ రెబెకా రిడ్డర్ ఆధ్వర్యంలో జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులు. మంత్రి శ్రీధర్‌బాబును అసెంబ్లీలో శుక్రవారం కలిశారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రంగాల పరిశ్రమలను అనుసంధానించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా వివరించారు. మరోపక్క, జర్మనీకి చెందిన అంతర్జాతీయ వ్యవసాయ సహకార సంస్థ ఐఏకె అగ్రార్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ స్వేన్ గెల్హార్ నేతృత్వంలోని బృందం సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)ను శుక్రవారం సందర్శించింది. అలాగే, కోనరావుపేట మండలం మామిడిపల్లి, రామన్నపేట, శ్రీరాములపల్లె గ్రామాల్లో పర్యటించిన బృందం పలువురు రైతులతో మాట్లాడింది. సిరిసిల్లలోని 220 కేవీ విద్యుత్ స్టేషన్‌ను పరిశీలించింది.

తాగునీటి సరఫరాలో ఇబ్బందుల్లేవ్: సీతక్క

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో తాగునీటి సమస్యలంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, కొందరి రాజకీయ ప్రయోజనం కోసం కొన్ని మీడియా సంస్థలు తప్పుడు కథనాలతో అందరినీ అయోమయానికి గురిచేస్తున్నాయని మంత్రి సీతక్క ఆరోపించారు. రిజర్వాయర్లలో తగినంత నీటినిల్వలు ఉన్నాయని, గతంలో తాగునీరందని గ్రామాలకూ సరఫరా చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి పరిస్థితులపై శుక్రవారం మిషన్ భగీరథ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. తాగునీటి సరఫరాపై రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా తప్పుడు ప్రచారం చేస్తే తిప్పికొట్టాలని, ఇబ్బందులుంటే తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

26న 9 మంది ఎమ్మెల్సీలకు సన్మానం!

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల్లో పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్న 9 మంది ఎమ్మెల్సీలను ఈ నెల 26న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సన్మానించనున్నారు. ఆ రోజున సభ వాయిదా పడిన అనంతరం సాయంత్రం 7 గంటలకు మండలి ఆవరణలో ఈ సన్మాన కార్యక్రమం జరగనుంది. ఈ నెల 29తో ఎమ్మెల్సీలుగా తమ పదవీ కాలాన్ని పూర్తిచేసుకోనున్న జీవన్‌రెడ్డి, మహమూద్ అలీ, ఎగ్గె మల్లేశం, సత్యవతిరాథోడ్, షేరి సుభాష్‌రెడ్డి, మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ, అలుగుబెల్లి నర్సిరెడ్డి, కూర రఘోత్తమ్‌రెడ్డి పదవీ కాలం ముగియనున్న సంగతి తెలిసిందే. అలాగే మే నెలలో ఎంఎస్ ప్రభాకర్‌రావు పదవీ కాలమూ ముగియనుంది. వీరి గౌరవార్థం.. సన్మానాన్ని మండలి చైర్మన్ ఏర్పాటు చేశారు.

సకల హంగులతో ఢిల్లీలో తెలంగాణ భవన్

» ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి చాటి చెప్పేలా, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా, సకల హంగులతో దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ భవన్ నూతన భవనం ఉంటుందని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి అన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం నూతన భవన నిర్మాణం చేపడుతుందని చెప్పారు. తెలంగాణ భవన్ నిర్మాణానికి సంబంధించి పటౌడీ హౌస్, నర్సింగ్ హాస్టల్, గోదావరి బ్లాక్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు.

నిమ్స్‌లో స్పైనల్ ఎండోస్కోపీ బ్లాక్

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలోని మూడో అంతస్థులో స్పైనల్ ఎండోస్కోపీ కోసం ప్రత్యేక బ్లాక్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ బ్లాక్‌లో ఏడాదికి దాదాపు 3,500 వెన్నెముక శస్త్రచికిత్సలను నిర్వహించవచ్చని వైద్యులు వివరించారు. స్పైనల్ ఎండోస్కోపీ ఆపరేషన్‌కు ప్రైవేట్ ఆస్పత్రుల్లో 5 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని, నిమ్స్‌లో స్పైనల్ ఎండోస్కోపీ బ్లాక్‌తో రోగులు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందవచ్చునని చెప్పారు. స్పైనల్ ఎండోస్కోపీకి సంబంధించిన యంత్రపరికరాలను బీహెచ్ఈఎల్-జీఈ గ్యాస్ టర్బైన్ సర్వీసెస్ సంస్థ సమకూర్చగా రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సన్‌రైజ్, రోటరీ సన్‌రైజ్ సర్వీస్ ట్రస్టు సహకారం అందించాయి.

40 లక్షల ఎకరాల్లో సాగు పెరిగింది: చామల

న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 40 లక్షల ఎకరాల్లో పంటల సాగు పెరిగిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అనతికాలంలో సాగులో గణనీయమైన వృద్ధిని సాధించినట్టు చెప్పారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో సాగుకు కేవలం 3.8 శాతమే కేటాయిస్తున్నారని ఆయన అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు బడ్జెట్ తగ్గించారన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో 20శాతం నిధులు రైతుల కోసమే ప్రకటించామని చెప్పారు.

దేవాదుల పంప్‌హౌస్ టెస్ట్ రన్ విజయవంతం

» నేడు ట్రయల్ రన్ నిర్వహణ

హనుమకొండ టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దేవాదుల ఫేజ్-3 టెస్ట్ రన్ విజయవంతమైంది. శనివారం ట్రయల్ రన్ నిర్వహించనున్నట్టు నీటిపారుదలశాఖ ఇంజనీర్లు తెలిపారు. మోటార్ల టెస్ట్‌రన్ కోసం ఆస్ట్రియా నుంచి ప్రత్యేకంగా టెక్నీషియన్లు వచ్చారు. వారు మోటార్లలో సాంకేతిక లోపాలను సవరించారు. అనంతరం చేపట్టిన టెస్ట్ రన్ ఫలించింది. ఈ నెల 18న దేవాదుల పంప్‌హౌస్ వద్ద మోటార్ల ట్రయల్ రన్‌ను ప్రారంభించేందుకు మంత్రులు వచ్చినా చివరి నిమిషంలో మోటార్లు పని చేయక మొరాయించాయి. ఆస్ట్రియా ఇంజనీర్లబృందం 4రోజులు శ్రమించి మోటార్లలో లోపాలను సరిచేశారు.

నడవలేని సాక్షి వద్దకే కదిలొచ్చిన న్యాయాధికారి

» కాలు విరగడంతో కోర్టులోకి వెళ్లేందుకు ఇబ్బందిపడ్డ వ్యక్తి

» ఆటో వద్దకే వచ్చి వివరాలు సేకరించిన మేజిస్ట్రేట్



ఖానాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సాక్ష్యం చెప్పేందుకు వచ్చి నడవలేని స్థితిలో ఉన్న ఓ సాక్షి నుంచి వివరాలు సేకరించేందుకు స్వయంగా న్యాయాధికారే కదిలొచ్చిన ఘటన నిర్మల్ జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని ఖానాపూర్ కోర్టులో శుక్రవారం ఓ కేసు విచారణ సాగుతోంది. ఆ సమయంలో సాక్షిని కోర్టులో ప్రవేశపెట్టాల్సిన సమయం వచ్చింది. సాక్ష్యం చెప్పేందుకు కిషన్ అనే వ్యక్తి కోర్టు వద్దకు ఆటోలో వచ్చాడు. ఇటీవల అతని కాలు విరగడంతో నడవలేని స్థితిలో అందులోనే ఉండిపోయాడు. దీంతో సాక్షి నుంచి వివరాలు సేకరించేందుకు న్యాయాధికారి జితిన్‌కుమార్ ఆటో వద్దకు వచ్చారు. కోర్టు ఆవరణలో ఆటోవద్ద కూర్చుని కిషన్ నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సీఎం రేవంత్‌తో హరీశ్‌రావు భేటీ

» పద్మారావుగౌడ్‌తో కలిసి సీఎం చాంబర్‌కు..

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల సందర్భంగా శుక్రవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అగ్రనేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ భేటీలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కూడా పాల్గొన్నారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్ ఇందుకు వేదికైంది. దాదాపు అరగంటపాటు వీరి భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది. అయితే సికింద్రాబాద్ నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం పద్మారావు పిలిస్తే తాను వెళ్లానని సీఎంతో భేటీ అనంతరం మీడియాతో హరీశ్‌రావు అన్నారు. కాగా, సీఎం చాంబర్ నిండా విజిటర్లు ఉండడంతో 15 నిమిషాలు తామేమీ మాట్లాడలేక పోయామని పద్మారావుగౌడ్ తెలిపారు. భేటీ సందర్భంగా తన నియోజకవర్గంలో కేసీఆర్ మంజూరు చేసిన హైస్కూలు, కాలేజీ పనులను వెంటనే ప్రారంభించాలని కోరామన్నారు. ఇదిలా ఉండగా.. నియోజకవర్గాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేల విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబసమేతంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో కలిశారు. అయితే తమ మెడికల్ కాలేజీ సీట్ల పెంపు కోసమే తాము సీఎంను కలిశామని మల్లారెడ్డి అల్లుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మీడియాతో అన్నారు.



సూర్యాపేట జిల్లా నేతలతో కేసీఆర్ భేటీ

హైదరాబాద్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్ల పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో శుక్రవారం సూర్యాపేట జిల్లా ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎర్రవెల్లిలోని తన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణ, వరంగల్‌లో చేపట్టనున్న భారీ బహిరంగ సభ, ఇతర అంశాలపై ఆయన మాట్లాడారు. పార్టీ రజతోత్సవాలను విజయవంతం చేసేందుకు గులాబీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ముఖ్య నాయకులతో త్వరలోనే సమావేశం కానున్నట్లు కేసీఆర్ వెల్లడించారు. సమావేశంలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గ్యాదరి కిషోర్‌కుమార్, సునీతా మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నై అఖిలపక్ష భేటీకి సీఎం రేవంత్

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై స్టాలిన్ అధ్యక్షతన నేడు సమావేశం

» జేఏసీలో కాంగ్రెస్‌తో కలిసి బీఆర్ఎస్!

» చెన్నై చేరిన కేటీఆర్ బృందం



హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చెన్నైలో తలపెట్టిన అఖిలపక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం సాయంత్రమే ఆయన చెన్నైకి బయలుదేరి వెళ్లారు. ఆయనతో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా వెళ్లారు. స్టాలిన్ ఆధ్యక్షతన జరిగే అఖిలపక్ష భేటీలో వీరిద్దరూ పాల్గొంటారు. ప్రభుత్వం తరపున సీఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా మహేశ్ గౌడ్ పాల్గొననున్నారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అన్నది సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టేనంటూ ప్రకటించిన స్టాలిన్.. ఆ ప్రతిపాదనకు వ్యతిరేకంగా పోరాడేందుకు జేఏసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. చెన్నైలో జరిగే అఖిలపక్ష సమావేశంలో జేఏసీ ప్రతిపాదనను తెరపైకి తేనున్నారు. స్టాలిన్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సైతం ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. స్టాలిన్ ప్రతిపాదించే జేఏసీలో కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ కూడా భాగస్వామిగా చేరితే.. ఈ అంశంపై ఇరు పార్టీలూ కలిసి పోరాట కార్యాచరణలో భాగస్వాములు కావాల్సి ఉంటుంది. అదే జరిగితే రాష్ట్రంలో బద్ధశత్రువుల్లా వ్యవహరిస్తున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు.. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మాత్రం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనం కోసం కలిసి పోరాటం చేయాల్సి వస్తుంది.

చెన్నై భేటీకి కేటీఆర్ బృందం

చెన్నై అఖిలపక్ష భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారు. ఇందుకోసం కేటీఆర్‌తో పాటు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు శుక్రవారం చెన్నై బయల్దేరి వెళ్లారు. ప్రస్తుత నియోజకవర్గాల పునర్విభజన విధానం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని బలహీనపరుస్తుందని, ఫలితంగా దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని కేటీఆర్ అన్నారు. ఈ విధానాన్ని బీఆర్ఎస్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోందన్నారు. చెన్నైలో సమావేశం తర్వాత దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, దేశ ప్రగతికి బాటలు వేసిన ఈ ప్రాంత ప్రజల భవిష్యత్తు కోసం కలిసి నిలబడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అఖిలపక్ష భేటీ ముగిసిన తర్వాత కేటీఆర్ మాజీ గవర్నర్ నరసింహన్ ఇంటికి వెళ్లనున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి.

కొత్తపరిశ్రమలు కావాలని కేంద్రాన్ని అడగరా?

'రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు కావాలని అడగరు.. ఉన్న పరిశ్రమలను తరలిస్తుంటే అడ్డుకోరు. తెలంగాణ ప్రయోజనాలు మీకు పట్టవా?' అని కాంగ్రెస్, బీజేపీ ఎంపీలను కేటీఆర్ ప్రశ్నించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమను పెట్టే ఆలోచన లేని కేంద్రం.. ఆదిలాబాద్‌లోని సీసీఐ ఫ్యాక్టరీని వేలానికి పెడుతోందని ఎక్స్‌లో ఆరోపించారు. కూల్చే పనిలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, తూకానికి అమ్మే పనిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నాయన్నారు.

తక్కువ వడ్డీకి రుణాలివ్వండి!

» నాబార్డు చైర్మన్‌ను కోరిన సీఎం

గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్) కింద తక్కువ వడ్డీకి రుణాలు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి నాబార్డు చైర్మన్ కేవీ షాజీని కోరారు. సూక్ష్మ నీటి పారుదల రంగానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారమిక్కడ సీఎం రేవంత్‌రెడ్డితో షాజీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సహకార సంఘాలను బలోపేతం చేయాలని, కొత్తగా మరికొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను ఏర్పాటు చేయాలని నాబార్డు చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళల కోసం ప్రత్యేక పథకానికి రూపకల్పన చేయాలన్నారు. ఐకేపీ, గోదాములు, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి.. రాష్ట్రంలో మిల్లింగ్ సామర్థ్యం పెంచేందుకు సహకరించాలని సీఎం కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు పథకాల నిధులు మార్చి 31లోగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువగా నాబార్డు పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్ల నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని రేవంత్ సూచించారు. కొత్త పంచాయతీలకు అనుసంధానం పెంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాల్లో కొన్ని డీసీసీబీలను ఏర్పాటు చేయాలని సీఎంని షాజీ కోరారు. వ్యవసాయ, నీటిపారుదల, తాగునీటి సరఫరా, పాడిపరిశ్రమ అభివృద్ధి, ఆయిల్‌పామ్, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఉన్నత విద్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పశు వైద్య కళాశాలల, పంట ఉత్పత్తుల సేకరణకు నాబార్డు సాయం చేస్తోందని షాజీ వెల్లడించారు.

ఇసుకతో రూ.7 వేల కోట్లు దోచుకున్న కేసీఆర్ కుటుంబం

» పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో వచ్చిన రాబడి రూ.5,966 కోట్లే

» కాంగ్రెస్ వచ్చిన 16 నెలల్లోనే రూ.1,000 కోట్ల ఆదాయం

» త్వరలో మరో మూడు ఇసుక బజార్లు

» టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమాల ద్వారా కేసీఆర్ కుటుంబం రూ.7,000 కోట్లు దోచుకుందని టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్ ఆరోపించారు. టీజీఎండీసీ కార్యాలయంలో శుక్రవారం ఎండీ సుశీల్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో వేబిల్లులు, వేబ్రిడ్జీలు, వాహన తనిఖీలు లేకుండా ఇసుకను మొత్తం వక్రమార్గం పట్టించారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబంతో పాటు కవిత బంధువులు కలిసి రూ.7,000 కోట్లు లూటీ చేశారన్నారు. అప్పట్లో ఇసుక టన్ను ధర రూ.2,500 నుంచి రూ.3,000 వరకు పలికేదని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్లకాలంలో ఇసుక ద్వారా రూ.5,966.11 కోట్ల రాబడి వస్తే... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో రూ.1,000 కోట్ల వరకు ఆదాయాన్ని సాధించామన్నారు. తమ ప్రభుత్వం రీచ్‌లు, స్టాక్ యార్డుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, వాహన ట్రాకింగ్ వ్యవస్థ, 24 గంటలపాటు నిఘా వంటి చర్యలను తీసుకోవడం వల్ల ఇసుక అక్రమ రవాణా తగ్గిందన్నారు. హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్, బౌరంపేట్, వట్టినాగులపల్లిలో మూడు 'ఇసుక బజార్'లను ఇప్పటికే ప్రారంభించామని.. త్వరలో ఆదిభట్ల, ఉప్పల్, పటాన్‌చెరు ప్రాంతాల్లో మరో మూడు బజార్లను ప్రారంభిస్తామని చెప్పారు. ఇసుక బజార్లతో ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో దొడ్డు ఇసుక టన్ను ధర రూ.1,750కి పడిపోయిందన్నారు. ఇసుక బజార్ల ద్వారా టన్ను దొడ్డు ఇసుకను రూ.1,600, సన్న ఇసుకను రూ.1,800కు విక్రయిస్తున్నామని తెలిపారు. 2025-26 సంవత్సరంలో ఇసుక ద్వారా రూ.1,000-1,200 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

తొలి రోజు 99.67% మంది హాజరు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం.. పరీక్షలపై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు

» నాన్నను కోల్పోయిన దుఃఖాన్ని దిగమింగి పలు చోట్ల పరీక్ష రాసిన విద్యార్థినులు

» మంచిర్యాలలో తెలుగు ప్రశ్నపత్రం బదులు హిందీ పేపర్ బండిల్

» నల్లగొండలో వాట్సా‌ప్‌లో ప్రశ్నపత్రం!

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)





అబిడ్స్‌లోని ఓ పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన పదోతరగతి విద్యార్థులు, నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో వాట్సప్ గ్రూపుల్లో తిరిగిన పదో తరగతి తెలుగు ప్రశ్నపత్రం

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు, శుక్రవారం ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష 2,650 కేంద్రాల్లో సాఫీగా జరిగింది. మొత్తం 4.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 99.67 హాజరు శాతం నమోదైనట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేసే విధంగా పరీక్షలపై దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్నపత్రాల ఫొటోలను కొందరు వాట్సా‌ప్‌లో సర్క్యులేట్ చేసి విద్యార్థులను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు.

వాట్సా‌ప్‌లో 'పది' తెలుగు ప్రశ్నపత్రం

నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో శుక్రవారం వాట్సాప్ గ్రూపుల్లో పదో తరగతి తెలుగు ప్రశ్నపత్నం చక్కర్లు కొట్టడం చర్చనీయాంశమైంది. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవగా, అరగంటకే స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో ప్రశ్నపత్రం ప్రత్యక్షమైందన్న విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలిసింది. వాట్సాప్ గ్రూపుల్లో ఉన్న ప్రశ్నపత్రాన్ని నల్లగొండ డీఈవో బిక్షపతి శాలిగౌరారం ఎంఈవో సైదులుకు వాట్సాప్ చేశారు. వెంటనే ఆర్డీవో, ఇతర అధికారులు గీతాంజలి స్కూల్ పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. డీఈవో వాట్సా‌ప్‌లో పంపిన పేపర్‌పై ఉన్న వాటర్ మార్క్, నంబరు శాలిగౌరారం మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లోని నంబరుతో కలవకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో జిల్లాలోని అన్ని సెంటర్ల వద్ద విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు, పోలీసులు తనిఖీలు చేశారు. చివరకు నకిరేకల్‌లోని ఓ పరీక్షా కేంద్రంలో విధుల్లో ఉన్న వ్యక్తి ఒకరు ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసి వాట్సా‌ప్‌లో వేరేవారికి పంపారని, అది అక్కడి నుంచి ఇతర గ్రూపులకు వెళ్లిందని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా తాను శాలిగౌరారంలోని కేంద్రాల వరకే తనిఖీ చేశానని, అక్కడ ఎలాంటి పేపర్ లీక్ కాలేదని, నకిరేకల్ విషయం తనకు తెలియదని చెప్పారు. కాగా, నకిరేకల్‌లోని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు విద్యా శాఖకు సిఫారసు చేసినట్లు సమాచారం.

తండ్రి మరణించిన బాధలోనూ..

ఏడాదంతా కష్టపడి చదివిన ఆ విద్యార్థినులకు ఎక్కడ లేని కష్టం వచ్చింది. పదో తరగతి పరీక్షల తొలి రోజే కన్న తండ్రిని పోగొట్టుకొన్నారు. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి పరీక్షలు రాశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం తిలక్‌నగర్‌లో తండ్రిని కోల్పోయిన బాధలోనూ అక్కాచెల్లెళ్లు హర్షిత, ప్రియ శుక్రవారం పరీక్ష రాశారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో శ్రీలత, నారాయణపేటలో అంజమ్మ కూడా వారి తండ్రులను కోల్పోయిన బాధలోనూ పరీక్ష రాశారు. ఇక కూకట్‌పల్లిలోని ఓ ఇంటర్నేషనల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి ఫీజు కట్టలేదన్న కారణంతో హాల్‌టికెట్ ఇవ్వలేదు. అతని తండ్రి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా న్యాయసేవా సంస్థను సంప్రదించగా.. సీనియర్ సివిల్ జడ్జి డి.కిరణ్‌కుమార్ వెంటనే పాఠశాలకు ఫోన్ చేసి హాల్ టికెట్ ఇవ్వాలని ఆదేశించారు. మరోవైపు మంచిర్యాలలోని బాలుర పాఠశాలలో పదో తరగతి పరీక్ష తెలుగు పేపర్‌కు బదులు హిందీ ప్రశ్నపత్రాల కట్ట రావడంతో గందరగోళం నెలకొంది. విషయం తెలుసుకున్న కలెక్టర్ కుమార్ దీపక్ పరీక్ష కేంద్రానికి చేరుకొని, బోర్డు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి సూచనలతో పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన పెట్టెల నుంచి తెలుగు ప్రశ్నపత్రాలు ఉన్న ట్రంకు పెట్టెను తీసుకొచ్చారు. దీంతో విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సమయం ఇచ్చారు. వారికి స్నాక్స్, తాగునీరు అందించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగులను కలెక్టర్ సస్పెండ్ చేశారు.



జీహెచ్ఎంసీలో 'బిల్డ్ నౌ' షురూ

» అధికారులకు లాగిన్, పాస్‌వర్డ్ అందజేత

» హెచ్ఎండీఏలో ఏప్రిల్ మొదటి వారంలో!

» అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అమలు

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతులు వేగంగా ఇచ్చేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'బిల్డ్ నౌ' సేవలు హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ)లో అందుబాటులోకి వచ్చాయి. అధునాతన విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని శుక్రవారం నుంచి కల్పించారు. విస్తరిత హెచ్ఎండీఏలో ఏప్రిల్ మొదటి వారంలో దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా దశల వారీగా అమలు చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. నూతన విధానం అమల్లోకి తీసుకొచ్చిన దృష్ట్యా.. జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు శుక్రవారం లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు. ఒకే రాష్ట్రం, ఒకే విధానంలో సులభతర భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రభుత్వం బిల్డ్ నౌ సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. సామాన్యుల ఇంటి నుంచి ఆకాశ హర్మ్యాల వరకు బిల్డ్ నౌలో సులువుగా అనుమతులు పొందవచ్చు. గుర్తింపు పొందిన ఆర్కిటెక్ట్‌లు/స్ట్రక్చరల్ ఇంజనీర్ల ద్వారా అనుమతుల జారీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

'మహా' విస్తరణ అనుమతులు హెచ్ఎండీఏకే!

హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధి 10,474 చదరపు కిలోమీటర్లకు విస్తరించగా అందులో భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. విస్తరించిన ప్రాంతంలో ప్రస్తుతం డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) అనుమతులిస్తుండగా.. ఇకపై హెచ్ఎండీఏ అనుమతులిచ్చేలా చర్యలు చేపట్టారు. హెచ్ఎండీఏను విస్తరిస్తూ ఈ నెల 12న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులివ్వగా.. ఆ రోజు నుంచి విస్తరణ ప్రాంతంలోని దరఖాస్తులన్నీ హెచ్ఎండీఏ పరిష్కారం చేయనుంది. అంతకంటే ముందు దరఖాస్తులను డీటీసీపీ పరిష్కరించనుంది. అయితే భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల కోసం తీసుకొచ్చిన బిల్డ్ నౌ అప్లికేషన్‌లో హెచ్ఎండీఏ విస్తరించిన పరిధి మొత్తాన్నీ చేర్చేవిధంగా సాంకేతిక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం సూచనలు చేసింది.

రాష్ట్రంలో కొత్తగా 70 బార్లు!

(మొదటిపేజీ తరువాయి)

అనుమతులివ్వడంతో పాటు మైక్రోబ్రూవరీల సంఖ్యను పెంచాలని ఎక్సైజ్ శాఖ యోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 1,171 బార్లు ఉండగా.. వీటిలో సగం వరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌లోనే ఉన్నాయి. ఇవి కాకుండా 89 ఎలైట్ బార్లు, హైదరాబాద్, శంషాబాద్, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో 55 పబ్బులు కొనసాగుతున్నాయి. గత ఏడాది (2024-25లో) ఎక్సైజ్ శాఖ నుంచి రూ.25,617.53 కోట్ల ఆదాయం రావాలని లక్ష్యం నిర్దేశించినా.. చేరుకోలేకపోయింది. అయితే, ఈ ఏడాది (2025-26లో) రూ.27,623.36 కోట్లు రాబట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే కొత్త బార్లకు అనుమతులు ఇచ్చే దిశగా ఎక్సైజ్ శాఖ అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చివరిసారిగా 2021 ఫిబ్రవరి మొదటి వారంలో కొత్త బార్ల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఇప్పుడే తాజాగా కొత్త బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించబోతున్నారు. త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేసి, రెండు నెలల్లో కొత్త బార్లు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే, ఎలైట్ బార్లకు అనుమతులు ఇచ్చే విషయాన్నీ పరిశీలిస్తున్నారు. ఇందుకోసం రెగ్యులర్ లైసెన్స్ ఫీజు కంటే 25శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక బార్‌కు లైసెన్స్ ఫీజు రూ.40లక్షలు ఉంటే.. ఎలైట్ బార్‌కు రూ.50లక్షలు చెల్లించాలి. గతంలో ఎలైట్ బార్ల ఏర్పాటుకు ఎప్పుడుపడితే అప్పుడు అనుమతి ఇచ్చేవారు. గత ప్రభుత్వంలో కొందరికి మాత్రమే అనుమతులు ఇచ్చి.. ఆ తర్వాత ఇవ్వలేదు. తాజాగా వీటికీ అనుమతులు ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. అలాగే, రాష్ట్రంలో మైక్రో బ్రూవరీల సంఖ్యను 50కి పెంచాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై వంటి నగరాల్లో మైక్రోబ్రూవరీలు ఎక్కువగా ఉండగా.. హైదరాబాద్‌లో వాటి సంఖ్య పది లోపే ఉంది. ఈ నేపథ్యంలో వీటిని పెంచేందుకు కసరత్తు జరుగుతోంది.






రాష్ట్రం పరువు తీసింది
కేసీఆర్ కుటుంబమే: సీతక్క

» కేసీఆర్ అర్జునుడు కాదు.. అవినీతి పరుడు: జూపల్లి

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రం పరువు తీస్తున్నారంటూ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలకు మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు. "మీ కుటుంబమే రాష్ట్రం పరువు తీసింది. మాకు ఢిల్లీ వ్యాపారాలు తెలియవు. మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. కాంగ్రెస్‌ది త్యాగాల చరిత్ర" అని సీతక్క అన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్సేనని ఆరోపించారు. మహిళలకు అడుగడుగునా బీఆర్ఎస్ అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణాల్లో ఇష్టానుసారంగా అంచనాలు పెంచి దోచుకున్నారన్నారు. బీఆర్ఎస్ మొదటి సారి అధికారంలోకి వచ్చినప్పుడు 63సీట్లు వచ్చాయని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 65 సీట్లతో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే బంపర్ మెజారిటీ, తాము అధికారంలోకి వస్తే ఒక్క శాతంతో అధికారంలోకి వచ్చామనడం సరికాదన్నారు. కాగా, బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో బడ్జెట్ రూపొందించేటప్పుడు అన్ని అంశాలను కేసీఆర్ సునిశితంగా పరిశీలించేవారని, మహాభారతంలో అర్జునుడి మాదిరిగా ఆలోచించి నిర్ణయం తీసుకునేవారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కేసీఆర్ అర్జునుడు కాదు అవినీతిపరుడని విమర్శించారు. గత ప్రభుత్వ పాలన తీరుపై జూపల్లి మాట్లాడుతుండగా బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం చెప్పారు.

ఈసారి 2.65 లక్షల కోట్ల వ్యయం: దుద్దిళ్ల

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రాష్ట్ర ప్రభుత్వ వ్యయం రూ.2.60 లక్షల కోట్లను అధిగమిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది ప్రభుత్వ వ్యయం రూ.2.20 లక్షల కోట్లే ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని మీడియా ప్రతినిధులు గుర్తు చేయడంతో ఆయన స్పందిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో చివరి రెండు నెలలైన ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకే రూ.2.19 లక్షల కోట్ల బడ్జెట్ అంచనాలను రూ.2.65 లక్షల కోట్లకు సవరించామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూ.2,91,159 కోట్లు అని శ్రీధర్‌బాబు తెలిపారు.

కొత్త గురుకులాలపై స్పష్టత ఇవ్వాలి: అక్బరుద్దీన్




కొత్తగా నిర్మిస్తోన్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న గురుకులాలను అలాగే కొనసాగిస్తారా లేక యంగ్ ఇండియా సమీకృత గురుకులాల్లో విలీనం చేస్తారా అనే విషయంపై ఇంతవరకు స్పష్టత లేదన్నారు. కొత్తగా రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేస్తే ఇప్పటికే గత ప్రభుత్వ హయంలో లబ్ధిదారుడని, అనర్హుడిగా ప్రకటిస్తూ అప్లికేషన్ తిరస్కరణకు గురి అవుతోందంటూ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. జాబ్ కేలండర్ మాదిరిగానే ఓవర్సీస్ కేలండర్‌ను విడుదల చేయాలన్నారు.

అన్యాక్రాంత భూముల లెక్కలేవి?: కూనంనేని




భూముల అమ్మకం ద్వారా రూ.పదివేల కోట్లు సేకరించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ల్యాండ్ మాఫియా ఆక్రమణల్లో ఉన్న భూములను విడిపించి వాటిని అమ్మడం ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. 400 ఎకరాల భూముల అమ్మకంలో హెచ్‌సీయూకి చెందిన భూములూ ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. ఈ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. జీవో 59ని పూర్తిగా అమలు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని, జీవో 58 పేదలకు ఉపయోగపడుతుందని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఆర్టీసీని ప్రైవేటీకరిస్తారనే ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించాలన్నారు. రూ.25 వేల కోట్ల రుణమాఫీ చేయడం చిన్న విషయం కాదని, అయితే అనేక గ్రామాల్లో ఆధార్‌కార్డు సమస్యల వల్ల రుణమాఫీ పూర్తిగా జరగలేదని ఓ ఉదాహరణను ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. సింగరేణిలో బొగ్గు తీసే పని కాంట్రాక్టర్లకు ఇస్తున్నారని ఇది సరైన నిర్ణయం కాదని కూనంనేని అన్నారు.

రాష్ట్రం పరువు తీస్తున్న సీఎం: ఎమ్మెల్సీ కవిత



వాస్తవాలకు దూరంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని, కాంగ్రెస్ మార్కు అవినీతికి నిదర్శనంగా ఉందని ఎమ్మెల్సీ కవిత దుయ్యబట్టారు. రాష్ట్రానికి చోదకశక్తిగా పని చేయాల్సిన సీఎం.. రాష్ట్రం దివాలా తీసిందని ప్రకటించడం దురదృష్టకరమన్నారు. ఇలా చేస్తే దేశంలో రాష్ట్రం పరువు పోతుందని వ్యాఖ్యానించారు. పదేపదే అబద్ధాలు చెబుతున్న సీఎంకు గిన్నిస్ రికార్డు వచ్చినా ఆశ్చర్యం లేదని అన్నారు. శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ కేసీఆర్‌పై నిందలు మోపడమే లక్ష్యంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. సీఎం, మంత్రులు అబద్ధాలు చెప్పడం మానకపోతే ఈ నెల 27న సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ సభకు చుట్టపుచూపులా వచ్చి వెళ్తున్నారని, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంగా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు.

ప్రతిబంధకంగా వారసత్వ అప్పులు: కోదండరాం



2025-26 బడ్జెట్ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుత ప్రభుత్వానికి ప్రతిబంధకంగా మారాయన్నారు. గత ప్రభుత్వం పూర్తిగా అప్పులపై ఆధారపడిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణుల అభిప్రాయాలు తీసుకోలేదని, ఇప్పుడు ఆ ప్రాజెక్టుపై ఖర్చు చేస్తే వృథా అవుతుందని పేర్కొన్నారు.

రేపోమాపో కాళేశ్వరంపై విచారణ నివేదిక

» కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రేపో మాపో కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ నివేదిక వస్తుందని, మంత్రులు కూడా ఇదే సంగతి చెప్పారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఆ నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలవుతున్నా బీఆర్ఎస్ కుంభకోణాలపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్పందిస్తూ బీఆర్ఎస్ వారి అవినీతిపై ప్రభుత్వం కేసులు నమోదు చేయగానే కేంద్రం పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపన్ను విభాగం (ఐటీ డిపార్ట్‌మెంట్) తెరమీదకు వస్తున్నాయన్నారు. ఈడీ, ఐటీ రాకతో ఈ కేసులు నీరుగారిపోతున్నాయని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ అవినీతిని కప్పిపుచ్చిన బీజేపీ.. ఇప్పటికీ ఆ పార్టీని కాపాడుతున్నదని అన్నారు.

రోడ్లు లేవని పిల్లనిస్తలేరు!

» వికారాబాద్ గ్రామాల్లో అధ్వానంగా రోడ్లు
» స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు
» మామ, అల్లుడు, బామ్మర్దే రోడ్లు వేసుకున్నరు: కోమటిరెడ్డి
» గత కాంగ్రెస్ ప్రభుత్వాలే రోడ్లు వేయలేదు
» బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు కౌంటర్




హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు పరస్పరం వ్యంగ్యాస్త్రాలు సంధించుకున్నారు. ఇందులో స్పీకర్ ప్రసాద్‌కుమార్ కూడా పాలుపంచుకున్నారు. 2025-26 వార్షిక బడ్జెట్‌పై చర్చలో భాగంగా గ్రామీణ రోడ్లపై చర్చలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మామ గజ్వేల్‌లో, అల్లుడు సిద్దిపేటలో, బామ్మర్ది సిరిసిల్లలో మాత్రమే రోడ్లు వేసుకున్నారని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ పక్కనే ఉన్న దుబ్బాకలో కూడా రోడ్లు సరిగ్గా లేవన్నారు. సింగరేణికి చెందిన డిస్ట్రిక్ట్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్ డబ్బులతో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో రోడ్లు వేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడైనా గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు ఉన్నాయా? అని ప్రశ్నించారు. రోడ్లు వేస్తే కమీషన్లు రావనే వాటిని పక్కనపెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ కల్పించుకుంటూ.. వికారాబాద్ జిల్లాలో గ్రామాలకు రోడ్లు సరిగాలేక.. అబ్బాయిలకు పిల్లనివ్వడంలేదని అన్నారు. దీనిపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో గ్రామాల్లో రోడ్లు లేకనే అబ్బాయిలకు పిల్లనివ్వలేదన్నారు. తమ ప్రభుత్వం హయాంలో గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రోడ్లు వేశామని తెలిపారు. కాగా, 10 ఏళ్లపాటు రోడ్లపై పడ్డ గుంతలు పూడ్చలేదని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. తాము ఏటా 4 వేల కిలోమీటర్ల మేర రోడ్లు వేయడానికే హ్యామ్ విధానం తెచ్చామని అన్నారు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఓఆర్ఆర్‌ను అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని మండిపడ్డారు. హరీశ్‌రావుకు ఏమీ తెలియదని, కొందరు ఆయనను ముందుపెట్టి మాట్లాడిస్తున్నారని అన్నారు.

తెలంగాణ.. తిరోగమనం!

(మొదటిపేజీ తరువాయి)



ఎర్రర్ కారణంగా ట్రెరర్‌ను చవిచూపిస్తున్నారంటూ ఆక్షేపించారు. శుక్రవారం శాసనసభలో 2025-26 బడ్జెట్‌పై హరీశ్‌రావు మాట్లాడారు. "బడ్జెట్‌లోని 72 పేజీలు, 500 పేజీల పెన్‌డ్రైవ్‌లోని అంశాలన్నీ చదివాను. ఎన్నికల ముందు నో ఎల్ఆర్ఎస్, నో బీఆర్ఎస్ అని పిలుపునిచ్చి.. అధికారంలోకి రాగానే ముక్కు పిండి ఎల్ఆర్ఎస్ వసూలు చేస్తున్నారు. ఆ రోజు ప్రభుత్వ భూములను అమ్ముతుంటే.. భూములు పెద్దలిచ్చిన ఆస్తి అని, అమ్మవద్దని అన్నరు. ఇవాళ మాత్రం అమ్మేస్తున్నరు. గత బడ్జెట్‌లో 4.5 లక్షల ఇళ్లు కడతామని చెప్పి.. నాలుగు ఇళ్లు కూడా కట్టలేదు. జాబ్ క్యాలెండర్.. జాబ్‌లెస్ క్యాలెండర్ అయింది. ఆరు పెండింగ్ ప్రాజెక్టుల్లో ఒక్కటీ పూర్తికాలేదు. బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప ఏమీ లేదు" అని హరీశ్ ధ్వజమెత్తారు. మహిళలకు వడ్డీలేని రుణం ఇవ్వనందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు బతుకుదెరువు కల్పించాలి..

బడ్జెట్ అంటే ప్రజలకు బతుకుదెరువు కల్పించాలని, వారి బాధలు తీర్చాలని హరీశ్‌రావు అన్నారు. కానీ, తాజా బడ్జెట్‌లో అంకెలు చూస్తే ఆర్భాటం.. పనులు చూస్తే డొల్లతనం అని ఆక్షేపించారు. "ఆదాయాన్ని పెంచుతాం.. హామీలన్నీ నెరవేరుస్తామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజల్ని నమ్మించారు. కానీ, 15 నెలల ఆచరణలో ఏం జరిగిందో ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు మళ్లీ రూ.3,04,965 కోట్లతో బడ్జెట్ అని మరో గాలిమేడ కట్టారు. ఇది నిరాశాజనకమైన బడ్జెట్. కాంగ్రెస్ విఫల పాలనతో రాష్ట్ర ఆదాయం అంతకంతకూ క్షీణిస్తోంది. అందిన కాడికి అప్పులు చేసుడు, విచ్చలవిడిగా భూములు అమ్ముడు. ఇదే మీ మార్కు పాలన" అని హరీశ్ విమర్శలు గుప్పించారు. దేశంలో ఎక్కడా కనిపించని ఆర్థిక మాంద్యం తెలంగాణలోనే ఎందుకు ఉందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అహంకారం, అనాలోచిత నిర్ణయాలు, ప్రతీకార రాజకీయాల వల్ల రాష్ట్ర ఆదాయం కుంటుపడిందని ఆరోపించారు. పదేళ్ల తమ పాలనలో అన్నిరంగాల్లో వృద్ధి నమోదయిందని, కానీ.. ఇప్పుడు రాష్ట్రంలో వాహనాల అమ్మకం తగ్గిందని, జీఎస్టీ వృద్ధిరేటు తగ్గిందని తెలిపారు. "దీనికి కారణం ఆర్థిక మాంద్యమా, లేక మీ బుద్ధి మాంద్యమో ఆత్మవిమర్శ చేసుకోండి" అని హితవు పలికారు. దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీసిందని ప్రకటించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

భయానక వాతావరణం సృష్టించినందునే..

ఆర్థిక క్షీణతను దివాళా అని ప్రచారం చేయడం, ఫార్మాసిటీ రద్దు, హైడ్రా పేరిట కూల్చివేతలు, భయానక వాతావరణం సృష్టించడం.. సంక్షేమ పథకాల ద్వారా సాగుతున్న ద్రవ్య ప్రవాహానికి అడ్డుకట్ట వేయడమేనని హరీశ్‌రావు అన్నారు. "స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీలో రుణమాఫీకి రూ.49,500 కోట్లు కావాలని చెప్పారు. ఒక్క సంవత్సరం అవినీతి చేయకుండా కడుపు కట్టుకుంటే రూ.41 వేల కోట్లు ఒక్క దెబ్బకు మాఫీ అవుతాయని చెప్పారు. గత బడ్జెట్ ప్రసంగలో రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవుతాయని చెప్పి రూ.20 వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. సిద్దిపేటలో 43,363 మంది రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటే 20,514 మందికే రుణమాఫీ అయింది. రూ.2 లక్షల లోపు రుణమాఫీ కాని రైతులే 10 వేల దాకా ఉన్నారు. ఏ ఒక్క ఊరుకైనా వెళ్లి.. వందశాతం రుణమాఫీ జరిగిన ట్లు నిరూపిస్తే బహిరంగ క్షమాపణ చెప్పడానికి సిద్ధం" అని హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 289 గురుకులాలు ఉంటే.. తాము వాటిని 1020కి పెంచామని, విద్యార్థుల సంఖ్యను 1.50 లక్షల నుంచి 6 లక్షలకు చేర్చామన్నారు. కానీ, 15 నెలల్లో 83 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. వెయ్యికిపైగా పాఠశాలలు మూతపడ్డాయని అన్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ అని చెప్పి.. 5 వేల పోస్టులతో దగా డీఎస్సీ వేశారని ఆరోపించారు.



ఒక్క రూపాయి ఫీజు కూడా చెల్లించలేదు..

ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 15 నెలల్లో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఉద్యోగాల నియామక ప్రక్రియ అంతా తమ హయాంలో పూర్తయితే.. నియామక పత్రాలు మాత్రమే ఇచ్చి, 57 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. గ్రామాల్లో రోడ్ల కోసం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ తెస్తున్నామన్నారని, గ్రామాల్లో కూడా టోల్ గేట్లు పెడతారా? అని ప్రశ్నించారు. పదేళ్లలో తాముచేసిన అప్పు రూ.4,22,674 కోట్లు మాత్రమేనన్నారు. శాసనసభ బయట ప్రశ్నిస్తే జైల్లో వేస్తున్నారని, లోపల ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తున్నారని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్న భాషకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. అడ్డగోలుగా మాట్లాడొద్దని, అలా అయితే తమ సభ్యులు కూడా ఊరుకోరని హెచ్చరించారు. కాగా, ప్రజా సమస్యలపై శాసనసభలో తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం పారిపోయిందని హరీశ్‌రావు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అందాల పోటీలు ముఖ్యం కాదని, కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేంద్రం నిధులిప్పిస్తామంటే మూసీపై చర్చకు రెడీ: మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మూసీ నది పునరుజ్జీవనానికి కేంద్రం నుంచి నిధులు ఇప్పిస్తామంటే కచ్చితంగా దానిపై చర్చ పెడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీలో శుక్రవారం చర్చలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ పునర్జీవనంపై చర్చ పెట్టాలన్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ గుజరాత్‌లో సబర్మతి తరహాలోనే తెలంగాణలో మూసీ నదిని రూపొందించాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో అధ్యయనం జరిపి వచ్చామని తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా చాలా మందిని తరలించామని, వారందరికీ పునరావాసం కల్పించడంతోపాటు ఆర్థిక సాయం కూడా అందజేశామన్నారు.

హరీషన్నా.. ఏంటి సంగతులు..

'ఏం హరీషన్నా.. ఏంటి సంగతులు' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును మంత్రి పొన్నం ప్రభాకర్ పలకరించారు. శుక్రవారం మంత్రి పొన్నం.. ప్రతిపక్ష బీఆర్ఎస్ బెంచ్‌ల వైపు వెళ్లారు. అక్కడికి వెళ్లి హరీష్‌రావుతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆ సంభాషణలో పరస్పరం జోకులు వేసుకోవడంతో ఇద్దరి మధ్య నవ్వులు విరబూశాయి.

అక్కా.. నమస్తే

'అక్కా నమస్తే' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునితా లక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డిలకు మంత్రి పొన్నం ప్రభాకర్ నమస్కరించారు. సునితా లక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డి కుర్చీల దగ్గరకే మంత్రి పొన్నం వెళ్లారు. దీంతో సునిత, సబితలతోపాటు మంత్రి పొన్నం నిలబడే కొద్దిసేపు ముచ్చట్లు పెట్టారు. ఆ తరువాత వెళ్లొస్తానని వారితో చెబుతూ మంత్రి పొన్నం తన కుర్చీ దగ్గరకు వెళ్లారు.

కాంగ్రెస్‌ది అభయ హస్తం కాదు..
కుటిల హస్తం

» ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులెక్కడ?
» మంత్రులు రైజింగ్‌లో ఉంటే.. ప్రజలు ఫాలింగ్‌లో ఉన్నారు: ఏలేటి
» సమాధానమిచ్చిన జూపల్లి, దుద్దిళ్ల



హైదరాబాద్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీది అభయ హస్తం కాదని, కుటిల, కపట, భస్మాసుర హస్తమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రైజింగ్ తెలంగాణ అని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా.. నలుగురు క్యాబినెట్ మంత్రులే రైజింగ్‌లో ఉన్నారని, తెలంగాణ ప్రజలు ఫాలింగ్‌లో ఉన్నారని చెప్పారు. బడ్జెట్‌పై శుక్రవారం శాసన సభలో ఏలేటి మాట్లాడారు. హామీలకు పాతర వేసి తెలంగాణకు మొండి చేయి చూపేలా బడ్జెట్ ఉందన్నారు. అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టుతున్నారని, రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. ఆరు గ్యారెంటీలకు, ఇందిరమ్మ ఇళ్లకు, ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలకు బడ్జెట్‌లో సరిపడా కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రూ.1,63,000 కోట్ల అప్పులు ఎందుకు చేశారో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని కోరారు. 20 శాతం కమిషన్ ఇస్తే తప్ప బకాయిలు ఇవ్వడం లేదని గుత్తేదారులు నినాదాలు చేసే పరిస్థితి రాష్ట్రంలో ఉండటం బాధాకరం అన్నారు. భూభారతి బిల్లు ఆమోదం పొంది 4 నెలలు గడిచినా ఇంత వరకు విధివిధానాలను ఎందుకు అమలు చేయడం లేదని ఏలేటి ప్రశ్నించారు. రూ.2.50 లక్షల కోట్ల విలువ చేసే 25 వేల ఎకరాల భూములు చేతులు మారాయని ప్రకటించిన ప్రభుత్వం విచారణ ఎందుకు చేపట్టడం లేదన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉందంటూనే లక్షల కోట్లతో మూసీ పునరుజ్జీవనాన్ని ఎందుకు తెరమీదకు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడులను ఆకర్షించేందుకే మూసీ

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకే మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు చేపడుతున్నామని మంత్రి జూపల్లి ఏలేటి ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. మూసీ పునరుజ్జీవనంతో ఉపాధి అవకాశాలు మెరుగు పడుతాయన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ సిద్ధమవుతుందని చెప్పారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

ఏలేటి వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని, రాసిపెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలే అయినా.. ఇప్పటికే కొన్ని హామీలను అమలు చేశామన్నారు. సభకు వస్తున్న తనను పోలీసులు అడ్డుకున్నారని ఏలేటి స్పీకర్‌కు చేసిన ఫిర్యాదు మంత్రి స్పందించారు. అసెంబ్లీ ఆవరణకు బయట ఆ సంఘటన జరిగిందని సభ్యుడు చెప్పినట్లు అసెంబ్లీ ఆవరణలో జరగలేదన్నారు. సభ్యుల గౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

హరీశ్ పద్ధతిగా మాట్లాడాలి

సీఎంకు అజ్ఞానం.. మంత్రులకు బుద్ధిమాంద్యం అంటారా?.. మాది వాస్తవాల ఆధారంగా ప్రవేశపెట్టిన బడ్జెట్

» బీఆర్ఎస్‌లా ఆదాయం లేకున్నా.. పెంచుకుంటూ పోలేదు
» రాష్ట్రాన్ని గాలికొదిలేసినవారే క్షమాపణ చెప్పాలి: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడిన తీరును తప్పుబట్టారు. భాష విషయంలో పద్ధతిగా ఉండాలని హితవు పలికారు. సభా నాయకుడికి అజ్ఞానం, మంత్రులకు బుద్ధి మాంద్యం అంటూ హరీశ్‌రావు మాట్లాడటం సమంజసమా? అని ప్రశ్నించారు. శుక్రవారం శాసనసభ, శాసనమండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు భట్టివిక్రమార్క సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాల ఆధారంగా 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, బీఆర్ఎస్‌లా బడ్జెట్‌ను పెంచుకుంటూ పోలేదని చెప్పారు. వారిలాగా పెంచితే ప్రస్తుత బడ్జెట్ కూడా రూ.4.18 లక్షల కోట్లకు చేరేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆదాయం ఉన్నా, లేకున్నా బడ్జెట్‌ను పెంచుతూ పోయారని విమర్శించారు. గత ప్రభుత్వం ఏనాడూ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదన్నారు. 2016-17లో రూ.8 వేల కోట్లు, 2018-19లో రూ.40 వేల కోట్లు, 2021-22లో రూ.48 వేల కోట్లు, 2022-23లో రూ.52 వేల కోట్లకు పైగా, 2023-24లో రూ.58,571 కోట్లు ఖర్చు చేయలేదని వివరించారు. ఔటర్ రింగు రోడ్డును 30 ఏళ్ల లీజుతో రూ.7వేల కోట్లకు అమ్ముకున్నారని, దొడ్డిదారిన ప్రభుత్వ భూములను విక్రయించారని ఆరోపించారు. తరువాత వచ్చే ప్రభుత్వాలకు దక్కాల్సిన రాబడులను కూడా ముందే గుంజేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెరవేర్చలేని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. "మీ పదేళ్ల కాలంలో రూ.16.70 లక్షల కోట్లు ఖర్చు చేశారు. నాగార్జునసాగర్‌ను కట్టారా? బీడీఎల్, ఈసీఐఎల్, ఔటర్ రింగు రోడ్డు, ఎయిర్‌పోర్టును నిర్మించారా? రూ.లక్ష కోట్లతో కాళేశ్వరాన్ని నిర్మించినా అది కూలిపోయింది" అని భట్టివిక్రమార్క ధ్వజమెత్తారు.

పదేళ్లలో చేసిన రుణమాఫీ ఎంత?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.2.80 లక్షల కోట్లు ఖర్చు చేశామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇందులో వేతనాలకు రూ.77 వేల కోట్లు, అప్పులకు రూ.88వేల కోట్లు, పథకాలకు రూ.1.34 లక్షల కోట్లు వెచ్చించామని వివరించారు. ఆదాయం రూ.2.80 లక్షల కోట్లు రాగా, ఖర్చు రూ.2.99 కోట్లు చేశామని పేర్కొన్నారు. జీఎస్టీ వృద్ధిరేటులో దేశం కంటే తెలంగాణ తక్కువగా ఉందని హరీశ్‌రావు అంటున్నారని, కానీ.. బీఆర్ఎస్ హయాంలో జీఎస్టీ 8.4 శాతం ఉండగా, తమ ప్రభుత్వ హయాంలో అది 12.3 శాతంగా ఉందని చెప్పారు. పదేళ్లలో లక్ష ఇళ్లను కూడా నిర్మించలేదని, వాటి గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు పెట్టలేదని, ఒకవేళ నిర్వహించినా ప్రశ్నాపత్రాలు లీకయ్యాయని పేర్కొన్నారు. నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం పథకం కింద రూ.6 వేల కోట్లను ఇవ్వబోతున్నామని ప్రకటించారు. బ్రాహ్మణ పరిషత్తుకు రూ.100 కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. ఆర్య వైశ్యుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.25 కోట్లు కేటాయించామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన రుణాల మాఫీ ఎంత? అని డిప్యూటీ సీఎం భట్టి ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన కొద్దికాలానికే రూ.20,617 కోట్లను ఒకేసారి మాఫీ చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో ఇసుక విక్రయాలు జరిగినా రూ.6వేల కోట్లు ఖజానాకు రాకుండా పోయాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఇసుక మాఫియాను కట్టడి చేయడంతోపాటు పారదర్శక విధానాన్ని తీసుకురావడంతో ఇసుక విక్రయాల ద్వారా రోజుకు రూ.3 కోట్ల ఆదాయం వస్తోందని తెలిపారు. భవిష్యత్తులోనూ వనరుల దోపిడీని అడ్డుకుని.. ఆదాయం పెంచుతామని అన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న బీఆర్ఎస్.. ఇచ్చిందా? అని ప్రశ్నించారు.

స్వేచ్ఛ గురించి బీఆర్ఎస్ మాట్లాడితే ఎలా?

స్వేచ్ఛ గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడటమా! అని భట్టివిక్రమార్క ఎద్దేవా చేశారు. ఒక్కరోజైనా ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించారా అని ప్రశ్నించారు. అయినా తాము తలవంచుకుని పని చేసుకుంటూ వెళ్లామని, ఏనాడూ సభా నాయకుడిపై నోరు జారలేదని అన్నారు. ఇంట్లో నుంచి బయటకు వద్దామనుకున్నా అరెస్టు చేసేవారని గుర్తు చేశారు. నీటి దోపిడీని చూసేందుకు వెళితే.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సహకరిస్తూ, తమను అరెస్టు చేశారని అన్నారు. రాష్ట్రానికి నీళ్లు రాకుండా చేసింది బీఆర్ఎస్సేనని ఆరోపించారు. పోడు భూములు ఇవ్వమని అడిగిన మహిళలను చెట్టుకు కట్టేసి కొట్టిన చరిత్ర వారిదని మండిపడ్డారు. తాము గిరిజనుల కోసం రూ.12,600 కోట్లతో ఇందిర జల గిరివికాసం పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. పదేళ్లలో సంక్షేమం కోసం రూ.1.81 లక్షల కోట్లు కేటాయించినా అందులో రూ.70,475 కోట్లు ఖర్చే చేయలేదని పేర్కొన్నారు. దళిత బంధు పేరుతో రూ.17,700 కోట్లు కేటాయించినా.. ఒక్క పైసా విడుదల చేయలేదన్నారు. తమ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు గాలికి వదిలేసిన వారే క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 58 సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఎల్ఆర్ఎస్‌ను తీసుకువచ్చిందే బీఆర్ఎస్ అని, తాము ప్రజలకు ఇబ్బంది లేకుండా అమలు చేస్తున్నామని తెలిపారు.

న్యాయవాదులు, గుమాస్తాల సంక్షేమ బిల్లులకు ఆమోదం

» కొత్త హైకోర్టు ఆవరణలో లా వర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు, గుమాస్తాల సంక్షేమ బిల్లులను శాసనసభ శుక్రవారం ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, బార్ కౌన్సిల్ ప్రతిపాదన మేరకు ఈ బిల్లులను రూపొందించామని, ప్రస్తుతం ఒక్కో కేసుకు రూ.100 టికెట్ వసూలు చేస్తున్నారని, దానిని రూ.250కి పెంచుతున్నామని తెలిపారు. ఇందులో రూ.215 న్యాయవాదుల సంక్షేమ నిధికి, రూ.35 గుమాస్తాల సంక్షేమ నిధికి వెళ్తాయని చెప్పారు. ఈ నిధుల నుంచి న్యాయవాదులు, గుమాస్తాలకు సంబంధించి ఆరోగ్య బీమా, పింఛన్, జీవితబీమాలకు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. న్యాయవాదుల రక్షణ బిల్లుపై తాము ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, ఈ బిల్లు తయారీపై కసరత్తు జరుగుతోందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అప్పట్లో న్యాయవాద దంపతులను పట్టపగలే హత్య చేసిన విషయం ఇంకా కళ్లలో మెదలుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల సంక్షేమనిధిని రూ.200 కోట్లకు పెంచాలనే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. వంద ఎకరాల స్థలంలో నిర్మించనున్న నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు ప్రతిపాదనను కూడా హైకోర్టు న్యాయమూర్తుల దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు.

గాలి వాన దుమారం

పలు జిల్లాల్లో వర్షం, వడగళ్లు.. చొప్పదండి మార్కెట్‌లో తడిసిన మక్కలు

- కాగజ్‌నగర్‌లో గోడ కూలి వృద్ధుడి మృతి
- నేడు, రేపు పలు జిల్లాలకు వర్ష సూచన
- అప్రమత్తంగా ఉండండి: అధికారులకు సీఎం రేవంత్, సీఎస్ ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


కుమరం భీం జిల్లా రెబ్బెన మండలంలో గోలేటి వద్ద రోడ్డుపై విరిగి పడిన చెట్లు

రాష్ట్రంలో పలు జిల్లాల్లో శుక్రవారం ఈదురు గాలులతో వర్షం పడింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం పలుచోట్ల గాలివానతో వర్షం కురిసింది. గాలి తీవ్రతకు వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేల కూలి పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని నవ్‌గామ్ బస్తీలో ఇంటి గోడ కూలి దౌలత్(65) అనే వృద్ధుడు మృతి చెందాడు. కరీంనగర్ జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు తీసుకువచ్చిన మక్కలు తడిసిపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. పెద్దపల్లి జిల్లాలోనూ వర్షం కురిసింది. జగిత్యాల జిల్లాలోని కొన్ని మండలాల్లో వడగళ్ల వాన కురిసింది. మామిడికాయలు నేల రాలిపోయాయి. పొట్ట దశలో ఉన్న వరి పంట నేలవాలింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని ఫారెస్టు కార్యాలయం నుంచి ఎస్పీఎం గేటు వరకు చెట్లు విరిగి పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అకాల వర్షం పడింది. కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ వర్షం పడింది. లింగంపేట మండలం పోతాయిపల్లి, లింగంపల్లి గ్రామాల్లో పిడుగు పాటుకు రెండు గేదెలు, మూడు మేకలు మృతి చెందాయి. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు రైతులు తీసుకొచ్చిన పసుపు బస్తాలు వర్షానికి తడిసి ముద్దగా మారాయి. మెదక్ ఉమ్మడి జిల్లాలో శుక్రవారం సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసింది. మెదక్ జిల్లా కేంద్రంలో పిడుగుపాటుకు బిల్డింగ్ పెచ్చులు ఊడి ఓ చిన్నారి గాయపడింది. కొల్చారం మండలం లో గాలివానకు పలుచోట్ల చెట్లు, కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. రాష్ట్రంలో శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, వడగళ్ల వానలు కొన్ని జిల్లాల్లో పడతాయని వెల్లడించింది. మేడ్చల్, సిద్దిపేట, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు వర్ష సూచన జారీ చేసింది. కాగా ఈదురు గాలులు, వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వడగళ్ల వాన కురిసిన జిల్లాల్లో అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఆమె సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఎండలూ మండుతున్నాయి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో శుక్రవారం 39.3 డిగ్రీలు, అలంపూర్‌లో 39.2 డిగ్రీలు, ధరూర్‌లో 39.1 డిగ్రీలు, గద్వాల, మల్దకల్ కేటీదొడ్డి, అయిజలలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయ్యింది.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


లచ్చమ్మ(ఫైల్)

వడదెబ్బ తగిలి ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌లో చోటు చేసుకున్నది. ర్యాకల్ గ్రామానికి చెందిన బోయిని లచ్చమ్మ (52) శుక్రవారం ఉపాధి హామీ పనికి వెళ్లి వడదెబ్బ తగలడంతో స్పృహ తప్పి పడిపోయింది. నారాయణఖేడ్ వైద్యశాలకు తరలించగా.. అక్కడికి చేరుకునేసరికి మృతి చెందింది.

ప్రైవేటు ఆస్పత్రిలో అదుపు తప్పిన లిఫ్ట్

- స్ట్రెచర్‌పైనే ప్రాణాలు విడిచిన మహిళ

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మీది అంతస్తుకు వెళ్లాల్సిన లిఫ్ట్ సాంకేతిక సమస్య కారణంగా ఆకస్మాత్తుగా, అతివేగంగా కిందికి పడిపోయి నేలకు ఢీకొట్టడంతో అందులోని ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. లిఫ్టులో స్ట్రెచర్‌పై ఉన్న ఆమె దానిపైనే కన్నుమూసింది. ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో ఉన్న ప్రసూన ఆస్పత్రిలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం వనంవారి కిష్టాపురం గ్రామానికి చెందిన సట్టు సరోజిని(63)కి ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు గురువారం ఆమెను ఈ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ఆమెకు యాంజియోగ్రామ్ నిర్వహించి ఇంటికి పంపించారు. తిరిగి శుక్రవారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన సరోజినికి మళ్లీ పరీక్షలు నిర్వహించి స్టంట్ వేయాలని చెప్పారు. కుటుంబసభ్యులు అంగీకరించడంతో విజయవంతంగా స్టంట్ వేశారు. ఆపరేషన్ అనంతరం ఆమెను థియేటర్ ఉన్న రెండో అంతస్తు నుంచి ఐసీయూ వార్డు (నాలుగో అంతస్తు)కి తరలించేందుకు స్ట్రెచర్‌పై పడుకోబెట్టి లిఫ్ట్‌లోకి తీసుకువచ్చారు. ఆమె వెంట ఇద్దరు ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు. లిఫ్ట్‌లో బటన్‌ను నొక్కగానే పైకి వెళ్లడానికి బదులు, ఉన్నట్టుండి ఒక్కసారిగా రెండో ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. దీంతో స్ట్రెచర్‌పై ఉన్న సరోజిని లిఫ్ట్‌లోనే ప్రాణం విడిచింది. ఆమెతో పాటు ఉన్న ఆస్పత్రి సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. లిఫ్ట్ సెన్సర్లు పనిచేయక పోవడం వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఏడేళ్ల క్రితం ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.